ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 138 పేజీలు: 8+4 వెల: 6.50


ఒప్పందం నచ్చకపోతే మళ్లీ దాడులే: ట్రంప్ హెచ్చరిక
5లో
ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన టెలిగ్రామ్

21న రాష్ట్ర వ్యాప్త సమన్వయంతో యోగా దినోత్సవం

కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు

ఇప్పటిదాకా 2.6 లక్షల మందికి శిక్షణ

ఉన్నత స్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు


బుధవారం సచివాలయంలో యోగాంధ్రపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

# యోగాతో ఆరోగ్య విప్లవం

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా ద్వారా ఆరోగ్య విప్లవం సాధ్యమగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఈ నెల జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 'యోగాంధ్ర-2026' ఏర్పాట్లపె బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంజరిగింది. ఈ సమావేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజాఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని సిఎం దిశానిర్దేశం చేశారు. యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సిఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగాంధ్ర-2026లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల >>2

భారత్‌తో త్వరలోనే

# ట్రేడ్ డీల్

ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చల్లో ప్రకటించిన యుఎస్ అధ్యక్షుడు ట్రంప్

మోడీ మాకు ఆప్తమిత్రుడు.. త్వరలోనే భారత్ వస్తా

నావికుల భద్రత భారత్‌కు కీలకమన్న ప్రధాని మోడీ

హార్ముజ్‌ను తెరవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకం

పశ్చిమాసియా శాంతికి కృషి చేసిన ట్రంప్‌కు మోడీ ప్రశంసలు



గురువారం ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో భేటీ అయిన ప్రధాని మోడీ, యుఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్

**ఎవియాన్ (ఫ్రాన్స్), జూన్ 17:** హార్మూజ్ జలసంధిని తెరవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. అదే సమయంలో హార్మూజ్ జలసంధిలో నావికుల భద్రత భారత్‌కు ఎంతో ముఖ్యమని ప్రధాని మోడీ అమెరికాకు స్పష్టంచేశారు. ఫ్రాన్స్‌లో దాదాపు 16 నెలల తర్వాత ప్రధాని మోడీ, ట్రంప్ ప్రత్యేకంగా సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు జరిపారు. ఈ ద్వైపాక్షిక చర్చల్లో భారత్, అమెరికా మధ్య సంబంధాలను రీసెట్ చేయడంపైనే ఇరు నేతలు ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ 'మిస్టర్ ప్రెసిడెంట్, మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా ఉంది. గత ఏడాది వాషింగ్టన్‌లో మనం కలుసుకున్నప్పటి నుండి మన దేశాల బంధంలో సరికొత్త వేగం, సరికొత్త శక్తి వచ్చాయి. మన రెండు బృందాలు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి తాము వేగంగా ప్రయత్నాలు చేస్తున్నాము" అని ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ప్రధాని >>2

# రుషికొండ ప్యాలెస్‌కు కొత్త రూపు


బుధవారం రుషికొండ ప్యాలెస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

లగ్జరీ రిసార్ట్‌గా మార్చే యోచన, ప్రజల సందర్శనార్థం హెరిటేజ్ సెంటర్ ప్రతిపాదన

రుషికొండ భవనాలను పరిశీలించిన కేబినెట్ సబ్ కమిటీ

**విశాఖపట్నం, జూన్ 17, ప్రభాతవార్త :** రుషికొండలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవన సముదాయాన్ని కూల్చివేయకుండా ప్రజాధనం వృథా కాకుండా పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో అంతర్జాతీయ స్థాయి లగ్జరీ రిసార్ట్‌గా అభివృద్ధి చేయాలని కేబినెట్ సబ్ కమిటీ ప్రాథమికంగా నిర్ణయించింది. విశాఖ ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఒక బ్లాక్‌ను కల్చరల్ లేదా హెరిటేజ్ సెంటర్‌గా అభివృద్ధి చేసి ప్రజల సందర్శనార్థం అందుబాటులోఉంచే ప్రతిపాదననుకూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామితో కూడిన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం రుషికొండ భవన సముదాయాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. భవనాల్లోని వివిధ బ్లాక్‌లు, గదులు, నిర్మాణ శైలి, అంతర్గత వసతులు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలను స్వయంగా తనిఖీ చేసింది. అనంతరం విశాఖపట్నంలోని యాత్రినివాస్‌లో పర్యాటక శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రుల బృందం భవనాల భవిష్యత్తు వినియోగంపై విస్తృతంగా చర్చించింది. ప్రజాభిప్రాయాలు, ప్రభుత్వ అవసరాలు, నిర్వహణ వ్యయాలు, ఆదాయ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని రిసార్ట్‌గా వినియోగించడమే సముచితమనే అభిప్రాయానికి వచ్చినట్లుతెలిపింది. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, భవనాల నిర్వహణకు నెలకు భారీ వ్యయం అవసరమ >>2

# డిఎస్సీపై తగిన జవాబిస్తా

మాజీ సిఎం చర్చకు రావొచ్చు..

మంగళగిరి నియోజకవర్గం ఇక నం.1

ఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదు: మంత్రి లోకేష్



**విజయవాడ, జూన్ 17, ప్రభాతవార్తప్రతినిధి:** డిఎస్సీపై ఎలాంటి అనుమానాలు ఉన్నా సమాధానం చెప్పేందుకు సిద్ధమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. తాడేపల్లి ప్యాలెస్‌కు కూతవేటు దూరంలోనే ఉన్నానని దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. గొడ్డలి పార్టీ నేతల్లా బురద చల్లి పారిపోయే రకం కాదని స్పష్టం చేశారు. జగన్ ఎన్ని జన్మలెత్తినా డిఎస్సీ నియామకాలు ఆపలేరన్నారు. మహిళల్ని కించపరిచే వారిని, తిట్టేవారిని తన చుట్టూ ప్రిజనరీ పెట్టుకున్నారని జగన్‌ను ఉద్దేశించి లోకేష్ వ్యాఖ్యానించారు. ఐఎఎస్ అధికారిని ముందుపెట్టుకుని స్పోర్ట్స్ కోటాలో ఒకే సామాజికవర్గం వారికి ఉద్యోగాలు ఇచ్చారని దుష్ప్రచారం చేస్తున్నారు. మేం వాస్తవాలు బహిర్గతం చేశాం. సదరు వ్యక్తి కమాపణలు చెప్పాలి కదా. బురదజల్లి పారిపోతున్నారు. జగన్ రెడ్డి ఇంటికి 200 మీటర్ల దూరంలోనే ఉన్నా. ఎప్పుడైనా చర్చకు సిద్ధమే. మా సమాధానాలపై జగన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేస్తున్నా అన్నారు. ఐదేళ్లలో జగన్ రెడ్డి ఒక్క డిఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే హారిజాంటల్ రిజర్వేషన్ అంటే ఏమిటో అర్థమై ఉండేది. మీరు ముందు సబ్జెక్ట్ తెలుసుకోవాలి.

ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ కులం కార్డు కూడా తీసుకువచ్చారు. దౌర్భాగ్యం ఏంటంటే 2014-19 మధ్య కూడా డిఎస్సీ ప్రమోషన్లలో ఒకే సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారని దుష్ప్రచారం చేశారు. ప్రజలు కూడా నమ్మారు. తర్వాత వాస్తవాలు బహిర్గతం అయ్యాయి. ఇప్పుడు కూడా పనికిమాలిన రిటైర్డ్ మంత్రి అనితను ఉద్దేశించి గుడివాడ అమర్నాథ్ అద్భుతంగా మాట్లాడారని జగన్ కితాబుఇవ్వటం దురదృష్టకరమన్నారు. భారతీరెడ్డిని, తన ఇద్దరుకూతుళ్లని హోం మంత్రిని అవమానించినట్లు అవమానిస్తే కూడా జగన్ శభాష్ అంటారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీది ఆ సంస్కృతి కాదు కాబట్టే జగన్ కుటుంబసభ్యుల్ని కించపరిచిన వారిపైనా చర్యలు తీసుకున్నామని లోకేష్ తెలిపారు. మంగళగిరిని >>2

43 మంది ప్రభుత్వ

# డాక్టర్ల డిస్మిస్

మరో 34 మంది రాజీనామాలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ వైద్య సేవలకు దూరంగా అనధికారికంగా విధులకు గైర్హాజరీలో ఉన్న 43 మంది వైద్యుల (సివిల్ అసిస్టెంట్ సర్జన్ )పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. గరిష్టంగా నాలుగేళ్ల నుంచి విధులకు రాకుండా ఉన్న వీరికి నిబందనలు అనుసరించి సంజాయిషీ నోటీసుల జారీతోపాటు అభియోగాలు నమోదుచేసినప్పటికీ స్పందన లభించనందున విధుల నుంచి శాశ్వతంగా తప్పించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన జారీచేశారు. గతనెలలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని బోధనాసు పత్రుల్లో పనిచేసే వైద్యుల్లో 51 మంది అనధికారికంగా విధులకు దూరంగా ప్రభుత్వ నిబంధనలు అనుసరించి తప్పించారు. ఇదేవిధంగా ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోనూ జరిగేందుకు అవసరమైన చర్యలు తుదిదశకు చేరుకున్నాయి. వీరిలో జనరల్ మెడిసిన్, >>2

విజయవాడ రౌడీషీటర్ మిస్సింగ్ కేసు

# సిఐ సస్పెన్షన్‌కు సిఎం ఆదేశం

**విజయవాడ, జూన్ 17 (ప్రభాతవార్త):** విజయవాడలో కలకలం రేపుతున్న రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అలియాస్ పిల్లసాయి మిస్సింగ్ కేసులో కృష్ణలంక సిఐ నాగరాజును సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన ముగించుకుని సచివాలయానికి చేరుకున్న వెంటనే పోలీస్ ఉన్నతాధికారులను పిలిపించుకుని గాదె సాయికృష్ణ అదృశ్యం ఘటనపై డిప్యూటీ సిఎంతో కలిసి సమీక్షించారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటనకు సంబంధించిన వివరాలను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటుగా, డిజిపి హరీష్ కుమార్‌గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని, సాయికృష్ణ అదృశ్యం ఘటనపై సీనియర్ ఐపిఎస్ అధికారితో దర్యాప్తుచేపట్టాని ముఖ్యమంత్రి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. సాయికృష్ణ ఘటనపై నిష్పాక్షపాతంగా దర్యాప్తు జరపాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

విజయవాడలో నగర బహిష్కరణకు గురైన గాదె సాయికృష్ణను విజయవాడ,కృష్ణలంక పోలీసులు మే 9న మార్కాపురం నుండి తీసుకువచ్చి చిత్రహింసలకు గురి చేయగా చనిపోయినట్లు అతని తల్లి, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని దాచిపెట్టిన పోలీసులు గుట్టు చప్పుడు కాకుండా బస్టాండు ఎదురుగా ఉన్న విద్యుత్ స్మశాన వాటికలో తగులబెట్టేశారని పేర్కొంటున్నారు. కాగా, సాయి ఆచూకీ కోసం అతని తల్లి బంధువులు కృష్ణలంక సిఐ నాగరాజును సంప్రదించగా దురుసుగా సమాధానం ఇవ్వడమే కాకుండా 'నీ కొడుకు చనిపోయాడనుకో' అంటూ దురుసుగా ప్రవర్తించడం మరింత ఆజ్యం పోసింది. ఈ సంఘటనపై విచారించడానికి వెళ్లిన వారితో పోలీసులు దురుసుగా వ్యవహరించడం ఈ వ్యవహారాన్ని మరింత జఠిలం చేసింది.

విజయవాడ, కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ (25) అలియాస్ పిల్లసాయి పలు కేసులలో నిందితుడు. హత్య కేసుతో పాటు, అత్యాచారం, పలువురిపై దాడులు, గంజాయికేసులు ఉన్నాయి. నగర బహిష్కరణ సైతం అమలు అవుతోంది. ఆరు నెలల క్రితం విజయవాడలోని రౌడీ షీటర్లు పలువురు జగ్గయ్యపేటలో ఒక >>2






బుధవారం హనుమకొండలో జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్‌ని పరామర్శిస్తున్న డి.సిఎం పవన్

## హనుమకొండలో చిన్నారి అభిమానిని పరామర్శించిన డి.సిఎం పవన్

**హన్మకొండ బ్యూరో. జూన్ 17. ప్రభాత వార్త:** చిలువేరు శంకర్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హనుమకొండ విచ్చేసి నిస్సాహిక స్థితిలో జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న పొనుగోటి నిరంజన్ ని పరామర్శించారు. అనంతరం చిలువేరు శంకర్ ద్వారా నిరంజన్ అనారోగ్య పరిస్థితిని పవన్ కల్యాణ్ తెలుసుకుని ఆర్థిక సహాయం చేశారు. నిరంజన్ తల్లిదండ్రులకు క్యాంటిన్ పెట్టిస్తాను కూడా భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో వరంగల్ కి నిన్ను చూడ్డానికి మళ్లీ వస్తా అని పవన్ ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. నిండు మానవతా దృక్పథంతో పొనుగోటి నిరంజన్‌కి పవన్ కల్యాణ్ ని కల్పించాలని నేను చేసిన మానవతా ప్రయత్నం విజయం సాధించాను అని చిలువేరు కొమర స్వామి తెలిపారు.

## సిఐ సస్పెన్షన్‌కు సిఎం ఆదేశం

>> వ్యక్తి పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ భవానీపురానికి చెందిన నవీన్ రెడ్డి అనే వ్యక్తితో పిల్ల సాయికి చిన్న ఘర్షణ జరిగింది. దీంతో ఆవేశానికి గురైన సాయికృష్ణ (పిల్లసాయి) కత్తితో విచక్షణా రహితంగా నవీన్ రెడ్డిని పొడిచి చంపాడు. నవీన్ రెడ్డి అంత్యక్రియల సందర్భంగా రౌడీషీటర్లు సృష్టించిన హంగామాతో విజయవాడలో మళ్లీ రౌడీ గ్యాంగ్‌లు చెలరేగుతున్నాయా అనే ఆందోళన అందరిలోనూ మొదలైంది. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపారు. బైండోవర్లు చేయడంతో పాటు నిత్యం కౌన్సిలింగ్‌లు మొదలు పెట్టారు. ప్రవర్తన మార్చుకోని కొందరిపై నగర బహిష్కరణ వేటు వేశారు. వీరిలో సాయికృష్ణ ఒకడు.

## రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటుపై జీవో జారీ

**విజయవాడ జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ జీవో నంబర్ 362 ను విడుదల చేసింది. 12 జిల్లాల్లో ఎపిటిడిసి గుర్తించిన చోట్ల వీటి ఏర్పాటుకు విధివిధానాలు రూపొందించారు. ఈ యేడాది సెప్టెంబరు 1 నుంచి 2029 ఆగస్టు వరకు బీచ్ షాక్స్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశారు. పైలట్ ప్రాజెక్టు కింద సూర్యలంక విశాఖ బీచ్‌ల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. బీచ్ షాక్స్ తీరం వెంబడి ఏర్పాటు చేసే తాత్కాలిక, పర్యావరణ అనుకూల నిర్మాణాలు, ఎండలో సేద తీరడానికి బీచ్ బెడ్‌లుంటాయి. ఇక్కడి నుంచే ఆహారం ఆర్డర్ చేయవచ్చు. సముద్ర ఉత్పత్తులు, ప్రాంతీయ వంటకాలు, కాక్‌టెయిల్, బీర్లు, తాజా జ్యూస్‌లు లభిస్తాయి. పర్యాటకు కోసం వాష్ రూమ్స్ షవర్ సౌకర్యాలు రానున్నాయి.

## అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందే

### అధికారులు, ఉద్యోగుల పనితీరుపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి ఒక్క అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ నెల నుంచి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "పాలనా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు దాటింది. తప్పులు జరగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి. లోపాలు ఏమైనా ఉంటే వాటిని ఏ విధంగా సరి చేయాలనే అంశం మీద ఫోకస్ పెట్టాను. అధికారులు, ఉద్యోగులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలి. ప్రజలకు సేవలు అందించే విషయంలో ఏ మాత్రం నిరక్ష్యం వహించవద్దు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలి. ఫీల్డులోని సమస్యలను స్వయంగా పరిశీలిస్తే అధికార యంత్రాంగం మీద ప్రజల్లో మరింత నమ్మకాన్ని పొందగలం. తనిఖీలు చేస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు మొదలకుని క్షేత్రస్థాయి అధికారి వరకు అందరూ పని చేయాలి. జూలై నెల నుంచి ప్రతి అధికారి ఫీల్డుకు వెళ్లాల్సిందే. వారంలో మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే చెప్పాం. దాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలి. జిల్లా కలెక్టర్లు ప్రతి నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలని సూచించాం. దాన్ని పక్కాగా అమలు చేయాలి. అలాగే నియోజకవర్గాల నోడల్ అధికారులు నెలలో ఒకే మండలాన్ని నాలుగు సార్లు సందర్శించాలి. అధికారులు, ఉద్యోగుల పనితీరు మీద 360 డిగ్రీల్లో విశ్లేషిస్తాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**దేవాదాయ శాఖ పనితీరు మరింత మెరుగవ్వాలి**

"దేవాలయాల్లో భక్తులకు మరింత సేవలు అందించేలా దేవదాయ శాఖ మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం కన్పిస్తోంది. దేవదాయ శాఖ ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడాలి. అన్ని శాఖల్లోని ఉద్యోగుల పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఈ మేరకు ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇప్పించాలి. పరిపాలనలో సింగపూర్ దేశం వినూత్న విధానాలను అవలంభిస్తోంది. పరిపాలన విషయంలో ఆ దేశ విధానాలను పరిశీలించాలి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొత్తంగా 11,600 గుంతలు ఉన్నట్టు గుర్తించాం. వీటిల్లో 79 శాతం గుంతలను పూడ్చాం. మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలి. ముఖ్యంగా అర్బన్‌రూరల్ కనెక్టివిటీ రోడ్లల్లో మరమ్మత్తులు త్వరగా చేపట్టాలి. అలాగే రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు సంబంధించి ఆర్ అండ్ బి మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలి."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**గవర్నెన్సుకు టెక్నాలజీ అనుసంధానం... కలిసి పని చేసేందుకు గూగుల్ అంగీకారం..**

"డేటా డ్రివెన్ గవర్నెన్సులో గూగుల్ మనతో కలిసి పని చేయడానికి అంగీకరించింది. వాణిజ్య పన్నుల శాఖ ఇప్పటికే గూగుల్ తో కలిసి పని చేస్తోంది. ఆ దిశగా మిగిలిన శాఖల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పీజీఆర్ఎస్ లో ప్రజలిచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. ఈ మేరకు అర్జీదారులే స్వయంగా వారి అర్జీలను ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించాలి. తామిచ్చిన ఫిర్యాదు ఏ మేరకు పరిష్కారమవుతోందోననే అంశాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా ట్రాకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

# యోగాతో ఆరోగ్య విప్లవం

>> భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర నిర్వహణకు తీసుకున్న చర్యలు, ఏర్పాట్లపై సిఎం అడిగి తెలుసుకున్నారు.
ఈ నెల 20న ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో బాబా రాందేవ్‌తో కలిసి సిఎం పాల్గొననున్నారు. 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్టేడియంలో 5 వేలు నుంచి 6 వేల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా బాబా రాందేవ్ సహా ముఖ్యమంత్రి హాజరవుతారు. వర్షం కారణంగా ఏమైనా అవాంతరం తలెత్తితే.. ప్రత్యామ్నాయంగా విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో వెయ్యి మందితో స్టేట్ ఈవెంట్ నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యోగా ప్రచారంలో భాగంగా 19వ తేదీనే రాష్ట్రానికి వస్తున్న బాబా రాందేవ్... అదే రోజు ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటివరకు 2.6 లక్షల మందిని ట్రైనర్లుగా తీర్చిదిద్దినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 21న యోగాడేలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటికి మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ముఖ్యమంత్రికి తెలిపారు. 18వ తేదీ నుంచి 20 వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు అధికారులు వివరించారు. 21వ తేదీన 1.33 లక్షల సెంటర్లలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని సిఎంకు తెలిపారు. 21 తేదీన 'యోగా డెస్టినేషన్' పేరుతో వచ్చే యేడాది యోగా డే వరకు కేలండర్‌ను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

# భారత్‌తో త్వరలోనే ట్రేడ్ డీల్

>> మోడీ అభినందించారు. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నావికుల్లో దాదాపు 10శాతం మంది భారతీయులే ఉన్నారని గుర్తు చేస్తూ, వారి భద్రతపై మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర వాణిజ్యంలో భారతదేశానికి చెందిన లక్షలాది మంది నావికులు ప్రపంచంలోని వివిధ సముద్రాల్లో తమ సేవలను అందిస్తున్నారని, ప్రపంచ ప్రగతిలో గొప్ప సహకారం అందిస్తున్నారని వివరించారు. ఇటీవల హార్మూజ్‌లో భారత జెండా ఉన్న నౌకపై అమెరికా దాడి చేసిన నేపథ్యంలో ప్రధాని ఆ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. నావికుల భద్రత తమకు చాలా కీలకమన్నారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛా నౌకాయానం ఉండేలా చూడాలన్నారు. హార్మూజ్ ప్రాంతం వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని, అంతర్జాతీయ నౌకాయానం స్వేచ్ఛగా సాగాలని ఆయన నొక్కి చెప్పారు.

**త్వరలోనే ట్రేడ్ డీల్:**

మోడీ మాకు ఆప్తమిత్రుడు.. భారత్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటాం' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. త్వరలోనే ఇరుదేశాల మధ్య మెగా ట్రేడ్ డీల్ కుదురబోతుందని ప్రకటించారు. ఇరుదేశాల మధ్య గత కొంతకాలంగా నడుస్తున్న వాణిజ్య వివాదాలకు త్వరలోనే తెరపడనుందని ఈ భేటీ ద్వారా స్పష్టమైంది. భారత్‌అమెరికా మధ్య త్వరలోనే ఒక భారీ ట్రేడ్ డీల్ కుదరబోతుందని ఇరుపక్షాలు వెల్లడించాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందిస్తూ 'భారతదేశంలో తాము భారీగా పెట్టుబడులు పెడుతున్నాం. ప్రధాని మోడీ మాకు అత్యంత ఆప్తమిత్రుడు. అమెరికా ఎల్లప్పుడూ భారత్‌కు అండగా ఉంటుంది" అని చెప్పారు. ప్రధాని మోడీతో మంచి చర్చలు జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. తాము వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నట్లు చెప్పిన ఆయన అమెరికా, భారత్ మధ్య చాలా మంచి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అమెరికా మునుపెన్నడూ లేనంతగా అద్భుతంగా రాణిస్తోందన్నారు. యుఎస్‌కు 19.2 ట్రిలియన్లపైగా ఆదాయం వస్తోందని తాము ఫ్యాక్టరీలతో పాటు మరెన్నో నిర్మిస్తున్నామని ట్రంప్ వివరించారు. ప్రధాని మోడీ అమెరికాలో చాలా ప్రాజెక్టులు చేపడుతున్నారని ట్రంప్ వెల్లడించారు. అమెరికాలో చాలా డబ్బు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. మోడీ నాయకుడిగా ఉన్నంతకాలం ప్రపంచ వేదికపై భారత్ కీలక పాత్ర పోషిస్తుందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.
"ఆయన (మోడీ) చాలా సమర్థుడు. ఆయన చాలా కఠినమైనవారు. కానీ చూడటానికి చాలా మంచిగా కనిపిస్తారు. కాబట్టి ఆయన మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తారు. కానీ ఇలాంటి వారు చాలా తక్కువ మంది ఉంటారు. ఆయన చాలా మంచివాడని ప్రజలు అంటారు. నేను అంటాను, మంచివాడా? ఆయన చాలా కఠినమైనవారు. ఆయన కఠినమైన సంధానకర్త. ఈయన భారత ప్రజలను ప్రేమిస్తారు, అమెరికాను కూడా ప్రేమిస్తారు. హ్యూస్టన్‌లో తాము 'హౌడీ మోడీ' కార్యక్రమం నిర్వహించాము, గుర్తుంది కదా? అప్పుడు స్టేడియం మొత్తం నిండిపోయింది. పశ్చిమాసియాలో భారత్ కూడా కీలక పాత్ర పోషిస్తుందని అని చెబుతున్నా. ప్రతి విషయంలోనూ భారత్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నా. తాను చెప్పినట్లు, తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం, వైట్ హౌస్‌లో వారికి (భారత్‌కు) ఒక గొప్ప స్నేహితుడు ఉంటాడు. ఎక్కడైనా సమస్య ఉందేమో నాకు తెలియదు. కానీ నేను అలా అనుకోవడం లేదు. ఇక్కడున్న ప్రతి ఒక్కరూ భారతదేశాన్ని ప్రేమిస్తారని, ఈయన పట్ల వారికి అపారమైన గౌరవం ఉందని తాను మీకు చెప్పగలను' అని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా రక్షణ సహకారం బలంగా ఉందని ట్రంప్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్‌పై దాడి జరిగితే అమెరికా అక్కడ వెంటనే ఉంటుందని హామీ ఇచ్చారు. 'ఒకవేళ భారత్‌కు కొత్త నాయకుడు వస్తే మాత్రం, దాని గురించి నాకు కచ్చితంగా తెలియదు. కొత్త నాయకుడు ఉంటే, నాకు తెలియదు. కానీ ఈయన నాయకుడిగా ఉన్నప్పుడు వారిపై దాడి జరిగితే, తాము సహాయం చేయడానికి అండగా ఉంటాము' అని ట్రంప్ పేర్కొన్నారు. త్వరలోనే భారత్ పర్యటనకు వస్తానని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు.

**భారత నిపుణుల అవకాశాలకు ట్రంప్ మద్దతు:**

అమెరికాలో అత్యున్నత నైపుణ్యం కలిగిన భారతీయ నిపుణులకు లభించే అవకాశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం మద్దతు ప్రకటించారు. భారతీయులను "అత్యంత ప్రతిభావంతులు"గా అభివర్ణించిన ఆయన, రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న ఉపాధి సంబంధాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. తన అధ్యక్షతన కూడా అత్యున్నత నైపుణ్యం కలిగిన భారతీయ నిపుణులకు అమెరికాలో అవకాశాలు లభిస్తూనే ఉంటాయా అని అడిగినప్పుడు, ట్రంప్ సానుకూలంగా స్పందించారు. "ఓహ్ అవును, ఖచ్చితంగా. ఎప్పుడూ అలాగే ఉంటుంది" అని ట్రంప్ అన్నారు. "ఉపాధి విషయంలో భారత్‌తో మాకు ఎప్పుడూ అద్భుతమైన సంబంధాలు ఉన్నాయి. అమెరికాకు అత్యున్నత నైపుణ్యం కలిగిన కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులను అందించే ప్రధాన దేశాలలో ఒకటిగా ఉన్న భారత్‌లో ఈ వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తించే అవకాశం ఉంది" అని వాషింగ్టన్, న్యూఢిల్లీ మధ్య ఉన్న సంబంధాల బలాన్ని పదేపదే నొక్కి చెబుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## రుషికొండ ప్యాలెస్‌కు కొత్త రూపు

>> వుతుందని, ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా ఆదాయం వచ్చేలా హాస్పిటాలిటీ రంగంలో వినియోగించడంపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయని, త్వరలో అధికారిక నోటిఫికేషన్ జారీ చేసి అర్హత గల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తామని తెలిపారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సుమారు రూ.450 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాల్లో అత్యంత విలాసవంతమైన సౌకర్యాలు కల్పించారని విమర్శించారు. ప్రజాధన వినియోగంపై ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, గతంలో ఆదాయం తెచ్చిన హరిత రిసార్ట్స్‌ను తొలగించి ఈ నిర్మాణాలు చేపట్టడం వల్ల పర్యాటక శాఖకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రస్తుతం ఈ ఆస్తిని సమర్థవంతంగా వినియోగించి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, భవనాలను కూల్చివేయకుండా ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగిస్తామని, సామాన్య ప్రజలు, ప్రకృతి ప్రేమికులు రుషికొండను సందర్శించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రుషికొండ భవనాల భవిష్యత్తు వినియోగంపై సమగ్ర నివేదికను త్వరలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే కేబినెట్ సమావేశానికి సమర్పించనున్నట్లు కేబినెట్ సబ్ కమిటీ వెల్లడించింది.

## ఆక్వా రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత

### రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, లక్షలాది మంది రైతుల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన ఆక్వాకల్చర్ రంగం స్థిరాభివృద్ధికి, ఆక్వా రైతుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర మత్స్య శాఖ కమినషర్ రామశంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్వా రైతుల సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగం స్థిరాభివృద్ధి మరియు పారదర్శకమైన మేత ధరల విధానం పట్ల ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని ఆయన తెలిపారు.

**వాస్తవ నిర్ధారణ లేని అపోహలను నమ్మకండి**

రైతులు, భాగస్వామ్య వర్గాలు మరియు ప్రజలు వాస్తవ నిర్ధారణ లేని అపోహలను నమ్మకుండా, అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని ఆయన కోరారు. రొయ్యల మేత ధరలు లేదా ఇతర ఆక్వా సంబంధిత అంశాలపై ఏవైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే సంబంధిత జిల్లా లేదా స్థానిక మత్స్యశాఖ అధికారులను సంప్రదించి తగిన సమాచారం పొందవచ్చని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆక్వాకల్చర్ రంగం మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అన్ని వర్గాలతో సమన్వయంతో పని చేస్తూ, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన ప్రతి చర్యను కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

**అంతర్జాతీయ, జాతీయ మార్కెట్ పరిస్థితుల ప్రభావం**

రొయ్యల మేత తయారీలో వినియోగించే ప్రధాన ముడి పదార్థాలైన ఫిష్ మీల్, సోయాబీన్ ఉత్పత్తులు, గోధుమ ఆధారిత పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు మరియు ఇతర పోషక పదార్థాల ధరలు గత కొన్ని నెలలుగా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గణనీయంగా పెరిగాయన్నారు. ఫలితంగా మేత తయారీ సంస్థల ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగిన విషయం గమనార్హం అన్నారు. ముఖ్యంగా ఫిష్ మీల్ మరియు సోయాబీన్ ధరలు గత ఆరు నెలల కాలంలో 25 శాతం కంటే ఎక్కువ మేర పెరగడం, రవాణా వ్యయాలు పెరగడం, ఇతర ముడి పదార్థాల లభ్యత తగ్గడం వంటి కారణాలు మేత ఉత్పత్తి వ్యయంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయన్నారు.

## వారం - వర్జ్యం

18-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
చవితి రా.7.05
పుష్యమి ఉ.11.36
వర్జ్యం : రా.11.38-రా.1.09
దు.ఉ.9.57-ఉ.10.49,
2)మ.3.12-సా.4.04
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ధైర్యం, పట్టుదలతో ముందుకు సాగుతారు. ఋణాలు తీరుస్తారు. ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. రాజకీయ రంగాల వారికి అన్ని విధాలా అనుకూలిస్తుంది.

**మిథునం:** మిత్రుల సహాయంతో అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ధనలాభం పొందుతారు. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కర్కాటకం:** ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. సమస్యలను ఎంతో నేర్పుతో పరిష్కరించుకుంటారు.

**సింహం:** అభివృద్ధి కార్యక్రమాలు వెనువెంటనే కాక భవిష్యత్తులో కలిసి వస్తాయి. ఉద్యోగాల వేటలో సఫలత సాధిస్తారు.

**కన్య :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. కోర్టు కేసుల నుండి బయట పడతారు. దీర్ఘకాలి ఋణాలు తీరుస్తారు.

**తుల:** సంఘంలో పేరు ప్రఖ్యాతలు ఇనుమడిస్తాయి. అమ్మకాలు కొనుగోలు వ్యవహారాలలో లాభపడతారు.

**వృశ్చికం:** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా ఉండండి.

**ధనుస్సు:** పెద్దల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మీరు మనో ధైర్యంతో ముందుకు సాగుతారు.

**మకరం:** ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలను శ్రమించి సాధిస్తారు. ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించండి. వాహనసౌఖ్యం.

**కుంభం:** తండ్రి నుండి వారసత్వ రీత్యా రావలసిన ఆస్తి రాకపోగా అపవాదులను ఎదుర్కో వలసి వస్తుంది. స్పెక్యులేషన్స్‌కు దూరంగా వుండండి.

**మీనం:** మోసకారి మాటలు చెప్పే వారి నుండి దూరంగా ఉండటం చెప్పదగినవి. కొంతలో కొంత మంచిఫలితాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్



బుధవారం నిడమర్రు ఆర్వోబీ నిర్మాణం తదితర పనుల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శిలా ఫలకాలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

## ఎటువంటి సమస్యనైనా పరిష్కరిస్తాం

### నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి లోకేష్ శంకుస్థాపన

**విజయవాడ,జూన్17.ప్రభాతవార్తప్రతినిధి:** ఎటువంటి సమస్యనైనా శాశ్వతంగా పరిష్కరించే దిశలో కూటమి ప్రభుత్వం కార్యచరణ చేపడుతుందని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులకు ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమరావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్ లో ఈ ప్రాంతంలో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయంలో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది.
నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ రైల్వే లైన్ పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వే లైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్లు రహదారి ఏర్పాటుచేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5..2) 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. సర్వీస్ రోడ్లతో సహా ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**రూ.1,167 కోట్ల వ్యయంతో ఎంటీఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం..**

మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ఎంటీఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ వ్యవస్థ నిర్మించి మురుగు కనుమరుగయ్యేలా చేస్తామని ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది. తాడేపల్లిలోని ప్రాతూరు రోడ్డులో మంగళగిరి, తాడేపల్లి నగర ప్రజల చిరకాల కోరిక అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పథకం మొదటి దశ పనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

## డిఎస్సీపై తగిన జవాబిస్తా

>> ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేష్ పునరుద్ఘాటించారు. అందులో భాగంగానే రైల్వే వంతెన, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. నిడమర్రు రైల్వే వంతెన నిర్మాణ పనులకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి లోకేష్ శంకుస్థాపన చేశారు. రెండు కోట్లతో నిర్మించిన మంగళగిరి మండలం కాజా లేక్ పార్క్‌ను లోకేష్ ప్రారంభించారు. మంగళగిరి ప్రజల దశాబ్దాల కల నేటితో నెరవేరబోతుందన్నారు. అమరావతిని నిర్వీర్యం చేసేందుకు జగన్ వెస్ట్ బైపాస్ రోడ్డుకు రాజధానితో అనుసంధానం లేకుండా చేశారని లోకేష్ మండిపడ్డారు. త్వరలోనే అన్ని అడ్డంకులు తొలగుతాయని హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషి చేశారు. కాజ ఈస్ట్ లేక్ పార్క్‌ను కేంద్రమంత్రి పెమ్మసానితో కలిసి మంత్రి లోకేష్ ప్రారంభించారు. రూ.3.3 కోట్ల వ్యయంతో పార్క్ నిర్మాణ చేశారు. పార్క్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని లోకేష్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సందర్భంగా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. 2019లో 5,300 ఓట్ల తేడాతో మంగళగిరిలో నేను ఓడిపోయాను. మొదటి రోజు బాధ, ఆవేదన కలిగింది. రెండో రోజు ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఊరూరా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నా. 2024 ఎన్నికల్లో 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే కొండంత బలం వస్తుందని చెప్పాను. నా కోరికను మన్నించి రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీతో గెలిపించారు. నాపై ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. గెలిచిన మొదటిరోజు నుంచే మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ పవర్ మొత్తం మంగళగిరి నియోజకవర్గానికి ఏర్పాటుచేస్తున్నాం. దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ ప్రారంభించాం. లైబ్రరీలకు పూర్వవైభవం తీసుకువస్తున్నాం. మంగళగిరి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. పార్క్‌లు, లేక్‌లు, కమ్యూనిటీ భవనాలు, చివరకు శ్మశానాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం. రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. మంగళగిరికి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను తీసుకువచ్చాం. ఎంపీ పెమ్మసాని కేంద్రంతో మాట్లాడి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మంగళగిరికి మంజూరు చేయించారు. ఇది మంగళగిరి ప్రజల అదృష్టం. మంగళగిరి నియోజకవర్గ వాసిగా ఈ ప్రాజెక్ట్ ను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించాను. అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గం నెం.1గా ఉండాలనేది లక్ష ్యం. ఇందుకోసం అహర్నిశలు కష్టపడతా. రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు మోడల్‌గా మంగళగిరిని రూపొందిస్తాం. మిగతా నియోజకవర్గాల్లో కూడా దశలవారీగా చేపడతాని అన్నారు.

## 43 మంది ప్రభుత్వ డాక్టర్ల డిస్మిస్

>> ఆర్థో, గైనిక్ ఇతర వైద్యులు ఉన్నారు .

**మరో 34 మంది రాజీనామాల సమర్పణ**

వాస్తవానికి 118 మంది పర్మినెంట్ వైద్యులు అనధికారికంగా విధులకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడాదికి మించి అనధికారికంగా విధులకు దూరంగా ఉంటే విధుల నుచి తప్పించవచ్చు. వీరిపై ప్రభుత్వ నిబంధన అనుసరించి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే 43 మంది వైద్యులను శాశ్వతంగా విధుల నుంచి తప్పించే ప్రక్రియ మొదలైంది. ఈ 43 మంది కాకుండా మరో 34 మంది వైద్యులు సంజాయిషీ నోటీసులు జారీ, అభియోగాల నమోదు అనంతరం రాజీనామాలు చేశారు. వీరిలో 15 మంది రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించబోతుంది. అభియోగాల నమోదు అనంతరం మిగిలిన 19 మంది రాజీనామాలు చేసినందున క్రమశిక్షణ (సిసిఎ రూల్సు 1991) చర్యల్లో భాగంగా జిల్లాల వారీగా 11 మంది విచారణ అధికారులను నియమించారు. వీరి సదరు వైద్యుల నుంచి వివరణ కోరి, ఇచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబ వెల్లడించారు. అభియోగాల నమోదు అనతరం మరో 19 మంది వైద్యులు వ్యక్తిగత కారణాలవల్ల విధులకు హాజరుకాలేదని వివరణ ఇచ్చారు. దీనిపై విచారణ జరగనుంది. సంజాయిషీల నోటీసులు జారీ జరిగిన తర్వాత 9 మంది విధుల్లో చేరారు. మరో 13 మంది వైద్యుల అభ్యర్థనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

# సిట్ లేదా సిబిఐకి లాకప్‌డెత్ కేసు అప్పగించాలి

## సిఐ నాగరాజుతో పాటు స్టేషన్ సిబ్బంది మొత్తం నిందితులే: సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి

**విజయవాడ కార్పొరేషన్,జూన్ 17,ప్రభాతవార్త:** సాయికృష్ణ లాకప్‌డెత్ కేసును సిట్ లేదా సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని,గాదె సాయికృష్ణను లాకప్‌డెత్ చేసిన వారిలో కృష్ణలంక సిఐ నాగరాజుతో పాటు స్టేషన్ సిబ్బంది మొత్తం నిందితులేనని అతని తల్లి విజయలక్ష్మి ఆరోపించింది. కృష్ణలంక లోని ఆమె ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కృష్ణలంక పోలీసులు తన నుండి ఫోన్‌ను లాక్కెళ్ళారని ఆ ఫోన్ కాల్ డేటా ఆధారంగా మార్కాపురంలో జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న తన కుమారుడు సాయి కృష్ణను పట్టుకుని కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చారన్నారు. తన కుమారుడు తనకు తరచూ ఫోన్ చేస్తూ ఉండేవాడని,ఎన్నిసార్లు అడిగినా తన ఫోన్‌ను పోలీసులు తనకివ్వలేదని, అతనిని అదుపులోకి తీసుకున్న తర్వాత తన ఫోన్‌ను తనకిచ్చారని,సిఐ నాగరాజుతో పాటు స్టేషన్ సిబ్బంది మొత్తం విచక్షణారహితంగా తన కుమారుడు గాదె సాయికృష్ణను కొట్టారని,గోళ్ళు పెకలించడంతో పాటు ఇష్టంవచ్చినట్లు కొట్టడంతో ఆ దెబ్బలకు తాళలేక తన కుమారుడు మృతి చెందాడని,తాము భావిస్తున్నామని ఆమె రోదిస్తూ వెల్లడించారు.మృతి చెందిన అనంతరం శరీరాన్ని దహనం చేశారని ఆరోపించారు. మార్కాపురం



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

వెళ్ళి విచారించగా కృష్ణలంక పోలీసులు వచ్చి తన కుమారుడిని తీసుకెళ్ళినట్లు తనతో పాటు మార్కాపురం వచ్చిన న్యాయవాదులకు అక్కడి వారు చెప్పారన్నారు. నా పరిస్థితి, నా కుమారుని పరిస్థితి ఇంకెవ్వరికీ రాకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశానన్నారు. చనిపోయిన వాడిపై నిందలు వేయడం సరికాదన్నారు. సాయికృష్ణను చంపేసి రాజకీయాలతో ముడిపెడుతున్నారన్నారు. మేనమామలు ముళ్ళపూడి నవరంగ్, ముళ్ళపూడి నాగేశ్వరరావులు మాట్లాడుతూ సాయికృష్ణ పవన్‌కళ్యాణ్ వీరాభిమాని అని అతనికి ఏ పార్టీలోనూ సభ్యత్వం లేదన్నారు. తమకు జనసేన,కూటమి పార్టీ సభ్యత్వాలున్నాయన్నారు. జనసేన పార్టీ తూర్పు నియోజక వర్గ ఇన్‌ఛార్జి అమ్మిశెట్టి వాసు తమ ఇంటికి వచ్చి మనం మనం కాపు కులస్థులం అంటూ కేసును సాగదీయవద్దని,డబ్బు ఇప్పిస్తానని బేరసారాలు జరిపితే తాము ఇంటి నుండి బయటకు పొమ్మని హెచ్చరించామన్నారు. తమ నాయకుడు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ 'ప్రశ్నించమని' పిలుపు ఇచ్చినందునే తాము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. తమ మేనల్లుడిని లాకప్‌డెత్ చేసిన కృష్ణలంక సిఐ నాగరాజు,సిబ్బంది మీదనే తమ ఆక్రోశమని,మిగిలిన పోలీసు వారిపై తమకు ఎటువంటి ద్వేషం లేదన్నారు. కూటమి నాయకులైన చంద్రబాబు,లోకేష్,పవన్‌కళ్యాణ్‌లను తమ మేనల్లుడి లాకప్‌డెత్ కేసులో తమకు న్యాయం చేయాలని కోరుకుంటున్నామన్నారు. సాయికృష్ణ పిన్ని న్యాయవాది కనకదుర్గ మాట్లాడుతూ సాయికృష్ణపై కేవలం రెండు కేసులు మాత్రమే ఉన్నాయని, వాటిలో నాన్ బెయిలబుల్ వారెంటులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోలీసులు పెట్టింది నిజమైన కేసులైతే సాయికృష్ణపై పెట్టిన మిగిలిన కేసులను న్యాయస్థానం ఎలా కొట్టివేసిందని ఆమె ప్రశ్నించారు. సాయికృష్ణపై 25 నుండి 30 కేసులున్నాయని పోలీసులు అంటున్నారని, కేసుల వివరాలు తెలిపే పోలీసులు ఎవరైనా సరే వచ్చి బందరు రోడ్డు లోని అంబేద్కర్ స్మృతివనం వద్ద కేసుల వివరాలు చెప్పేందుకు తమతో చర్చకు రావాలని సవాలు విసిరారు. సాయికృష్ణకు ఎటువంటి రాజకీయాలతో సంబంధం లేదని అతను పవన్‌కళ్యాణ్ అభిమాని మాత్రమేనన్నారు.

# సాయికృష్ణది పోలీసులు చేసిన హత్యే?: మాజీ మంత్రి పేర్ని నాని

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** రౌడీ షీటర్ అయినంత మాత్రాన పోలీసులు చంపేస్తారా ? దీనిపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాయికృష్ణది పోలీసులు చేసిన హత్యేనని, కొడుకు ఆచూకీ తెలియక తల్లి వ్యథ పడుతూ పోలీసుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యమని అన్నారు. శవం కూడా దొరక్కుండా కాల్చేశారని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులే చంపేస్తే ఇక కోర్టులెందుకు అని ప్రశ్నించారు. చనిపోయిన సాయికృష్ణపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఎన్నికల్లో వాడుకున్నప్పుడు ఇవన్నీ గుర్తులేదా ? అని ప్రశ్నించారు. సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ



దర్యాప్తు చేయించాల్సిందేనని అన్నారు. విజయవాడలో క్షీణించిన శాంతిభద్రతలకు విజయవాడలో పోలీసుల చేతిలో హత్యకు గురైన సాయికృష్ణ ఉదంతమే నిదర్శనమన్నారు. విజయవాడ సిటీ పరిధిలో పోలీసులు చట్టం, న్యాయం, కోర్టులంటే లెక్కలేకుండా ప్రవర్తిస్తున్నారంటే రాజశేఖర్ బాబుకు బాధ్యత లేదా? పోలీసులు తన కొడుకుని చంపేస్తున్నాడని తల్లి ఫిర్యాదు చేసినా ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్నించారు.మాజీ మంత్రి అమర్నాథ్ వ్యాఖ్యలపై ఎందుకింత రచ్చ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆయన మేకప్ గురించి మాత్రమే మాట్లాడారని, పవన్ మాత్రం కట్టుబొట్టూ డైలాగులు చెప్తున్నారన్నారు. నిత్యం సభ్యత లేకుండా హోంమంత్రి విమర్శలు చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీని తిట్టడానికే అనిత పనికొస్తున్నారని తెలిపారు.

## రెండేళ్ల విజయోత్సవ పాదయాత్ర ఘన విజయం

### పాదయాత్రలో పాల్గొన్న కూటమి మంత్రులు, ఎంపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు

**అనకాపల్లి జూన్ 17ప్రభాత వార్త:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయవంతమైన పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ నుండి ఎన్టీఆర్ గ్రౌండ్స్ సభా వేదిక వరకు శకటాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో అనకాపల్లి జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది కార్యకర్తలు, ప్రజలతో కలిసి నిర్వహించిన విజయోత్సవ పాదయాత్ర ఘనంగా జరిగింది. టిడిపి, బిజెపి, జనసేన పార్టీల జెండాలతో కూటమి నాయకులు, కార్యకర్తలు వేలాది సంఖ్యలో పాల్గొని విజయోత్సవ సంబరాలు జరిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర స్థానిక ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం. రమేష్, జిల్లాలోని శాసనసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు ఎంజేపీ గురుకుల పాఠశాలల బాలికల జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరణ

**విజయవాడ జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** బాలికల విద్యను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ఆరు మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలకు బాలికల జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించింది. విజయనగరం జిల్లాలోని కొత్తవలస శ్రీపొట్టిశ్రీరాములు, నెల్లూరు జిల్లాలోని గొలగమూడి, ఆత్మకూరు , అన్నమయ్య జిల్లాలోని కలికిరి, వైఎస్సార్ కడప జిల్లాలోని వనివెంట శ్రీసత్యసాయి జిల్లాలోని నసనకోట బీసీ గురుకుల పాఠశాలలను ఉన్నతీకరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి వీటిని అందుబాటులోకి తీసుకురానుంది. జూనియర్ కళాశాలల ఉన్నతీకరణతో 480 మంది విద్యార్థినులకు ప్రయోజనం చేకూరనుంది. ఉన్నతీకరించిన వాటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులుంటాయి. ప్రతి గ్రూపులో 40మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కళాశాలలో 8 మంది పార్ట్‌టైమ్ జూనియర్ అధ్యాపకులు, ఒక వంటి మనిషి, ఒక ల్యాబ్ అటెండర్‌ను నియమించుకునేందుకు అనుమతి ఇచ్చారు. పారిశుద్ధ్యం ఇతర సహాయ సేవలకు సిబ్బందిని పొరుగుసేవల ద్వారా తీసుకోవచ్చు. ప్రస్తుతం గురుకుల పాఠశాలల్లో ఉన్న ప్రిన్సిపల్ పోస్టును జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నతీకరించారు.

## నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

**విజయవాడ జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఇంటర్ విద్యార్థులకు అలర్ట్ ప్రథమ ద్వితీయ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలకు రంగం సిద్దమైంది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నారు. మే 21 నుంచి జూన్ 4 వరకు ఈ పరీక్షలు జరగ్గా దాదాపు 12.50 లక్షల జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసే ఫలితాల విడుదలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈనాడు.నెట్, హెటొపిపిఎస్//బిఐఇ.ఎపి.జీవోవి.ఇన్/ వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.

## 29న ప్రత్యేక హౌస్ కమిటీ సమావేశం

**విజయవాడ, జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్లో ఒక డైరీలో అవినీతి, అవకతవకల ఆరోపణలపై ప్రత్యేక ఎంక్వయిరీ హౌస్ కమిటీ సమావేశం జరగనుందని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్య దేవాయ తెలియజేశారు.

## ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు కిట్‌లు పంపిణీ

**విజయవాడ, జూన్ 17, ప్రభాతవార్త :** ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు విజయవాడలోని యం.కె.బేగ్ ఉన్నత పాఠశాలలో బుధవారం కిట్‌లు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో ఎన్‌టిఆర్‌జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రమేష్‌బాబు పాల్గొని 284మంది విద్యార్థులకు కిట్‌లు అందచేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం సమగ్రశిక్ష అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈవిద్యార్థులకు వివిధ రకాల అలవెన్స్‌లు ఇవ్వటంతోపాటు భవిత కేంద్రం ద్వారా విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నట్లు తెలియచేసారు. ఈకార్యక్రమంలో సహిత విద్యసమన్వయకర్త నారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులు, కళాకారులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలివ్వాలి

### సీఎం చంద్రబాబుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ వినతి

**విజయ వాడ, జూన్ 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత కార్మికులు, కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయి చేనేత పురస్కారాలివ్వాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గౌరవ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రికి మంత్రి సత్యకుమర్ యాదవ్ లేఖ రాశారు. " ఆంధ్రప్రదేశ్ చేనేత రంగం రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, శ్రీకాళహస్తి, బొబ్బిలి, భట్టిప్రోలు, మదనపల్లె వంటి ప్రాంతాల చేనేత ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత పురస్కారాల ద్వారా ప్రతిభావంతులైన చేనేతలను సత్కరిస్తోంది. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక పురస్కారాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. దీంతో చేనేత కార్మికులకు గౌరవం పెరగడంతో పాటు యువతలో ఈ వృత్తిపట్ల ఆసక్తి పెరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు 7న నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి పురస్కారాలను ప్రదానం చేయాలి. చేనేతలు, డిజైనర్లు, కళాకారులకు ఇది గొప్ప ప్రోత్సాహంగా నిలుస్తుంది. చేనేత రంగం రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి అమలు చేయాలి అని ముఖ్యమంత్రిని మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖలో కోరారు. కాగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత అంజయ్య, ధర్మవరానికి చెందిన జేఆర్ సిల్క్ చీరల సంస్థ యజమాని జింకా రామాంజనేయులు రాష్ట్రంలో చేనేత పురస్కారాలివ్వాలని కోరుతూ సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ముఖ్యమంత్రికి పంపినట్లు మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు.

## పొగాకు రైతలను తక్షణమే ఆదుకోవాలి: ఈశ్వరయ్య లేఖ

**విజయవాడ జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కుప్పకూలుతున్న పొగాకు ధరలు, కొనుగోలు కంపెనీల సిండికేట్ రాజకీయం మరియు పొగాకు బోర్డు అలసత్వం వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉన్న మన వర్జీనియా పొగాకు రైతలకు ప్రస్తుత 2025-26 సీజన్‌లో పట్టుబడి ఖర్చులు కూడా లభించడం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత వల్ల రైతులు వేల కోట్ల రూపాయల నష్టాలను చవిచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం



# ఎల్‌నినో ఎదుర్కొనేలా పంటల సాగు

## ప్రకృతి సేద్యాన్ని మరింత విస్తరించేలా కార్యాచరణ

### వ్యవసాయ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**విజయవాడ, జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్‌నినో కారణంగా ప్రత్యేక వాతావరణ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలో పంటల సాగు విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పంటల మార్పిడికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు ఇవ్వాలని సీఎం నిర్దేశించారు. రాష్ట్రంలోని రైతులు పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో సర్టిఫికేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారని, ఈ విషయాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. రైతులను చైతన్య పరిచే కార్యక్రమాల్లో తాను కూడా పాల్గొంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శాస్త్రీయ విధానంలో పంటలు సాగును తెలియ చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి ఉత్పత్తులకు సంబంధించిన అంశాలపై అధికారులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. పొగాకు కొనుగోలుదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గిట్టుబాటు ధర వచ్చే వరకూ నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న పప్పు దినుసులు సాగు చేసేందుకు వీలుగా ప్రణాళికలు చేయాలని, తద్వారా రైతులకు ప్రయోజనం కలిగించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. మార్కెట్‌లో ఉన్న ఉత్పత్తులతో పాటు ప్రస్తుతం సాగు దశలో ఉన్న పంటల్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయం, ఉద్యాన పంటల విషయంలో అదనపు విలువ జోడించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆక్వా రైతులు, అసోసియేషన్లతో పాటు ఆక్వా ఫీడ్ తయారీదారులతోనూ సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

కష్ట కాలంలో ఉన్న రైతులను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణలు: అసోసియేట్ ప్రొఫెసర్ సస్పెన్షన్

**విశాఖపట్నం, జూన్ 17, ప్రభాతవార్త:** విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ)లో జనరల్ సర్జరీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.జనార్దన్ రావుపై వచ్చిన తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేస్తూ వైద్యవిద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ విష్ణు వర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు.పీజీ విద్యార్థులను అసభ్యకర పదజాలంతో దూషించడం, విద్యార్థినులను లైంగికంగా వేధించడం వంటి ఆరోపణలపై పలువురు విద్యార్థులు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో తీసుకున్న ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి నేతృత్వంలో అంతర్గత కమిటీ విచారణ చేపట్టింది.విద్యార్థులు, సంబంధిత వర్గాల నుంచి వివరాలు సేకరించిన కమిటీ తన నివేదికను వైద్య విద్యాశాఖకు సమర్పించింది. కమిటీ నివేదికలో ఆరోపణలకు బలం చేకూరే అంశాలు ఉన్నట్లు తేలడంతో డాక్టర్ కె. జనార్దన్ రావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## కీలక స్థాయి పోలీసు అధికారుల బదిలీలు

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలీసు శాఖలో కీలక స్థాయిలోని అధికారుల బదిలీలు, కొత్త నియామకాలు చేపట్టింది. పలువురు అదనపు ఎస్పీలు, డిప్యూటీ కమిషనర్లు (డీసీపీలు), నాన్‌కేడర్ ఎస్పీలకు కొత్త పోస్టింగ్‌లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీలు, నియామకాలతో రాష్ట్ర పోలీసు శాఖలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఏవీఆర్ పీబీ ప్రసాద్ – విజయవాడ టెక్నికల్ వింగ్ డీసీపీగా.జి. స్వరూపరాణి–ఈగల్ ఎస్పీ(నాన్‌కేడర్)గా, మహేంద్ర మాధే– కోనసీమ అదనపుఎస్పీ (అడ్మిన్)గా,ఎస్. ఖాదర్ భాషా –నంద్యాల అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఎల్.సుధాకర్–బాపట్ల అదనపు ఎస్పీ (అడ్మిన్)గా కె. రవి మనోహరాచారి– చిత్తూరు అదనపు ఎస్పీ (అడ్మిన్)గా షాన్ షేక్ – చిత్తూరు అదనపు ఎస్పీ (ఒఈఎస్)గా కేఎస్. వినోద్ కుమార్–ఆర్టీసీ విజిలెన్స్ అదనపు ఎస్పీగా వై. ప్రసాదరావు –ఏలూరు అదనపు ఎస్పీఎంగా శ్రావణి – విజిలెన్స్ అదనపు ఎస్పీగా ఎ.కిషోర్‌కుమార్–కాకినాడ అదనపుఎస్పీ(అడ్మిన్)గా వై.శృతి–అల్లూరిజిల్లా అదనపుఎస్పీగా ఆర్.రాఘవేంద్ర–విశాఖపట్నం ట్రాఫిక్ డీసీపీగా ఎల్.ఆజయ్‌ప్రసాద్– సీఐడీఎస్పీ(నాన్‌కేడర్)గా జేవీ సంతోష్ –ఏసీ బీఎస్పీ(నాన్‌కేడర్)గాజి.రామకృష్ణ–విజయవాడట్రాఫిక్‌డీసీపీగా కొత్తగా నియమితులయ్యారు.

## డిఎస్సీపై జగన్ చర్చకు రావాలి: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** డీఎస్సీపై లోకేశ్ సవాల్ స్వీకరించి జగన్ చర్చకు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రొయ్య ఫీడ్ ధరలు జగన్ హయాంలో ఏమేర పెరిగాయో చర్చకు సిద్ధమంటూ మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. వాస్తవాలు, ఆధారాలతో జగన్ ఆరోపణలను సమర్థంగా తిప్పికొడతామని స్పష్టం చేశారు. అనితను రాజకీయంగా ఎదుర్కోలేకే వైఎస్సార్‌సీపీ నాటకాలని అసహనం వ్యక్తం చేశారు. వెన్నుపోటుకు కర్త, కర్మ, క్రియ జగనేనని మంత్రి ఆక్షేపించారు. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని పదవి కోసం కాంగ్రెస్‌పార్టీకి వెన్నుపోటు పొడిచారన్నారు. ఆస్తి కోసం తల్లి,చెల్లికి కూడా వెన్నుపోటు పొడిచారని మంత్రి అభియోగించారు.

## అమర్‌నాథ్‌పై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచిత వ్యాఖ్యలపై మహిళా కమిషన్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. గుడివాడపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలకు చెందిన పలువురు మహిళలు కోరారు. ఈ మేరకు కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజకు పలువురు మహిళలు ఫిర్యాదు చేసారు. గుడివాడ అమర్‌నాథ్ తన వ్యాఖ్యలతో అనిత వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారన్నారు.వెంటనే ఆయన మంత్రికి క్షమాపణ చెప్పాలని,అదే సమయంలో ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ స్పందిస్తూ.. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. అందిన ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని శైలజ హామీ ఇచ్చారు.

# వరికపుడిసెలకు రూ. 63.14కోట్లు

**విజయవాడ,జూన్ 17, ప్రభాతవార్తప్రతినిధి:** వరికపుడిసెల ప్రాజెక్టుకు ప్రభుత్వం నిధులు ఇచ్చింది. వరికపుడిసెల ఎత్తిపోతల పైప్‌లైన్ నెట్‌వర్క్ పనుల కోసం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు భూసేకరణ పనులకు ప్రభుత్వం రూ.63.14 కోట్లు కేటాయించింది. భూసేకరణ పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేసింది. వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారంపూడిలో పైప్‌లైన్ ద్వారా సాగునీరు అందించబడుతుంది. అలాగే పల్నాడు జిల్లా మెట్టప్రాంతాల సాగునీటి కల సాకారానికి అవకాశం ఉంది.

**Ref B1/112/2026 dt.16.06.2026**

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

**ఫారం నెం: VI (ఎ)**

(2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

**ప్రాథమిక ప్రకటన**

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన పోలవరం జిల్లా గంగవరం(ఏజెన్సీ) మండలం, గంగవరం,కుసుమరాయి,లక్కొండ,చిన్నగార్లపాడు **గ్రామముల** నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వి.ఆర్.పురం మండలం, **చొప్పల్లి గ్రామం** లోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, చింతూరు, ఆర్&ఆర్ అధికారి చింతూరు యూనిట్, చింతూరు, పోలవరం జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10.05.2020వ తేదీన జారీ చేసిన జి. ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కూనవరం యూనిట్-2, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కూనవరం యూనిట్-2, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ -15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు /ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి-వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేది నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

**షెడ్యూలు**

జిల్లా: పోలవరం — మండలం: గంగవరం(ఏజెన్సీ)

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | యల్.పి.యం నెంబరు | భూసేకరణ క్రింది విస్తీర్ణం (య.సెంట్లు) | భూమి తరగతి | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు కట్టడములుఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| | | | | | గ్రామం : గంగవరం | | | | | |
| 1 | 23-3 | — | 4 | మెరక | కారవు రామ విజయ లక్ష్మి భర్త చిన్నారావు | 24 | 19 | 21 | 19 | ఖాళీ భూమి |
| 2 | 3-2 | — | 3.00 | మెరక | మడకం పద్మ భర్త బాబూరావు దొర | 4 | 1 | 3-1 | 46 | జీడిమామిడి 20 |
| 3 | 180 | — | 4 | మెరక | కేటం ప్రసాద్ తండ్రి లేటు వెంకటేశ్వర్లు | 178 | 181 | 176 | 167 | జీడిమామిడి 20 |
| 4 | 175 | — | 3 | మెరక | కేటం సూర్య ప్రభ భర్త వెంకట్రావు | 167 | 178 | 167 | 167 | జీడిమామిడి 120 |
| 5 | 6 | — | 4.71 | మెరక | కుంజం బాపనమ్మ భర్త అబ్బాయి దొర | 10 | 7 | 8 | 1 | మామిడి 09, చింతచెట్లు 01, కరక చెట్లు 01 |
| 6 | 28-1 | — | 3.05 | మెరక | మడకం జాన్సీ లక్ష్మి భర్త అబ్బాయి దొర | 29 | 24 | 25 | 28-2 | జీడిమామిడి 95, వేప 07, తాటిచెట్లు 20, టేకు 24, నేరేడు 01, వెదురు 04, ఉసిరి చెట్లు 01 |
| 7 | 81-1 | — | 3.36 | మెరక | మడకం కాంతం భర్త జంగం దొర | 81-3 | 82 | 78 | 81-2 | జీడిమామిడి 65, తాటిచెట్లు 20 |
| 8 | 8 | — | 4 | మెరక | మడకం జగ్గారావు దొర తండ్రి గంగన్న దొర | 17 | 1 | 18 | 7 | జీడిమామిడి 20, తాటిచెట్లు 20, వేపచెట్లు 06, బండారుచెట్లు 01, గుమ్మిడి |
| 9 | 36-3 | — | 1.87 | మెరక | మడకం పెద రాజన్న దొర తండ్రి పాపన్న దొర | 33 | 37 | 36-2 | 35-1 | ఖాళీ భూమి |
| 10 | 3-2 | — | 3.39 | మెరక | మడకం సూర్య రావు దొర తండ్రి తమన్న దొర | 4 | 1 | 3-1 | 46 | ఖాళీ భూమి |
| 11 | 162 | — | 2.54 | మెరక | కంగల వరలక్ష్మి భర్త కృష్ణ మూర్తి దొర | 165 | 153 | 161 | 164 | జీడిమామిడి 23, తాటిచెట్లు 03, వేప 02 |
| 12 | 46/1A1 | — | 2.2 | డి - పట్టా | చవలం రంగన్న దొర తండ్రి తమ్మన్నా దొర | 46/1A2 | 46/1A12 | 40 | 46/1A4 | జీడిమామిడి 65, తాటిచెట్లు 20 |
| 13 | 46/1A2 | — | 2.2 | డి - పట్టా | వేడి మంగన్న దొర తండ్రి గంగన్న దొర | 46/1A3 | 46/1A1 | 40 | 46/1A5 | జీడిమామిడి 80 |
| 14 | 46/1A3 | — | 2.2 | డి - పట్టా | సిరసం రాజమ్మ భర్త బొజ్జి దొర | 41 | 46/1A2 | 40 | 46/1A6 | జీడిమామిడి 58 |
| 15 | 46/1A4 | — | 2.18 | డి - పట్టా | కుక్కల బాపిరాజు దొర తండ్రి అబ్బాయి దొర | 46/1A5 | 46/1B | 46/1A1 | 46/1A7 | జీడిమామిడి 45 |
| 16 | 46/1A5 | — | 2.18 | డి - పట్టా | కట్టం సంకురమ్మ భర్త సన్యాసి దొర | 46/1A6 | 46/1A4 | 46/1A2 | 46/1A8 | జీడిమామిడి 45 |
| 17 | 46/1A6 | — | 2.2 | డి - పట్టా | మడకం సంకురు దొర తండ్రి గంగన్న దొర | 41 | 46/1A5 | 46/1A3 | 46/1A9 | జీడిమామిడి 38 |
| 18 | 46/1A7 | — | 2.18 | డి - పట్టా | కుంజం చిన్న అబ్బాయి దొర తండ్రి లచ్చన్న దొర | 46/1A8 | 23 | 46/1A4 | 46/1A10 | జీడిమామిడి 54 |
| 19 | 46/1A10 | — | 2.16 | డి - పట్టా | కారవు అప్పాయమ్మ భర్త మల్లు దొర | 46/1A11 | 23 | 46/1A7 | 69 | జీడిమామిడి 80 |
| 20 | 46/1A11 | — | 1.18 | డి - పట్టా | కారవు పాపాయమ్మ భర్త అబ్బులు దొర | 47 | 46/1A10 | 46/1A8 | 47 | జీడిమామిడి 35 |
| 21 | 46/1A8 | — | 2.19 | డి - పట్టా | కారవు పాపాయమ్మ భర్త అబ్బులు దొర | 46/1A9 | 46/1A7 | 46/1A5 | 46/1A11 | జీడిమామిడి 48 |
| 22 | 46/1A12 | — | 2.2 | డి - పట్టా | మడకం పోతురాజు తండ్రి మంగన్న దొర | 46/1A1 | 23 | 4 | 23 | జీడిమామిడి 50 |
| | సబ్ టోటల్ | | **59.99** | | | | | | | |
| | | | | | గ్రామం : కుసుమరాయి | | | | | |
| 1 | 50/2 | — | 3.46 | మెరక | తాము రత్న కుమారి భర్త ప్రసాద్ | 52 | 50/1 | 51 | 49 | ఖాళీ భూమి |
| | సబ్ టోటల్ | | **3.46** | | | | | | | |
| | | | | | గ్రామం : లక్కొండ | | | | | |
| 1 | 52 | 206 | 1.65 | మెరక | అన్నిక వెంకటేషులు తండ్రి లేటు అప్పారావు | 204 | 670 | 205 | 207 | ఖాళీ భూమి |
| 2 | 81 | — | 4.33 | మెరక | కుంజం శివ కుమార్ దొర తండ్రి రామకృష్ణ దొర | 79 | 81 | 80 | 82/1 | తాటి చెట్లు - 8 , వేప - 1 , చింత - 1 , బోరు బావి - 1 |
| | సబ్ టోటల్ | | **5.98** | | | | | | | |
| | | | | | గ్రామం : చిన్నగార్లపాడు | | | | | |
| 1 | 52-4 | 203 | 3 | మెరక | కారం లింగన్న దొర తండ్రి తమ్మన్న దొర | 185 | పల్లిపూడి గ్రామము | 203 | 202 | ఖాళీ భూమి |
| 2 | 45/1బి | 272 | 1.42 | మెరక | వేడి శ్రీనివాసు దొర తండ్రి పోచన్న దొర | 120 | 119 | 305 | 265 | ఖాళీ భూమి |
| 3 | 41-5 , 42- 6 పార్ట్ | 175 | 2.41 | మెరక | పెల్లి గంగా భర్త చంద్రా రావు | 1,74,178 | 2,00,299 | 173 | 177 | తాటి చెట్లు - 17, మామిడి చెట్లు - 1, జీడిమామిడి - 2 |
| | సబ్ టోటల్ | | **6.83** | | | | | | | |
| | మొత్తం | | **76.26** | | | | | | | |

ప్రదేశం : కూనవరం యూనిట్ -II
తేది: 16-06-2026

వై.వెంకటేశ్వర్లు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
కూనవరం యూనిట్ - 2, చింతూరు.

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

వార్త

తమకు తెలినిదానిని తెలుసనే విధంగా వ్యవహరించేవారు తమకు తెలిసిన విషయాల్ని గురించి కూడా తెలీనివారుగా పరిగణించబడతారు.

- తిరువళ్లువార్

# ఈ 'సుస్తీ'కి ఆంక్షలతో సరా!

ఉన్న ఫళంగా ఒక్కసారి ప్రభుత్వాలకు ఔషధాలు, వైద్య విధానాలు, చికిత్సలు, వాటి వాల్ల కలిగే కష్టనష్టాలు వికటించడాలు, నిషేధాలు గుర్తొస్తుంటాయి. గత అక్టోబర్ లో జరిగిన సంఘటనలపై చర్యలు కొనసాగింపుగా దగ్గు మందు విక్రయాల విషయంలో కేంద్ర ప్రభుత్వంమరోసారి తుది మార్గదర్శకాలు విడుదల చేసింది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి చేసింది. ఆమేరకు జూన్ 16, 2026న 1945 డ్రగ్స్ రూల్స్‌ను కేంద్రఆరోగ్య మంత్రిత్వశాఖ సవరించింది. గత ఏడాది మధ్యప్రదేశ్‌లో 20 మంది పిల్లలు తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న 'కోల్డ్రిఫ్' దగ్గు సిరప్ తాగి 22మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేస్తూ డాక్టర్ చీటి ఉంటే తప్ప మందుల షాపులలో దగ్గు మందు విక్రయాలను నిషేధించింది. అదే సందర్భంగా దగ్గు సిరప్‌లను షెడ్యూల్ 'కె' డ్రగ్స్ జాబితాలోని క్లాస్ ఆఫ్ డ్రగ్స్ సెక్షన్ 75లో ఎంట్రీ మినహాయింపుల నుంచి తొలగించింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా మెడికల్ షాపులు వినియోగదారులు అడిగితే సదరు కాఫ్ సిరప్‌లను విక్రయించే సౌకర్యం ఉండేది. కొన్ని సందర్భాలలో మందుల షాపులు కొన్న దగ్గు సిరప్‌ల ద్వారా నయమయ్యేది. వికటిస్తే జరిగిందేమిటో తెలిసిందే. కీలెరిగి వాత పెట్టాల్సిన ప్రభుత్వం తయారీ దారుల నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చేయలేకపోయాయి. ఆయా సంస్థలపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నాయి. ఆకారణంచేతనే అనుకుంటా భారత్‌లో తయారీ జరిగే దగ్గు మందుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజల్ని హెచ్చరించింది. నాసిరకపు దగ్గు మందులతో ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటాయి. ఇలాంటి ఉదంతాలు మరింకెక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన 'హు' సంస్థ కూడా కనీసం మన దేశవ్యాప్తంగానైనా తనిఖీలు చేపట్టలేదు. కేంద్ర ప్రభుత్వం అప్పట్లోనే మినహాయింపు జాబితా నుంచి తొలగించినా, డిసెంబరు నెలలో ఆ విషయాన్ని రీషెడ్యూల్ చేసి కొత్త రూలుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిని ప్రజాభిప్రాయానికి పెట్టడంతో తుది మార్గదర్శకాలకు ఏడు నెలలు పట్టింది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తాజాగా తుది మార్గదర్శకాలను అధికారికంగా జారీ చేశారు. ఇంత దాకా వెయ్యి మంది జనాభా కన్నా తక్కువ ఉన్న గ్రామాల్లో కొన్ని కంపెనీల దగ్గు మందులను విక్రయించడానికి ఔషధ లైసెన్సులేవి దుకాణాలకుఅనుమతి ఉంది. ఇప్పుడలాంటి మినహాయింపులు రద్దయ్యాయి. అందుచేత ఆ ప్రాంతాలకు తయారీదారులు సదరు దగ్గు మందులు పంపిణీ చేయరు. ప్రజలకు ఇదొక రకమైన అసౌకర్యం. అయినా ప్రజల ఆరోగ్యరీత్యా వైద్యుని చీటీ ద్వారానే దగ్గు మందుల వాడకం మంచిదే. కనుక ప్రాణా పాయం సంభవించదు. ఈరకమైన ఆరోగ్య భద్రత ప్రజ లందరికీ అవసరమే. దీనిని బట్టి ప్రతి చిన్న పల్లెటూరిలో నూ లైసెన్స్ కలిగిన మందుల కంపెనీ ఉండాల్సిందే. దగ్గు మందుల తయారీదార్లు రిటైల్‌గా కొని వాడేవారు సైతం ఎంతో జాగరూకత వహించాలి. దగ్గుమందే కాదు ఏ ఇతర సిరప్ ఆధారిత ఔషధాలనీ డాక్టర్ చీటీ లేకుండా మందుల షాపులు నేరుగా వినియోగదారునికి అమ్మేఅవకాశంలేకుండా ప్రభుత్వ చర్యలు మంచి దారినే ఎన్నుకున్నాయి. కొన్ని నిర్దిష్ట ప్రమాణాలకు లోబడి తయారు చేయాల్సిన దగ్గు మందులు నాణ్యత కోల్పోయినందునే ఎంతోమంది పసి వాళ్ల ప్రాణాలు బలికొన్నాయి. కొన్ని సంస్థలు తయారు చేసిన దగ్గు మందుల్లో డై ఎథిలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్ వంటి విషపూరిత పదార్థాలు కలవడంతో చిన్నారుల్లో మూత్రపిండాల వైఫల్యం,శ్వాసకోస సమస్యలు ఏర్పడ్డాయి. ప్రపంచవ్యాపిత ఔషధ భద్రతకు సంబంధించిన విషయమైనా దుర్ఘటనలు జరిగినప్పుడు అతిగా స్పందించి ఆనక వాటి సంగతి మరచిపోవడం ప్రపంచ ఆరోగ్య సంస్థకు కానీ కేంద్ర ప్రభుత్వానికి కానీ మంచిది కాదు. ఇటీవల కాలంలో నాసిరకం దగ్గుమందులే వివిధ దేశాల్లో పసివాళ్ల ప్రాణాలను కబళించిన సంఘటనలు జరిగాయి. ఔషధ తయారీరంగంలో భారత్ఎంత ఎదిగినా ఔషధ నియంత్రణ వ్యవస్థ పనితీరుకు చెదలు పట్టినట్లే ఉంది. 2022లో ఆఫ్రికాలోని గాంబియాలో భారత్‌లో తయారైన కొన్ని దగ్గు సిరప్‌లు వాడి డజన్ల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు విడిచారు. ఉజ్బెకిస్థాన్‌లో కూడా భారతీయ తయారీదగ్గుమందు సేవించి చిన్నారులు మృతిచెందడం విచారకరం. కేవలం దగ్గు మందు తయారీలోనే కలుషిత సమస్య వస్తే ఎన్నో ప్రాణాధార మందుల తయారీకి నెలవుగా ఉన్న భారత్ ఔషధ నియంత్రణ మీద పట్టుకోల్పోతోందా అనే అనుమానం రాకమానదు. గతకొన్నేళ్లుగా దగ్గు సిరప్‌లకే ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది పసివాళ్లు బలైపోవడం అందున భారతీయ సిరప్‌ల వలనే అలా కావడం భారత్ ప్రతిష్టకు అవమానకరమే. ఎవరు సేవించినా, ఎక్కడవారయినా కలుషిత మందులకు బలైపోతే, ఆమందుల తయారీదారు శిక్షార్హులే. 2025లో మధ్యప్రదేశ్‌లో కలుషితమయిన 'కోల్డ్రిఫ్' దగ్గు మందు సేవించిన 22 మంది చిన్నారుల మృతికి కారణమైన సంస్థపై ఇంకా కేసు నడుస్తోంది. ఆ ఔషధ పరీక్షల్లో డై ఎథిలీన్ గ్లైకాల్ వంటి విషపూరిత రసాయనాలున్నట్లు తేలింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో వైద్యుల సలహాలేకుండా ఔషధ వినియోగం జరుగుతోందని కేంద్రప్రభుత్వం ఏనాడో గుర్తించినా వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దేశవ్యాప్తంగా ఔషధ పరిశ్రమపై కఠిననిఘా, తరచు తనిఖీలు, ప్రతి బ్యాచ్‌కు ప్రత్యేక నాణ్యతా పరీక్షలు జరుగుతుంటే నాసిరకం, ఔషధపంపిణీకి అడ్డుకట్ట వేయడం సాధ్యమౌతుంది.

> ఎన్నో కష్ట నష్టాలు అనుభవించిన తర్వాత కానీ మనిషికి వినయం, వివేకం రాదు.
>
> ఫ్రాంక్లిన్



> సంపదను సరిగ్గా వాడుకోవడం తెలీని ధనవంతుల్ని సంపద దుర్వినియోగదారులుగా తయారు చేస్తుంది.
>
> థామస్ ఫుల్లర్



# అన్నామలై కొత్త ఒరవడిని సృష్టించగలరా?

**ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్‌నిక్స్ కోయంబత్తూర్లో స్థాపించి ట్రయినింగ్ యువతకు ఇచ్చి నిజమైన రాజకీయ నాయకులను తయారు చేయాలని అతని ఆకాంక్ష! వచ్చే సివిక్ అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించాలని అతని సంకల్పం! ఎన్నికల సందర్భంగా ఉచితాల ప్రసక్తి తేకుండా కేవలం విద్య, వైద్యంతో పాటు ఆహారం కొంతమేర ఇళ్ళ సౌకర్యం లాంటి సంక్షేమ పథకాలు ఆచరించి మిగతా ఉచితాలను దూరంగా వుంచి ప్రజా శ్రేయస్సు నిజమైన ప్రజాస్వామ్యంలో సాధించగలుగుతే అన్నామలై రాజకీయాల్లో అందరి కంటే మిన్నగా రాణించగలరు. మూసపోసిన రాజకీయ ఒరవడితో ముందుకు వెళ్తే, 'ఎందరో వున్నారు! అందరికీ వందనాలు చెప్తున్నాం కదా!' అంటారు ప్రజలు! ఉచితాలు ప్రస్తుతం అనుచితాలుగా మారాయి! అన్నామలై ఓపికగా ఎదురు చూడటంతో పాటు సామాన్యుడికి విలువలతో కూడిన జీవితాన్ని అందించాలన్న లక్ష్యంతో అబ్దుల్‌కాలం స్ఫూర్తితో ముందుకు నడుస్తే అంతకంటే కావల్సింది ఏముంది?**



రావులపాటి సీతారాంరావు

తమిళనాడులో సినిమా హీరో విజయ్ ముఖ్యమంత్రిగా ఎన్నికల్లో గెల్చి ఒక చరిత్రనే సృష్టించాడు. ఎన్నో ఏళ్ళ అనుభవంతో పాతుకొని పోయిన పార్టీలు డి.యం.కె. ఏఐడియంకె,వాటితోపాటు నామ మాత్రంగా మిగిలివున్న కాంగ్రెస్‌పార్టీ, ఏదో విధంగా తమిళనాడును వశ పర్చుకోవాలని వ్యూహంతో కొన్నేళ్ల నుంచి కాపేసివున్న బి.జె.పి అన్నీ విజయ్ గెలుపు ముందు తలవొంచక తప్పలేదు. అయితే సంపూర్ణ విజయానికి అడుగు దూరంలో వున్న విజయ్ పార్టీకి సీట్లు తక్కువయినప్పుడువ్యూహం రచించి సరిపడా చిన్నాచితకా పార్టీలను దగ్గరకు చేర్చి సి.యం కుర్చీని విజయ్‌కు వచ్చేట్లు చేయటం జరిగింది. బెల్లం చుట్టూ చీమలు చేరినట్లు అధికారం వున్న విజయ్ చుట్టూ ఎ.ఐ.ఎ.డి.యంకె పార్టీలోని కొందరు ఎం.ఎల్.ఏలు విజయ్ టి.వి.కె. పార్టీలోకి క్యూ కట్టున్నా,అతను ప్రలోభాలు పెట్టకుండా ఎక్కువ ఓటర్లను వశపర్చుకున్నా, ఎన్నికలు ముందు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు స్త్రీలకు, విద్యార్థులకు, యువతకు, వృద్ధులకు సమకూరుస్తానని మాట యిచ్చారు! నిజానికి యితర పార్టీలు అన్ని రాష్ట్రాలలో ఎడాపెడా యిస్తున్న హామీల్లాంటివే! అవి ఏవిధంగా నెరవేర్చగులుగుతాడని, ఆర్థిక నిపుణులు అప్పుడే పెదవి విరవటం మొదలు పెట్టారు! ఫ్రీ బీస్‌గా రాజకీయ రంగంలో ప్రసిద్ధిగాంచిన ఈ ఉచితాలు ఇవ్వటం సాధ్యమా అన్నది కొత్తగా ఎన్నికయిన విజయ్ కూడా ఆలోచించినట్లు లేదు! ఇప్పుడు ప్రభుత్వ ఖజానాలో తగిన డబ్బులేదు. నిజానికి దాదాపు ఏమీ లేదు అన్న ధోరణిలో మాట్లాడుతున్న ఆ పార్టీ నాయకులే కాదు అతని శ్రేయోభిలాషులు కూడా తలలు పట్టుకొని కూర్చున్నారు. డి.ఎం.కే. నాయకుడు స్టాలిన్ ఆరు నెలల దాకా విమర్శలు కొత్త ప్రభుత్వం మీద చేయనన్నాడు గానీ, మిగతా పార్టీలు కొన్ని తలోరాయి విసురుతుంటే, నియంత్రించుకోలేక, స్టాలిన్ కూడా ఆరు నెలల మాట మరిచిపోయి విమర్శలు ఘాటుగానే కొత్త ప్రభుత్వం మీద మొదలుపెట్టాడు. రాజకీయ నాయకులు సంక్షేమ పథకాల విషయంలో అధికారంలో వున్నప్పుటి మాట తీసి గట్టుమీద పెట్టినప్పుడే పెద్దగా పట్టించుకోని ప్రజలు స్టాలిన్ విమర్శల విషయంలో మాట తప్పుతే దాన్ని తప్పుపట్టారా? అయితే ఈ విషయం అటుంచుతే ప్రజల్లో ముఖ్యంగా ఓటర్లకు అర్థమైన విషయం ఏమిటంటే ఉచితాల హామీలు ఎప్పటికీ నెరవేరేవి కావు అని! విజయ్ ఎన్నికల సందర్భంగా కొంత నిజాయితీతో వ్యవహరించటం వల్ల అతని పట్ల మొగ్గు చూపారు!



హామీలు నెరవేర్చటం అందులో అన్ని హామీలను తు.చ. తప్పకుండా అమలు చేయటం అలవికాని పని! ఈ సందర్భంగా ఇతర పార్టీల్లో వుండి కొంత అనుభవం గడించిన తర్వాత బయటకు వచ్చి ఈ మధ్యనే కొత్తగా పార్టీలు పెట్టిన నాయకులు సైతం ఇలాంటి ఉచితాల హామీలు నెరవేర్చటం ఎవరికీ సాధ్యం కాదు అని ఓటర్లకు నచ్చచెప్పి నిజాయితీగా రాజకీయాలు చేయటానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఏర్పడింది! దానిని సద్వినియోగపర్చుకున్న నాయకులే ముందు తరాల వారికి మార్గదర్శకులవుతారు! రాజకీయాల్లో నిజాయితీని ప్రదర్శించటమే కాకుండా పారదర్శకంగా వ్యవ హరించిన వారు అవుతారు! కొత్తగా పార్టీలు పెట్టినవారిలో తమిళనాడుకు చెందిన అన్నామలైని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి!అతను ఐ.పి.యస్ ఆఫీసర్గా కర్ణాటక రాష్ట్రం లో ఎనిమిదేళ్ళు పనిచేసి సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో ఉన్నతమైన ఉద్యోగాన్ని వదిలి బయటకు వచ్చి ప్రజల్లో మమేకమైనవాడు. బి.జె.పి అధ్యక్షుడిగా తమిళ నాడులో వున్నప్పుడే అతని ప్రతిభా పాటవాలు బయటకు వచ్చాయి!అయితే కాంగ్రెసు మాదిరే మారిపోతున్న బి.జె.పి పార్టీ సాంప్రదాయ పద్ధతులనే అవలంబించి ఎ.ఐ.ఎ.డి. యం.కే పార్టీలో చీలికతెచ్చి తమిళ నాడును పోయిన ఎన్నికల్లో హస్తగతం చేసుకోవాలని పగటి కలలుకన్నది. కానీ విలువైన అన్నామలైని వదిలేసి సాంప్రదాయ రాజకీయాలకే పెద్దపీట వేయటంతో, అన్నామలై ఆ పార్టీని వదిలేసి'వుయి ది లీడర్స్' అన్న కొత్త ఉద్యమపార్టీని స్థాపించి తమిళనాడులో కొత్తశకానికి నాంది పలికిన విజయ్ తర్వాత మరొకడిగా గుర్తించబడుతున్నారు. 1.3 మిలియన్ల మంది పార్టీ పెట్టిన వెంటనే అతనితో రాజకీయాల్లో వుండ టానికి సిద్ధం కావటం విశేషంగా చెప్పుకోవాలి! క్షేత్రస్థాయినాయకత్వం ఆర్గానిక్ వ్యవసాయం క్రీడాభివృద్ధి బలోపేతం చేయటం, ఒక ఉద్యమంగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాడు. 'కలాం స్కూల్ ఆఫ్ ఐడి యాలజీ'ని స్ఫూర్తితో స్వచ్ఛమైన, సామాన్యుడు పాల్గొనే రాజకీయ ఒరవడిని తీర్చిదిద్దాలని అతని ఆలోచన! ద్రావిడ, సాంప్రదాయ వాదాలకు తిలోదకాలివ్వటం అతని లక్ష్యంగా కనపడుతున్నది. ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్‌నిక్స్ కోయంబత్తూర్లో స్థాపించి ట్రయినింగ్ యువతకు యిచ్చి నిజమైన రాజకీయనాయకులను తయారు చేయాలని అతని ఆకాంక్ష! వచ్చే సివిక్ అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయ ప్రస్థా నం ప్రారంభించాలని అతని సంకల్పం!ఎన్నికల సందర్భంగా ఉచితాలప్రసక్తి తేకుండా కేవలం విద్య, వైద్యం తోపాటు ఆహారం కొంతమేర ఇళ్ళ సౌకర్యంలాంటి సంక్షేమ పథకాలు ఆచరించి మిగతాఉచితాలను దూరంగావుంచి ప్రజాశ్రేయస్సు నిజమైన ప్రజాస్వామ్యంలో సాధించగలుగుతే అన్నామలై రాజకీయాల్లో అందరికంటే మిన్నగా రాణించగలరు. మూస పోసిన రాజకీయ ఒరవడితో ముందుకు వెళ్తే, 'ఎందరో వున్నారు! అందరికీ వందనాలు చెప్తున్నాం కదా!' అంటారు ప్రజలు! ఉచితాలు ప్రస్తుతం అనుచితాలుగా మారాయి! అన్నామలై ఓపికగా ఎదురు చూడటంతో పాటు సామాన్యుడికి విలువలతో కూడిన జీవితాన్ని అందించాలన్న లక్ష్యంతో అబ్దుల్‌కాలం స్ఫూర్తితో ముందుకు నడుస్తే అంతకంటే కావల్సింది ఏముంది? ●

# పెరిగిన భూముల విలువలతో ఎవరికి లాభం?

తిప్పర్తి శ్రీనివాస్

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూములు, స్థలాలు, నివాస వాణిజ్య ఆస్తుల మార్కెట్ విలువలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెరిగిన విలువలు అమల్లోకి రావడంతోరియల్ ఎస్టేట్ రంగం, భూ యజమానులు, కొనుగోలుదారులు, నిర్మాణ రంగం,ప్రభుత్వ ఆదాయ వ్యవస్థపై విస్తృత ప్రభావం పడనుంది. ప్రతి కొన్ని సంవత్సరాలకు ఒకసారి మార్కెట్ పరిస్థితులను పరిశీలించి ఆస్తుల విలువలను సవరించడం సాధారణ పరిపాలనా ప్రక్రియే అయినప్పటికీ, ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలు, దాని ప్రయోజనాలు, ప్రజలపై పడేభారం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. భూమి అనేది పరిమిత సహజ వనరు. జనాభా పెరుగుదల, పట్టణీకరణ,పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కారణాల వల్ల భూమికి డిమాండ్ నిరంతరం పెరుగుతోంది. ముఖ్యంగా నగరాలు, పట్టణాలు, జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, కొత్త అభివృద్ధి కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. అయితే వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలకు మధ్య చాలా సందర్భాల్లో భారీ వ్యత్యాసం ఉంటుంది.ఈ వ్యత్యాసం కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంతగ్గడమే కాకుండా, లావాదేవీలలో పారదర్శకత కూడా దెబ్బతింటుంది. అందుకే ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విలువలను సవరించడం అవసరమవుతుంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలయ్యే మార్కెట్ విలువలనుప్రభుత్వం ప్రధానంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల లెక్కింపునకు ప్రామాణికంగా ఉపయోగిస్తుంది. మార్కెట్‌లో ఒక ఎకరం భూమి విలువ కోటి రూపాయలు ఉంటే, ప్రభుత్వ రికార్డుల్లో అది చాలా తక్కువగా నమోదై ఉంటే ఆదాయ నష్టం జరుగుతుంది. అందువల్ల వాస్తవ పరిస్థితులకు దగ్గరగా విలువలను తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సవరణలు చేపడుతుంది. రాష్ట్ర ఆదాయ వనరుల్లో రిజిస్ట్రేషన్ శాఖకు కీలకస్థానం ఉంది. సంక్షేమ పథకాలు,మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ వ్యయాలను నిర్వహించేందుకు ఆదాయం అవసరం. ఈకోణంలో చూస్తే భూముల



విలువల పెంపు ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చే చర్యగా చెప్పవచ్చు. అయితే ఈనిర్ణయం మరోవైపు సాధారణ ప్రజలపై ఆర్థిక భారం పెంచే అవకాశం కూడా ఉంది. కొత్తగా ఇల్లు కొనాలనుకునే మధ్యతరగతి కుటుంబాలు, చిన్న స్థలాలు కొనుగోలు చేసే ఉద్యోగులు, రైతులు అధిక రిజిస్ట్రేషన్ ఖర్చులను భరించాల్సి వస్తుంది. భూమి ధరతో పాటు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా పెరగడంవల్ల మొత్తం కొనుగోలు వ్యయం అధికమవుతుంది. ఇప్పటికే నిర్మాణ సామగ్రి ధరలు, బ్యాంకు రుణాల భారంతో ఇబ్బందిపడుతున్న గృహ కొనుగోలుదారులకు ఇది మరింత భారంగా మారే ప్రమాదం ఉంది. రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ నిర్ణయం మిశ్రమ ప్రభావం చూపుతుంది. కొన్ని ప్రాంతాల్లో పెట్టుబడిదారులు ముందస్తు కొనుగోళ్లు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తారు. మరోవైపు అధిక రిజిస్ట్రేషన్ ఖర్చుల కారణంగాకొన్ని నెలల పాటు కొనుగోలు కార్యకలాపాలు మందగించే అవకాశం ఉంటుంది.అయితే దీర్ఘకాలంలోచూస్తే వాస్తవమార్కెట్ విలువలకు అనుగుణంగా ప్రభుత్వ విలువలు ఉండటంవల్ల భూ లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుంది. నల్లధనం వినియోగం తగ్గి, అధికారిక లావాదేవీలు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం తీసుకునే ఇటువంటి నిర్ణయాల్లో ప్రజల అభిప్రాయాలనుకూడా పరిగణనలోకి తీసుకోవడంఅవసరం. ఒకే విధమైన పెంపు అన్నిప్రాంతాలకు సమానంగా వర్తింపజేయడం కంటే, స్థానిక పరిస్థితులు, అభివృద్ధిస్థాయి, ప్రజల కొనుగోలు సామర్థ్యాన్ని దృష్టిలోఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి. గ్రామీణప్రాంతాలు,అభివృద్ధి చెందుతున్న మండలాలు, వెనుకబడినప్రాంతాల్లో అధిక పెంపులు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అందువల్ల శాస్త్రీయ అధ్యయనం, స్థానిక వాస్తవాల ఆధారంగా విలువలను నిర్ణయించడం ఉత్తమమార్గం. వ్యవసాయ భూముల విలువలు పెరగడం రైతుల ఆస్తివిలువ పెరిగినట్లే కనిపించినప్పటికీ, వారసత్వ బదిలీలు,కుటుంబ విభజనలు, విక్రయాల సమయంలో అదనపు ఖర్చులు రావచ్చు.రైతు ప్రయోజనాలను కాపాడేవిధంగా కొన్నిరాయితీలు లేదా ప్రత్యేక విధానాలుండాలి.లేకపోతే భూమి యాజమాన్య మార్పిడి ప్రక్రియరైతులకు భారంగా మారే ప్రమాదంఉంది.భూముల విలువల పెంపుఅనేది కేవలం ఆదాయ సేకరణ చర్యమాత్రమేకాదు. అది రాష్ట్ర ఆర్థికవ్యవస్థ,రియల్ ఎస్టేట్ రంగం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రవాహం వంటి అనేక అంశాలకు సంబంధించింది. సరైన ప్రణాళికతో, సమతుల్య దృక్పథంతో అమలుచేస్తే ఇదిప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు భూ లావాదేవీల్లో పారదర్శకతను తీసుకురాగలదు. ●

# ఆధునిక రాజకీయంలో 'ప్రసవ' ప్రహసనం

జయసూర్య

సాధ్యమైనంతగా ఎక్కువ మంది పిల్లల్ని కని, భారత దేశ జనాభా శాతం పడిపోకుండా రాజ్యతంత్రం నడపాలని ఢిల్లీ పెద్దల ప్రస్తుత ఆలోచనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఒక మెట్టు పైకెక్కి ప్రోత్సాహక నగదు కూడా ప్రకటించారు. కుటుంబం, స్త్రీ, పురుష బాంధవ్యంతో ముడిపడ్డ సంతాన ప్రాప్తి, నేటి రాష్ట్ర, కేంద్ర పాలకులను ఇంతగా కదిలించటంలో ఉన్న రాజకీయం బాహాటంగా అంతగా బయటపడకపోయినా అంతర్లీనంగా ఆలోచింప చేస్తోంది. 'అధికస్య అధికం ఫలం' అనేది జనాభా విషయంలో ఆచరణీయ సందేహంగా భావించటానికి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆశయ అంకురార్పణ నాంది అయింది. అదే చంద్రబాబు ఉవాచ. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చినతొలి దశాబ్దాలలో జాతి నేతలు,తిండి గింజల కొరత కారణంగా, కరవు కాటకాల సంక్షోభం ఎదుర్కోవలసి వచ్చింది. పి.ఎల్ 480, పథకం ప్రకారం అమెరికా నుంచి 'ఫుడ్ ఫర్ పీస్ ప్రోగ్రామ్' క్రింద గోధుమల దిగుమతి చేసుకోవలసి వచ్చేది. ఇందిరా గాంధీ ప్రధాని రోజుల నాటికి హరిత విప్లవానికి ప్రణాళికా బద్ధంగా కృషి సత్ఫలితాలు కొంతవరకు ఇచ్చింది. జనాభా తగ్గించుకోవాలనే శాస్త్రీయ అవగాహనకు అవకాశం కలిగింది. ఒక పక్క అధిక దిగుబడి కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కాగా కుటుంబ, సామాజిక పదంగా కుటుంబ నియంత్రణ ద్వారా జనాభా అదుపు కర్తవ్యమైంది. జవహర్‌లాల్‌నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు సమర్థవంతంగా దేశాన్ని నడిపిస్తున్న రోజులవి. 50 కోట్లకు మించని జనాభా వున్న స్వతంత్ర భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీజీ స్వయంగా ఇంట్లో కూడా ఒకపూట భోజనం అంటూ భారత జాతికి ఆదర్శనీయమైన సందేశం అందించారు. ప్రజలు అక్షింతలు కూడా అతిజాగ్రత్తగా వాడేవారు. క్రమేపీ ప్రపంచం సాధించిన శాస్త్రీయ విజ్ఞాన ప్రగతి దేశం అందిపుచ్చుకుంది. చైనావంటి దేశాలు సింగిల్ చైల్డ్ పాలసీ నాటికే అమలు చేస్తున్నాయి. మనదేశంలో కూడా అధిక జనాభా, సృష్టించే అరిష్టాలు అధిగమింప చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉవ్వెత్తున కుటుంబ నియంత్రణ సంక్షేమప్రచారం, వైద్య ఆరోగ్య శాఖల అనుబంధంగా సామాన్య జనావళికి చేరువఅయింది. ప్రపంచంలో ఏ మతం అయినా 'సృష్టించటం' ప్రకృతి ధర్మంగా విశ్వసిస్తుంది. ఇస్లాం, క్రైస్తవ, హిందు ఏమత సిద్ధాంతమైనా అందుకే కుటుంబ నియంత్రణను వ్యతిరేకిస్తాయి. కాని ఆటవికం నుంచి ఆధునికం వరకు మానవ ప్రస్థానంలో సైన్స్ నాగరికతా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం స్వరూపానికి, అమెరికా వంటి సంపన్న రాజ్యాల లేమికి ఎంతో వ్యత్యాసం ఉంది. మంది ఎక్కువయితే మజ్జిగ పల్చన చేయటం తప్పదని భారతీయ కుటుంబ వ్యవస్థ గ్రహించింది. నాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక సంతానం వలన కలిగే అనర్థాలనుంచి, కుటుంబాన్ని తప్పించటానికి చేపట్టిన సహాయ చర్యలు ఫలించాయి. నారు పోసిన



వాడే నీరు పోస్తాడనుకొంటే పంట ఎండిపోక తప్పదని సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం పెద్దఎత్తున నియంత్రణ చేపట్టారు. 'ఇద్దరు పిల్లలే ముద్దు' ఆచరణ కారణంగా తల్లీ, పిల్లల ఆరోగ్యం ప్రధానాంశం అయింది. పిల్లలకు మంచి ఆహారంతో పాటు ఎందరో చదువు నేర్పించగలుగుతున్నారు. చింతలు లేని కుటుంబాలు సామాజిక ప్రగతికి దోహదం చేస్తున్నాయి. కుటుంబ నియంత్రణ తన జీవన కల్యాణానికి మార్గం చూపించింది. అందులో ఉత్తరాది కంటే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు మరింత చొరవ చూపించారు. విద్యా,వైజ్ఞానిక రంగాలలో దక్షిణాది జనప్రగతి యావద్భారతానికి ఆదర్శమైంది. కాని ప్రస్తుత ప్రధాని మోడీప్రభుత్వం గుర్తించిన, జనాభా ప్రాతిపదికన పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గడం, దక్షిణాది రాజకీయ పార్టీలకు ఆందోళన కలిగించే అంశంగా తలెత్తింది. బహుశా అందుకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర జనాభా పెరుగుదలకు ప్రజలు సహకరించాలని తిరోగమన రీతిలో పిలుపు ఇచ్చి ఉండవచ్చు. కుటుంబంలో పిల్లలు, తల్లిదండ్రుల బాధ్యత కుటుంబ ఆర్థిక స్థితిగతులు పిల్లలను కనడం, చదువులు, పెళ్లిళ్ల, ఆరోగ్యాలు ఎన్నో వ్యక్తిగత వ్యవహారాలను బట్టి దంపతులు నియంత్రణ నిర్ణయం తీసుకొంటారు. ఒక విధంగా చెప్పాలంటే బాలకార్మికులపై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో వ్యవసాయ కార్మిక ఇతర చేతివృత్తుల శ్రామికవర్గాలు తమ పిల్లలను ఆస్తిగా భావించడానికి గండిపడింది. ఆడ, మగ వ్యత్యాసం కూడా తగ్గినట్లు కనపడినా చాలా కుటుంబాలలో మగ పిల్లవాడు శరణ్యం అనే భావన ఉంది. అందుకే ఇంకా భ్రూణహత్యలు, ఆడపిల్లల పట్ల నిరాదరణ కొనసాగుతోంది. సనాతన భారతీయ సమాజంలో మహిళకు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించే అవకాశాలు లేవనే విషయం సుస్పష్టం. పురుష వాంఛలకు వ్యామోహాలకు కుటుంబ అవసరాలకు స్త్రీ బలి అయిన వృత్తాంతాలు కోకొల్లలు. పౌరాణికంగా, ధర్మశాస్త్రాలలో మనం ఎంత ఉన్నతంగా చిత్రీకరించుకున్నా పాతివ్రత్య ధర్మాలు, భర్త శవంతో చితిమంటలకు ఆహుతి, కావటం వంటి అమానుష క్రూరదుష్టిత్వం నుంచి బయట పడటానికి సుదీర్ఘకాలం పట్టింది. కేవలం పిల్లల్ని కనే యంత్రంగా భారతీయ మహిళ ఎంతో హింసా, వేదనలను అనుభవించింది. అటువంటి నేపథ్యం నుంచి ఆటవిక అణచివేత నుండి ప్రస్తుత 21వశతాబ్ది మహిళా ప్రస్థానం అద్భుతంగా విజయాలను సాధిస్తోంది. పురుష ప్రపంచాన్ని శాసించే నిలదీసే వ్యక్తిత్వం ఆధునిక మహిళకు సాధికారత ప్రసాదించింది. నవమాసాలు మోసిన మాతృమూర్తిగా, పాలిచ్చే తల్లిగా, నడిపించే కన్నతల్లిగా ఆమెకు ప్రకృతి సహజమైన ఐశ్వర్యం పిల్లల్ని కనటం.300 సంవత్సరాల క్రితం కాకతీయ మహారాణి రుద్రమదేవి ప్రసూతి ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పినా, ఇందిరాగాంధీ ప్రధానిగా అత్యవసర పరిస్థితిలో కొన్నివేల కోట్ల మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగినా భారతీయ మహిళను ప్రస్తుతం పూర్తి సాధికారికత సాధించే వ్యవస్థవైపు నడిపిస్తున్నాయి. ఆధునిక కుటుంబ వ్యవస్థలో వివాహిత యువతిగా,గృహిణిగాపిల్లల్ని కనే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కబళించి అధిక జనాభా సృష్టించమని రాజకీయంగా ఎంత ఉన్నతులైనా,ఎంత ప్రబలమైన ఆకాంక్షలున్నా,కారణాలున్నా ప్రలోభపెట్టం,అధికార వ్యవస్థను శాశ్వితంగా పదిలపరచుకోవాలని నిరం తరం తపించే రాజకీయ నేతలకు తగదు. అవాంఛనీయం ప్రసవనంఅంటే ఎక్కువమంది పిల్లలను కనడం.ప్రహసనం అంటేపరిహాసం. భారతీయ మహిళ ప్రసవప్రహసనాన్ని ఆహ్వానిస్తుందా? ●

(రచయిత: సీనియర్ జర్నలిస్ట్)

# ప్రజావాక్కు

### దీప వ్యవస్థలను ఏర్పాటు చేయాలి

దేశంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలువిద్యుత్ పొదుపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, ఎంఎంటీఎస్, మెట్రో కేంద్రాల్లో రాత్రి వేళల్లో అవసరానికి మించి వెలిగించేదీపాలను తగ్గించడం ద్వారా గణనీయమైన విద్యుత్ ఆదాసాధ్యమవుతుంది. ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉండే అర్థరాత్రి సమయాల్లో ప్రతి దీపాన్ని వెలిగించడం అవసరం లేదు. ప్రధాన స్టేషన్లు, లోకల్ రైలు కేంద్రాలు, మెట్రో స్టేషన్లలో కనీస భద్రతకు అవసరమైనంత వెలుతురు మాత్రమే ఉంచి, మిగతా దీపాలను నిలిపివేయవచ్చు.ఇలాచేస్తే ప్రస్తుత వినియోగంతో పోలిస్తే దాదాపు యాభై శాతం వరకు విద్యుత్ ఆదా చేసే అవకాశం ఉంటుంది. ఎంఎంటీఎస్, మెట్రో సేవలు నిర్దిష్ట సమయంతర్వాత నిలిచిపోతాయి కాబట్టి, ఆ సమయంలో అధిక వెలుతురు అవసరం కూడా ఉండదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రాష్ట్రపతి పాలన పెట్టాలి

మనది సెక్యులర్ దేశం. పరిపాలనలో మతం జోక్యం ఉండరాదు.మతం పాలనలో జోక్యంచేసుకోరాదు. మతం దేవుడు వ్యక్తిగతంగానే ఉండాలి.మత ఆచారాలను ప్రభుత్వం పాటించ రాదు. అదే నిజమైన సెక్యులరిజం. ఐతే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుండి ప్రతి పాఠశాలలోనూ గాయత్రీమంత్రాన్ని, వందేమాతరం పూర్తి గీతాన్ని, ఇతర మతపరమైన గీతాలను ఖచ్చితంగా విద్యార్థులచే ఆలపించాలని ఉత్తర్వులు జారీచేయడం రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కడమే అవుతుంది. మన దేశంలో ఏ మత ఆచారాలను పాటించని మానవ వాదులుకూడా ఉన్నారు.కనుక తక్షణమే రాష్ట్రపతి ఛత్తీస్‌ఘడ్‌ప్రభుత్వాన్ని సస్పెండ్‌చేసి రాష్ట్రపతి పాలన పెట్టాలి.

-నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### నీటిని పొదుపుగా వాడుకుందాం

వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా,ఎల్‌నినో ప్రభావం, దృష్ట్యా భవిష్యత్‌లో నీరు లభ్యత ఉండడం చాలా కష్టం. కావున అవసరమైన వరకు మాత్రమే నీటిని వాడుకుందాం. మనం ఏపని చేయాలన్న నీరు లేనిది పని పూర్తి కావడం అసంభవం.కావున మనం నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్ తరాలకు నీటిని పొదుపుగా వాడుకుని ముందుకెళ్తేనే మనం బ్రతకగలం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### జలసంధి పై సంధి కుదిరింది

యుద్ధం చేస్తున్న ఇరాన్, అమెరికా నడుమ శాంతి ఒప్పందం కుదిరినట్లు పాకిస్థాన్ ప్రకటించింది.ఆప్రకటనను ఇరుదేశాలూ నిజమేనన్నాయి.ఫలితంగా నెలలతరబడి మూసివేతలో ఉన్న హార్ముజ్ జలసంధి తెరుచుకోబోతుంది. ఈశుభవార్త ప్రపంచ దేశాలకుఊరటనిస్తోంది.కారణం ప్రపంచ ఇంధన అవసరాల్లో ఐదో వంతు భాగం ఆ మార్గం గుండానే రవాణా కావాలి. మూసివేత ఫలితంగా సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి భారత్ సహా పలు దేశాలు ఇబ్బందులు పడ్డాయి. ఇంకా పడుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనైంది. ఇలాంటి పరిస్థితిలో పశ్చిమాసియాలో శాంతి నెలకొనడం అంటేప్రపంచానికి స్థిరత్వం నెలకొనడమే. అయితే ఈ శాంతి ఒప్పందం ఎంతకాలం, ఎంత ప్రభావవంతం అన్నది కాలమే చెప్పాలి. ఎందుకంటే ఇలా శాంతి నెలకొనడం ఇజ్రాయెల్ దేశానికి రుచించదు. భగ్నం చెయ్యడానికి తన వంతు కృషి తను చేస్తుంది. అమెరికా దాని మాట కాదనదు.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### నైపుణ్యం పెంచుకోవాలి

నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతుంది దీనికి కారణం ఇటు విద్యార్థులు అటు గవర్నమెంట్. గవర్నమెంట్ ఏమో పాత సిలబస్ అలాగే ఉంచడం, కేవలం సిలబస్ మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ నేటి ప్రపంచానికి ఉపయోగపడే నైపుణ్యాలు ఏమి విద్యార్థులకు నేర్పించడం లేదు. నేటి సాంకేతిక రంగానికి తగ్గట్టుగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచాలి. విద్యార్థులు కూడా ఏదో డిగ్రీ చదివామా అని కాకుండా నైపుణ్యం పెంచుకుని భవిష్యత్తులో ఉద్యోగం తెచ్చుకోవాలి.

- రాఘవేంద్ర బాబు, ఈస్ట్ గోదావరి జిల్లా

### పట్టణీకరణతో వేగంగా ఎదుగుతున్న రాష్ట్రం


సేవల రంగంలో తెలంగాణ కర్ణాటకను అధిగమించడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఒక మైలురాయిగానిలిచింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రం వేగంగా పట్టణీకరణ దిశగా పయనించడంతో సేవల రంగంవిస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. ఐటీ, ఫైనాన్స్, విద్య, ఆరోగ్యం, రియల్‌ఎస్టేట్ వంటి విభాగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి దేశంలోనే ఆదర్శప్రాయమని చెప్పవచ్చు.ప్రభుత్వం చేపట్టిన మౌలికసదుపాయాల విస్తరణ,పరిశ్రమల ప్రోత్సాహక విధానాలు,డిజిటల్ ఇన్నోవేషన్‌కుఇచ్చినప్రాధాన్యంఈఅభివృద్ధికి బలాలుగా నిలిచాయి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఒప్పందం నచ్చకపోతే మళ్లీ దాడులే




## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

### 2015లో ఇరాన్‌కు ఒబామా లంచం ఇచ్చారని ఆరోపణ

### జెనీవా వేదికగా అమెరికా, ఇరాన్ డీల్‌పై సంతకాలు!

**పారిస్, జూన్ 17:** అమెరికా- ఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్నవేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది.
ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్, అమెరికా-ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదనిచెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. 'ఆఒప్పందం నాకునచ్చకపోతే మళ్లీవారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం'అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు.
మూడు నెలలకుపైగా కొనసాగుతున్న యుద్ధం ముగింపు దశకు చేరుకుని, అమెరికా, ఇరాన్‌లు మరో 48 గంటల్లో ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన సంచలన స్వభావాన్ని బయటపెట్టుకున్నారు. 'ఒప్పందంలోని నిబంధనలు తనకు నచ్చకపోతే, వారు సరిగ్గా ప్రవర్తించకున్నా.. మేము మళ్లీ వారి తలకాయలపై బాంబులు వేస్తాం' అని పేర్కొన్నారు. అయితే, అమెరికా- ఇరాన్ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం 'చాలా బలంగా' ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతే కాదు, 'అది ఏమిటో ఎవరికీ తెలియదు, కానీ అది చాలా బలంగా ఉంది' అని ఆయన అన్నారు. అమెరికా ఇరాన్ ఒప్పందంపై ప్రకటన చేసినప్పటి నుంచి మార్కెట్లు చాలా సంతోషంగా ఉన్నాయని, సంతకాలు చేసినతర్వాత ఒకటి లేదా రెండు రోజుల్లో హార్ముజ్ జల సంధి తెరుచుకోనుందని చెప్పారు.
'నిజంగా సంతోషకరమైన విషయం ఏమి టంటే, స్టాక్ మార్కెట్ విపరీతంగా పెరిగిపో యింది. అది ఆకాశాన్ని అంటింది. కానీ చమురు ధరలుపడి పోయాయి.. ఇది మాటలకన్నా ఎక్కు వగా మాట్లాడుతుంది' అని ట్రంప్ వ్యాఖ్యానిం చారు. ఇదే సమయంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాపై ఆరోపణలు చేశారు. 2015 అణు ఒప్పందం సమయంలో విమానం నిండా డబ్బు పంపి, ఇరాన్‌కు లంచంఇచ్చారని ఒబామాపై కూడా ట్రంప్ ఆరోపించారు. 'ఒబామా హయాంలో జరి గిన జెసిపిఒఎ ఒప్పందంలో ఆయన బ్యాంకుల నుంచి 1.7 బిలియన్ డాలర్ల నగదును, గ్రీన్ క్యాష్‌ను, ఒక బోయింగ్ విమానంలో ఇరాన్‌కు పంపారు. వారు ఆ విమానం దగ్గర నిలబడి 'ఓరి దేవుడా, ఆయన మనకు ఇస్తున్న ఈడబ్బును చూడండి' అనుకున్నారు. నాదగ్గర దానికి సంబం ధించిన ఫొటోలు ఉన్నాయి'అని ట్రంప్ విలేకరు లతో అన్నారు. 'ఆయన లంచం ఇచ్చి బయటపడ టానికి ప్రయత్నించాడు.. నేను అలా చేయలేదు... ఇరానీయులు ఏం చేశారో తెలుసా? వాళ్లు ఒబామాను చూసి నవ్వి, అతను ఒక వెధవ అని అన్నారు' అని తీవ్రస్థాయిలో విమర్శించారు.



## అణ్వాయుధం కంటే మరో శక్తిమంతమైన వెపన్ ఇరాన్ వద్ద ఉంది: యుఎస్ ఇంటెలిజెన్స్

**వాషింగ్టన్, జూన్ 17:** పశ్చిమాసియా సంక్షోభం, అమెరికాతో కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరాన్ అణ్వాయుధంకంటే శక్తిమంతమైన ఆయుధాన్ని సంపాదించింది. అదే చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి. యుద్ధం తర్వాత ఈ జలసంధిపై ఇరాన్ తన పట్టును బిగించిందని తన ఇష్టానుసారం దాన్ని మూసి వేసే సామర్థ్యాన్ని సంపాదించుకుందని అమెరికా ఇంటెలిజెన్స్ స్వయంగా తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.
ఈ మేరకు ఇంటెలిజెన్స్ వర్గా లను ఉటంకిస్తూ అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం ఒప్పం దంతో సంబం ధం లేకుండా హార్ముజ్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసే సామర్థ్యం ఇరాన్‌కు ఉందని ఇంటెలిజెన్స్ పేర్కొంది. గల్ఫ్ దేశాల ఇంధప మౌలిక సదుపాయాలపై దాడు లను తనకు అను కూలంగా ఎలా మలుచుకో వాలో నేర్చుకోవడం తోపాటు వాటి విషయంలో అమెరికా బలహీనత కూడా దానికి ఓ ఆయుధంగా మారిందని తెలి పింది. జలసంధిపై దాని నియంత్రణ అణ్వాయుధం కంటే శక్తిమంతమైనదని హెచ్చరించింది. అమెరికా- ఇరాన్ ఒప్పందంలో హార్ముజ్ కీలకం. దాన్ని పూర్తిగా తెరిపించేందుకు ఇరాన్‌తో అమె రికా తీవ్ర చర్చలు జరపాల్సి వచ్చింది. దీన్నిబట్టి హార్ముజ్‌పై టెహ్రాన్ ఎంత పట్టు సాధించిందో స్పష్టమవుతోంది. రెండు రోజుల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ రిపోర్ట్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది.
**జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు:** ఇరాన్‌తో ఒప్పందం గురించి అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదనేది తమ ప్రథమ లక్ష్యమన్నారు. హార్ముజ్‌ను పూర్తిగా తెరిచి ఉంచాలన్నారు. దీంతో పాటు ఇరాన్ సముచితంగా వ్యవహరిస్తే దానికి లభించే ఎన్నో ప్రయోజనాలు ఈ ఒప్పందంలో ఉన్నాయన్నారు. అలా కాకపోతే వారికి ఏమీ దక్కదని వ్యాఖ్యానించారు. అయితే, ఆ ప్రయోజ నాలు ఏమిటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

## ఇరాన్‌కు 300 బిలియన్ డాలర్ల సాయం

### యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్



**న్యూయార్క్, జూన్ 17:** అమె రికా, ఇరాన్ దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా 300 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేయబోతోందని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందించారు. ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా 300 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేస్తోందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పారు. ఆర్థిక సాయానికి బదు లుగా అమెరికా, ఇరాన్ డీల్ షరతులకు కట్టుబడి ఉండే దేశాలు ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టే విధంగా ప్లాన్ చేస్తున్నామన్నారు.
మంగళవారం ఆయన 'ది మెగిన్ కెల్లీ షో'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌కు ఆర్థిక సాయంపై మెగిన్ కెల్లీ జెడి వాన్స్‌ను ప్రశ్నించింది. ఆయన సమాధానమిస్తూ 'ఇరాన్‌కు సమీపంలో మనకున్న అత్యుత్తమ మిత్రదేశాలలో ఒకటైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) గురించే మాట్లాడుకుందాం. ఆ దేశం ఇరాన్‌లో ఒక అణువిద్యుత్ ప్లాంట్‌లో పెట్టుబడి పెట్టాలని అనుకుంటోందని అనుకుందాం. అది సాధ్యం కావడానికి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఉన్న కొన్ని ఆంక్షలను మనం ఎత్తివేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే యుఎఇ.. ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టడం కష్టం' అని అన్నారు.
జెడివాన్స్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'ఇరానియన్లు తమ ప్రవర్తనను మార్చుకోనంత వరకు ఆ దేశంలో పెట్టుబడులు పెట్టడం సాధ్యం కాదు. ఇరానియన్లు గనుక తమ ప్రవర్తనను మార్చుకుంటే ఇతర దేశాలు వారి దేశాన్ని పునర్ని ర్మించడానికి,ఆదేశంలో సంపద సృష్టించడానికి మేము అనుమతిస్తాం' అని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంపై పెట్రోల్ బాంబు దాడి

### 'సిట్'తో దర్యాప్తు, ఇద్దరి అరెస్టు



**రాంచీ, జూన్ 17:** జార్ఖండ్ రాజధాని రాంచీలోని నివారన్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంపై మంగళవారం అర్ధరాత్రి పెట్రోల్ బాంబులు విసిరారు. ఈ ఘటన అక్కడి సిసిటివి కెమెరాల్లో రికార్డయింది. ఇద్దరు యువకులు భవనంవైపు పెట్రోల్ బాంబులు విస రడం అందులో కనిపిస్తుంది. బాంబులలో ఒకటి పేలగా, మరొకటి పేల లేదు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాంగణానికి పెద్దగా నష్టం జరగలేదని సమాచారం. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, దర్యాప్తు చేసేందుకు ఒక సిట్ బృందాన్ని ఏర్పాటుచేశారు. ఈ దర్యాప్తులో డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాన్ని కూడా రంగంలోకి దించారు. ఘటనా స్థలం నుంచి సేకరించిన ఆధారాలు, సిసిటివి ఫుటేజ్, అదుపులోకి తీసుకున్న అనుమానితుల విచారణ ఆధారంగా పోలీసులు ఘటనల క్రమాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇతర అనుమానితులను గుర్తించి, దాడి వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

## వడోదరలో లారీని ఢీకొన్న బస్సు

### ఏడుగురు మృతి, 28 మందికి గాయాలు



**వడోదర, జూన్ 17:** గుజరాత్‌లోని వడోదర - జారోడ్‌లో బుధవారం తెల్లవారుజామున రాజస్థాన్ నుంచి వస్తున్న ఓ ప్రైవేటు బస్సు ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీ కొంది. ఈ ఘటనలో డ్రైవర్ సహా ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 29 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా, వైద్యచికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. మృతులు, క్షతగాత్రులంతా రాజస్థాన్ వాసులు అధికారులు గుర్తించారు. రోడ్డు ప్రమాద ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. క్షతగాత్రులకు ఆర్థిక సాయంతోపాటు వైద్య ఖర్చులు గుజరాత్ ప్రభుత్వమే భరిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన టెలిగ్రామ్

### కేంద్రం తాత్కాలిక నిషేధంపై సవాల్

### కేంద్రానికి నోటీసులు... నేడు విచారణ

**న్యూఢిల్లీ, జూన్ 17:** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధాన్ని సవాలు చేస్తూ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ తేజస్ కరియా నేతృత్వంలో వెకేషన్ బెంచ్ కేంద్రం స్పందన తెలియజేయాలని కోరింది. రిట్ పిటిషన్‌పై నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, ప్రతివాదులు సంబంధిత పత్రాలతోపాటు తమ సమాధానాన్ని దాఖలు చేయడానికి సేచ్ఛను మంజూరు చేసింది. తదుపరి విచారణను గురువారం మధ్యాహ్నం 2.30గం.లకు వాయిదా వేసింది. 'తాము పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది, అలాగే సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు విన్నాము. ప్రతివాదులు అన్ని పత్రాలతోపాటు తమ సమాధానాన్ని దాఖలు చేయడానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు' అని ఢిల్లీ హైకోర్టు ధర్మాసరం వ్యాఖ్యానించింది. తక్షణ విచారణ కోరుతూ టెలిగ్రామ్ ఈ కేసును వెకేషన్ బెంచ్ ముందు ప్రస్తావించిన తర్వాత ఈ విషయం విచారణకు వచ్చింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) చేసిన సిఫారసుల మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000లోని సెక్షన్ 69ఎ కింద ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు విధించిన ఆంక్షలను టెలిగ్రామ్ సవాలు చేసింది. నీట్ యుజి 2026 రీఎగ్జామ్ నేపథ్యంలో పరీక్షల భద్రత, ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలను అరికట్టేందుకు కేంద్రం టెలిగ్రామ్ యాప్‌పై జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న జరగనున్న నీట్ రీఎగ్జామ్‌కు ముందు అక్రమ కార్యకలాపాలు, నకిలీ ప్రశ్నాపత్రాల ప్రచారం, మోసాలను నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు యాప్ యాక్సెస్‌ను పరిమితం చేయడంతో పాటు, కొన్ని ఫీచర్లపై కూడా అదనపు ఆంక్షలు విధించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఈ నిర్ణయం కోట్లాది సాధారణ వినియోగదారులపై ప్రభావం చూపుతోందని టెలిగ్రామ్ వాదిస్తోంది. కేంద్రం జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ అంశంపై అత్యవసర విచారణ చేపట్టాలన్న పిటిషనర్ అభ్యర్థనను జస్టిస్ తేజాస్ కరియా ధర్మాసనం అంగీకరించింది.

## అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న ఇండో-అమెరికన్ అనిల్ మేనన్



**వాషింగ్టన్, జూన్ 17:** ఇండో-అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్నారు. అనిల్ జూలై 14న ప్రారంభం కానున్న అంతర్జాతీయ అంతరిక్ష యాత్రకు ఆయన మరో ఇద్దరు వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నాకికినాతో కలిసి వెళ్లనున్నారు. వారు 240 రోజుల పాటు కక్ష్యలో గడపనున్నారు. జూన్ 22న అనిల్ మేనన్ ఇంటర్వ్యూ ఇస్తారని నాసా వెల్లడించింది. భారత్, ఉక్రెయిన్ తల్లిదండ్రులకు జన్మించిన అనిల్ మేనన్ అమెరికాకు చెందిన పౌరుడు. 2021లో ఆయన వ్యోమగామిగా ఎంపికయ్యారు. 2024లో 23 ఆస్ట్రోనాట్ క్లాస్ గ్రాడ్యుయేట్ అయ్యారు. అంతకుముందు హార్వర్డ్ నుంచి న్యూరోబయాలజీలో బ్యాచిలర్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, మెడికల్‌లో మాస్టర్ డిగ్రీలను అందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆయన వ్యోమగామిగానే కాకుండా ఎమర్జెన్సీ మెడిసిన్ ఫిజీషియన్, మెకానికల్ ఇంజినీర్, అమెరికా స్పేస్‌ఫోర్స్ కర్నల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.
వ్యోమగామి కాకముందు అనిల్‌మేనన్ నాసా ఎక్స్‌పెడిషన్ ఫ్లైట్ సర్జన్‌గా పనిచేశారు.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములకు సహకరించేవారు. 2021లో నాసా తన వ్యోమగాముల బృందంలో అనిల్‌ను ఎంపిక చేసింది. రెండేళ్ల శిక్షణ తర్వాత 2024లో ఆయన వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. నాటి నుంచి కక్ష్యలోకి తన మొదటి అంతరిక్ష యాత్ర కోసం సిద్ధమవుతున్నారు.

## భారత్‌పై మరోసారి విషం కక్కిన అమెరికా

### సైనిక కమాండ్ పేరు నుంచి 'ఇండో' పదం తొలగింపు

### మరోవైపు పిఒకెను పాకిస్థాన్‌తో కలిపి మ్యాప్ విడుదల

### తీవ్రంగా స్పందించిన భారత్... న్యూఢిల్లీ నిరసన

**న్యూఢిల్లీ, జూన్ 17:** ఇండో- పసిఫిక్ ప్రాంతంలో ఒకప్పుడు భారత్‌ను కీలక భాగస్వామి అని చెప్పిన అమెరికా రక్షణశాఖ తాజాగా గట్టి షాకిచ్చింది. తమ సైనిక కమాండ్ పేరులోని 'ఇండో-పసిఫిక్' నుంచి 'ఇండో' పదాన్ని తొలగించి, మళ్లీ 'యుఎస్ పసిఫిక్ కమాండ్'గా మార్చింది. అలాగే ఈ కమాండ్ ప్రాంతాన్ని తెలిపే భారత చిత్రపటాన్ని మార్చేసింది. మన పిఒకెను పాకిస్థాన్ భూభాగంలో కలిపి చూపించడం తీవ్ర వివాదాస్పదమైంది. జీ7 సదస్సులో మోడీ, డొనాల్డ్ ట్రంప్ భేటీకి ముందే ఈ పరిణామం జరగడం గమనార్హం. అమెరికాకు చెందిన చారిత్రక 'యుఎస్ ఇండోపసిఫిక్ కమాండ్' పేరును మళ్లీ 'యుఎస్ పసిఫిక్ కమాండ్'గా మార్చినట్లు అగ్రరాజ్య రక్షణశాఖ తాజాగా వెల్లడించింది. 'చారిత్రక మూలాలను గౌరవించడం, పసిఫిక్‌లో సేవలందించే సైనికుల్లో స్ఫూర్తి పెంపొందించడం కోసం ఈ కమాండ్‌కు పాత పేరునే కొనసాగించాలని నిర్ణయించాం' అని అమెరికా రక్షణశాఖ పేర్కొన్నది. ఇక ఈ కమాండ్ ఎక్కడెక్కడ పనిచేస్తుందో తెలుపుతూ తమ వెబ్‌సైట్‌లో ఓ ఫొటోను ఉంచింది.




అందులో 'పాక్ ఆక్రమిత కశ్మీర్'ను పాకిస్థాన్ భూభాగంగా చూపించడం వివాదానికి దారితీసింది.
వ్యూహాత్మక రక్షణ వ్యవహారాల్లో భారత్‌ను అగ్రరాజ్యం దూరం పెడుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది క్వాడ్ కూటమి అంతానికి మరో మేకు లాంటిదని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు.

## రేపు వాట్సాప్‌నూ బ్యాన్ చేస్తారా?: రాహుల్ గాంధీ



**జైపూర్, జూన్ 17:** నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో 'టెలిగ్రామ్'పై కేంద్రం నిషేధం విధించడాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం చర్య దొంగను పట్టుకోవడానికి బదులుగా బాధితుడి ఇంటి తలుపునకు తాళం వేయడంలా ఉందంటూ ఎద్దేవా చేశారు. నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, చర్చలు, ప్రిపరేషన్ కోసం లక్ష లాది మంది విద్యార్థులు ఎప్పటినుంచో టెలిగ్రామ్‌ను ఉపయో గిస్తున్నారని, దీనిపై నిషేధం విధించడం వల్ల వారు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. అసలు ఈ ఆలోచన పేపర్ లీక్‌లు అరికట్టడానికి ఎలా ఉపయోగపడుతుందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. నిందితులు టెలిగ్రామ్ కాకుంటే వాట్సప్‌లోనూ పేపర్లు లీక్ చేస్తారని అన్నారు. అలాఅని వాట్సప్‌ను కూడా బ్యాన్ చేస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ నిషేధం తీరు పరీక్షల్లో మోసాలకు పాల్పడే పేపర్ లీక్ నెట్‌వర్క్‌లను కాకుండా, విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని రాహుల్ గాంధీ ఆక్షేపించారు. నీట్ అభ్యర్థులకు జరిగిన అన్యాయం నుంచి దృష్టి మరల్చ డానికే కేంద్రం ఈ ఎత్తుగడ వేసిందని విమర్శించారు.
దేశంలో పదేపదే పేపర్ లీక్‌లకు పాల్పడుతున్న నిందితులపై చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. ప్రభుత్వ కనుసన్నల్లోనే పేపర్ లీక్ మాఫియా నడుస్తోందని, దానిని కప్పిపుచ్చుకొనేం దుకే పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా బలగాలను మోహరించడం, ప్రశ్నపత్రాలను వైమానిక దళం ద్వారా పంపించడం వంటి నాటకాలు ఆడుతున్నారని ప్రతిపక్షనేత విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం మాట వినకపోతే తమ హక్కులను ఎలా సాధించు కోవాలో యువతకు తెలుసని కాంగ్రెస్ నేత అభిప్రాయపడ్డారు.

## సహజీవనం చేస్తున్న యువతిని చంపిన ప్రియుడు

**బెంగళూరు, జూన్ 17:** కర్ణాటక రాజధాని బెంగళూరులో సహజీవనం చేస్తున్న యువతిని ప్రియుడు హత్య చేశాడు. కర్ణాటకలోని హాస్సన్ జిల్లాకు చెందిన అనూష(20), శరత్(27) ఇన్‌స్టాగ్రామ్ పరిచయంతో ప్రేమించుకుని ఆరునెలలుగా బెంగళూరులో కలిసుంటున్నారు. కొద్దిరోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం జరిగిన గొడవలో ఆవేశానికి గురైన శరత్.. అనూష గొంతునులిమి చంపి పరారయ్యాడు. సోమవారం నిందితుడు తన లాయర్‌కు ఫోన్ చేసి హత్య గురించి చెప్పడంతో ఈ దారుణం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాస్సన్ జిల్లా, సక్లేష్‌పూర్‌కు చెందిన అనూష అనే యువతికి, అదే ప్రాంతానికి చెందిన శరత్ (27) అనే వ్యక్తితో కొంతకాలం క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. తర్వాత ఈ పరిచయం ఇద్దరి మధ్యా ప్రేమకు దారితీసింది. దీంతో ఇద్దరూ బెంగళూరువచ్చి మల్లేశ్వరం ప్రాంతంలో అద్దెకుంటూ సహజీవనం చేస్తున్నారు. శరత్ బెంగళూరులో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. అక్కడ దాదాపు ఆరు నెలలుగా ఇద్దరూ కలిసే ఉంటున్నారు.
ఈ క్రమంలో ఇద్దరి మధ్యా కొద్దిరోజులుగా విబేధాలు చోటు చేసుకున్నాయి. తాజాగా గత శనివారం కూడా ఇద్దరిమధ్యా వాగ్వాదం జరిగింది. ఈ ఘటనలో ఆవేశానికి గురైన శరత్.. అనూషపై దాడి చేసి, ఆమె గొంతు నులిమి చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. తర్వాత సోమవారం తన లాయర్‌కు ఫోన్ చేసి అనూష హత్య గురించి చెప్పాడు. వెంటనే ఆ లాయర్ ఈ విషయాన్ని పోలీసులకు చెప్పాడు. శేషాద్రిపురం పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువతి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## నీట్ విద్యార్థిని ఆత్మహత్య



**డెహ్రాడూన్, జూన్ 17:** ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు చెందిన 23 ఏళ్ల రియాకుమారి ఆత్మహత్య చేసుకున్నది. 'ఐ లవ్ యు' అంటూ ఆమె తన పేరెంట్స్‌కు సూసైడ్ లేఖ రాసింది. మంగళవారం ఉదయం ఆమె తన రూమ్‌డోర్ తీయలేదు. లంచ్‌కు పిలిచేందుకు తల్లి రూమ్‌కు వెళ్లింది. ఆ అమ్మాయి డోర్ ఓపెన్ చేయలేదు. దీంతో తండ్రికి ఈ విషయాన్ని చెప్పింది. బలవంతంగా డోర్ ఓపెన్ చేయడంతో ఆ విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె రూమ్ నుంచి పోలీసులు సూసైడ్ నోట్ రికవరీ చేశారు. 'ఐ లవ్ యు, మమ్మీ, పాపా.. ఎవరి తప్పు లేదు' అంటూ ఆమె హిందీలో ఓ నోట్ రాసింది. అయితే రాత్రంతా చదువుకునే ఆమె, మరుసటి రోజు ఆలస్యంగా నిద్రలేచేదని పోలీసు అధికారి అంకిత్ ఖండారి తెలిపారు. తన సూసైడ్ నోట్‌లో తండ్రిపై ఆమె ప్రేమను వ్యక్తం చేసింది. తన చావుకు ఎవరూ కారణం కాదు అని ఆమె చెప్పింది. తన అసమర్థత వల్లే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆ నోట్‌లో రాసిందామె.

## స్కూల్ కరిక్యులమ్‌లో కేంద్ర జోక్యం వద్దు:కేరళం సిఎం సతీశన్



**తిరువనంతపురం, జూన్ 17:** పాఠశాలల్లో కరిక్యులం ఎంపికచేసే విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలని కేరళం ముఖ్యమంత్రి విడి సతీశన్ పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోకూడదని అన్నారు. కేంద్రం రూపొందించిన పిఎం శ్రీ పథకాన్ని పరిశీలించేందుకు నలుగురు మంత్రులతో కూడిన ఉపకమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సిఎం సతీశన్ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పిఎంశ్రీ పథకాన్ని అమలు చేసేందుకు పాఠశాలలను ఎంపిక చేసే విషయంలో కూడా రాష్ట్రానికే స్వేచ్ఛ ఉండాలని వ్యాఖ్యానించారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.99 కోట్లు అందాయని తెలిపారు. దీని అమలుకు గత ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం జరిగిందని, దీనికి సం బంధించిన నిధులను కూడా ఆ ప్రభుత్వమే తీసుకుందన్నారు. కాబట్టి అనివార్య పరిస్థితుల్లో దీన్ని ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత శకుంతల మహతో

**కోల్‌కతా, జూన్ 17:** పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఒక పెద్ద విజయం లభించింది. అగ్రశ్రేణి మావోయిస్ట్ నాయకురాలు శకుంతల మహతో అలియాస్ పుష్ప బుధవారం మధ్యాహ్నం కోల్‌కతా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఉమ్మడి బలగాల ఆపరేషన్ సమయంలో ఆమె జార్ఖండ్‌లోని సరండా అడవి నుండి తప్పించుకుని పారిపోయారు. ఆమె పశ్చిమ బెంగాల్‌లో తలదాచుకున్నారన్న ఊహాగానాల మధ్య, మావోయిస్ట్ నాయకురాలు సిపిఐ (మావోయిస్ట్) జోనల్ కమిటీ సభ్యురాలు బుధవారం లాల్‌బజార్‌లోని కోల్‌కతా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయుధాలు, 46 రౌండ్ల బుల్లెట్లతో సహా లొంగిపోయారు. ఆమెపై రూ.10 లక్షల రివార్డు ఉంది.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ఇ-రిక్షా... ఆరుగురు మృతి

**లక్నో, జూన్ 17:** ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ఈ రిక్షా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్, బదౌన్ జిల్లాలో, బరేలిమధుర హైవేపై బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్వ్యానా గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు ఒక ఈరిక్షాలో బంధువుల ఇండ్లకు బయల్దేరారు. తమ ఇంట్లో పెళ్లికి ఆహ్వానించడానికి వెళ్లారు. ఈ క్రమంలో హైవేపై వెళ్తుండగా, ముందు ఉన్న ట్రాక్టర్‌ను దాటుకొని ముందుకు వెళ్లేందుకు ఈరిక్షా డ్రైవర్ ప్రయత్నించాడు. ఒక ట్రాక్టర్‌ను దాటుకుని వెళ్తుండగా, ఎదురుగా వేగంగా వస్తున్న మరో ట్రాక్టర్‌ను ఈరిక్షా ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలోని మహిళల్లో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. ఆటో డ్రైవర్ షాని సహా మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జైంది.

# తిరుమల సమాచారం

## శ్రీవారి సేవలో సంయమీంద్ర తీర్థస్వామి



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం కాశీమఠం సంస్థాన్ పీఠాధిపతి సంయమీంద్రతీర్థస్వామి శిష్యులతో కలసి దర్శనం చేసుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడుకుందాం: తిరుమల డిఎస్పీ విజయశేఖర్

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రపుణ్యక్షేత్రం తిరుమలకు స్వామివారి దర్శనార్థం వస్తున్న భక్తుల మనోభావాలు కాపాడటంలో పెద్దపీట వేయాలని, ఆలయ క్షేత్ర పవిత్రతను కాపాడుకుందామని తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ సూచించారు. భక్తులకు నాణ్యమైన సేవలు, క్షేత్ర పవిత్రత పరిరక్షణకు ప్రత్యేక సూచనలు చేశారు. ధరల ప్రదర్శన, అగ్నిమాపక భద్రత, సిబ్బంది ధృవీకరణపై స్పష్టమైన మార్గదర్శకాలు కలిగి ఉండాలన్నారు. బుధవారం మధ్యాహ్నం తిరుమలలోని దుకాణాల యజమానులతో పోలీసు, విజిలెన్స్, సెక్యూరిటీ శాఖల అవగాహన సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలు, మత సామరస్యం పరిరక్షణకు దుకాణాల యజమానుల పూర్తి సహకారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. తిరుమలలో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడం, క్షేత్ర పవిత్రతను పరిరక్షించడం, శాంతిభద్రతలను బలోపేతం చేయడం వ్యాపార కార్యకలాపాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం లక్ష్యంగా పోలీసు, విజిలెన్స్ సెక్యూరిటీ శాఖల ఆధ్వర్యంలో స్థానిక దుకాణాల యజమానులతో అవగాహన సమావేశం తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించారు. అనుమతి లేకుండా దుకాణాలను సబ్‌లీజ్‌కు ఇవ్వకపోవడం, లైసెన్స్ లేని హాకర్లను ప్రోత్స హించకపోవడం, నిషేధిత అనుమతి లేని వస్తువుల విక్రయాన్ని నివారించడం, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం, అనుమతించిన పరిమితికి మించి నిల్వలను ఉంచకపోవడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది దుకాణాల యజమానులతో పాటు తిరుమల పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మాణ వేగం పెంచాలి

### నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి: జెఇఒ డాక్టర్ శరత్

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణంలో ఉన్న పద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి ఇఒ ముద్దాడరవిచంద్ర ఆదేశాల మేరకు బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు.ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రి భవనం పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, నిర్ణీత కార్యాచరణ ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల వేగాన్ని మరింత పెంచేందుకు అవసరమైన నిపుణులు, కార్మికులు, నిర్మాణ సామగ్రిని తక్షణమే సమకూర్చాలన్నారు. అలాగే మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫర్నిచర్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, గార్డెనింగ్, క్లీనింగ్, నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల పనులను సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ డి. ఫణికుమార్ నాయుడు, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఇలు వేంకటేశ్వర్లు,,మనోహరం, ఇఇలు సుమతి, సరస్వతి, డిప్యూటీ ఇఇ హర్షవర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## బీహారీయులకు వెంకన్న ఆలయం

### 15 ఎకరాలలో పాట్నా సమీపంలో నిర్మాణం

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర భారత భక్తులకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామితో అనుబంధాన్ని మరింత పెంపొందించడంతోబాటు ఆలయం భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ధార్మికసంస్థ టిటిడి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఉత్తర భారత దేశంలో కూడా సనాతన ధర్మ ప్రచారానికి, శ్రీవారి భక్తులకు ఆధ్యాత్మిక సేవలను మరింత చేరువ చేయడానికి మరో కీలక అడుగు పడింది. బీహార్ రాజధాని పాట్నా సమీపంలో గంగా నది తీరానికి దగ్గరగా, జాతీయ రహదారి పక్కన శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం బీహార్ ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రతిపాదిత ఆలయ ప్రాంగణంలో ప్రధాన దేవాలయంతో పాటు కళ్యాణ మండపం, పుష్కరిణి, యాత్రికుల సౌకర్యాలకు అవసరమైన ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం ద్వారా సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తరించాలనే లక్ష్యంతో టిటిడిముందుకు సాగుతోంది. ఈ క్రమంలో అన్ని రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో కార్యాచరణ కొనసాగుతోంది. ఇప్పటికే అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 10 ఎకరాల భూమి కేటాయింపు పూర్తిఅయ్యిన విషయం విదితమే. దీంతో బుధవారం టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో బీహార్ చీఫ్ సెక్రటరీ అమృత్ ప్రత్యయ్ పాల్గొన్నారు.



# యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత

### రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం డీజీ డా.త్రివిక్రమ్ వర్మ



**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతత మరియు ఆరోగ్యకర జీవనశైలి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు)(ఎస్పిఎఫ్)డైరెక్టర్ జనరల్ డా.సియం.త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. ఈనెల 21వతేదీ 12వ అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డా.నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో రాష్ట్ర ఎస్పిఎఫ్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో యోగాంధ్ర" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్ని ఎస్పిఎఫ్ డైరెక్టర్ జనరల్ డా.సియం త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ దైనందిన జీవితంలో పోలీసు సిబ్బంది ఎదుర్కొనే మానసిక శారీరక ఒత్తిడిల నుండి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.కావున ప్రతి ఒక్కరూ ముఖ్యంగా పోలీస్ సిబ్బంది అంతా నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.యోగా సాధనతో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం తోపాటు, ఫిట్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు సహకారం అందించబడుతుందని డిజి త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు.

అంతేగాక యోగా శారీరక,మానసిక ఆరోగ్యానికి బలమైన పునాది వంటిదని నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక మానసిక,శారీరకపరమైన ఒత్తుడుల నుండి ఉపశమనం పొందవచ్చని డా.త్రివిక్రమ్ వర్మ అన్నారు.కావున ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. "యోగాంధ్ర" కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం మనందరి బాధ్యతని ఎస్పిఎఫ్ డిజి డా.త్రివిక్రమ్ వర్మ స్పష్టం చేశారు.ఈ యోగాంధ్ర కార్యక్రమంలో సుమారు 350 మందికి పైగా ఎస్పిఎఫ్ పోలీస్ సిబ్బంది, ఇతరులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా సనాలు, ప్రాణాయామాలు అభ్యసిం చారు. ఎస్పిఎఫ్ జోనల్ కమాండెంట్ ముద్దాడ శంకర్ రావు మరియు డా.ఎన్టిటిపిఎస్ ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ కమాండెంట్ టి.కృష్ణమాచారి వారి ఆధ్వర్యంలో ఈయోగా ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఇంకా ఈ కార్యక్రమా నికి ఇన్స్పెక్టర్ జనరల్ తీ.జు.రామి రెడ్డి,డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ సిఇ శివ రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం చీఫ్ సెక్యూరిటీ అధికారి. మల్లికార్జున రావు,ఆంధ్ర ప్రదేశ్ హై కోర్ట్ అసిస్టెంట్ కమాండెంట్ కే. శ్రీనివాసులు, విజయవాడ గన్నవరం అంతర్జాతీ విమానాశ్రం అసిస్టెంట్ కమాండెంట్ ట్.కె రావు, విజయవాడ గార్డ్స్ అసిస్టెంట్ కమాండెంట్ పి.హేమసుందర రావు,యోగ గురువు లంకె జనార్దన్,ఇన్స పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# యోగాంధ్రలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, విద్యార్థులు

### డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణు వర్ధన్ వెల్లడి

### ప్రభుత్వ వైద్య , నర్సింగ్ డెంటల్ కాలేజీల నుంచి 15,062 మంది

### యోగాంధ్ర పోర్టల్ ద్వారా నమోదు

**విజయవాడ.జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** యోగాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య విద్యా సంస్థల నుంచి భారీ స్పందన లభిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య, దంత, నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, వైద్యులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జూన్ 7 నుంచి 16 వరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని సంస్థల్లో మొత్తం 15,062 మంది తమ పేర్లను పోర్టల్ లో నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే అత్యధికంగా 10,792 మంది నమోదు చేసుకున్నారని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. పోర్టల్లో నమోదు చేసుకున్న వారిలో కొంత మంది స్థానికంగా నిర్వహించే యోగాసనాల్లో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్ నుంచి 1,625 మంది, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ నుంచి 1,400 మంది, గుంటూరు మెడికల్ కాలేజ్ నుంచి 1,091 మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సంసిద్ధతను వ్యక్తం చేయడం విశేషం. నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 800 మంది, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 840 మంది నమోదు చేసుకున్నారు.ప్రభుత్వ దంత వైద్య కళాశాలల్లో విజయవాడ, కడప కళాశాలల నుంచి కలిపి 449 మంది నమోదు చేసుకున్నారు. నర్సింగ్ కళాశాలల్లో 3,821 మంది యోగా సాధన చేశారు. ఒంగోలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల 452 మందితో అగ్రస్థానంలో నిలవగా, కర్నూలు 432 మంది, ఏలూరు 377 మంది, కడప 332 మంది, తిరుపతి 315 మందితో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న విజయవాడలోని ఇందిరాంధీ మునిసిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి వైద్య విద్యాసంస్థలు విశేష మద్దతు అందిస్తున్నాయని అధికారులు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందనే సందేశాన్ని వైద్య విద్య, నర్సింగ్ విద్యార్థులు, డాక్టర్లు, సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. డిఎంఈ పరిధిలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, 2 ప్రభుత్వ దంత వైద్య కళాశాలలు ఉన్నాయి.

# వేడాం పొలాల్లో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం

### ఎంఎల్ఏ, జిల్లా కలెక్టర్ హాజరు

**శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త:** ప్రభుత్వం నూతనంగా రూపొందించి అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం పనులకు సంబంధించి బుధవారం శ్రీకాళహస్తికి సమీపంలోని వేడాం గ్రామంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌లు పాల్గొన్నారు. ఇద్దరు పంటపొలాల్లో నాట్లును వేసారు. ఈ సందర్భంగా విత్తన గుళికలను ఇరువురు తయారు చేసారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఎలాంటి లాభాలు రైతులకు కల్గుతాయో వివరించారు. ఈ సందర్భంగా రైతులకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అందుకు కావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను అందించే ప్రకృతి వ్యవసాయం విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఈ సందర్భంగా వేడాం గ్రామంలో మూడెకరాల వ్యవసాయ క్షేత్రం సందర్శించారు. ఈ వ్యవసాయం గ్రామానికి చెందిన ఏ.పుష్పకు సంబంధించినదిగా వ్యవసాయాధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్వయంగా మన జీవామృతం, ద్రవ జీవామృతం, బూడిద మరియు విత్తనాలను కలపి విత్తన గుళికలను తయారు చేసారు. అనంతరం రైతు పుష్ప పొలంలో విత్తనాల గుళికలను బ్రాడ్ కాస్టింగ్ పద్ధతిలో చల్లి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు.



**పంట పొలాల్లో ఎంఎల్ఏ, కలెక్టర్**

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామానికి చెందిన మహిళా రైతు పుష్ప పంట పొలాల్లో బుధవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ హ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటర్ సహాయంతో వరి నాట్లు వేసి వ్యవసాయ పనులు నిర్వహించారు. రైతుల శ్రమను తగ్గించటంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేయటానికిహ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటర్ వంటి వ్యవసాయ పరికరాలను ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో వారితో పాటు జిల్లావ్యవసాయాధికారి ప్రసాదరావు,శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యనాయుడు, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లాఅదనపు వ్యవసాయాధికారి ధనంజయులరెడ్డి ఏడిఏ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్లు పెంచాలి

### ఎపి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు వినతి

**గుంటూరు, జూన్ 17, ప్రభాతవార్త ప్రతినిధి:** డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా బీసీ కులాల జన గణన ను శాస్త్రీయంగా నిర్వహించి, సుప్రీం కోర్టు 50 శాతం పరిమితిని ఎత్తేపించి స్థానిక సంస్థల రిజర్వేషన్లను జనాభా దామాషా మేరకు పెంచేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక గుంటూరు కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ ఐఎఎస్ కాన్ఫరెన్స్ హాల్ లో బీసీ బృందంతో కలిసి రాజీవ్ రంజన్ మిశ్రా కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు విజ్ఞప్తి చేశారు. "ఆదిలోనే హంసపాదు" అన్నట్లు జనగణనను రెండు దశల్లో చేస్తూ, మొదటి దశ గృహ గణన ఫార్మేట్ లో ఓబీసీల గృహ గణన లెక్కించే కాలమ్ లేకపోవడం సరికాదన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా నాయకత్వంలో డెడికేటెడ్ కమిషన్ సుప్రీం కోర్టు ట్రిపుల్ టెస్ట్ ఆర్డర్ ను సంతృప్తికరంగా అమలు జరిపేలా రాష్ట్రంలో బీసీల కుల గణన ద్వారా సరైన ఎం పరికల్ డేటా సేకరించి, వారి రిజర్వేషన్ల పెంపుకు సహకరించాలన్నారున విజ్ఞాపన పత్రాన్ని సమర్పించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన రాష్ట్ర అధ్యక్షులు పారేపల్లి మహేష్, ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్, బాపట్ల ప్రధాన కార్యదర్శి రవికుమార్,రాష్ట్ర కార్యదర్శి కోలా అశోక్, దొంత బ్రహ్మం, కేశవ కోటేశ్వరరావు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.


## చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబాన్ని పరామర్శించిన హోం మంత్రి అనిత

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్17, ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం పరామర్శించారు.పోలీసు అధికారులకు సైతం అంతుచిక్కని మిస్టరీ గా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన చిన్నారి అదృశ్యం పై హోంమంత్రి గతంలోనే స్పందించారు.అయితే నేరుగా హోం మంత్రి అనిత సంఘటన స్థలానికి చేరుకుని చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన చిన్నారి అదృష్టమైనప్పుడు నుండి పోలీసులు చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం పోలీసు సిబ్బందిని, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, అటవీ శాఖ సిబ్బంది శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రోన్ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాల తో చిన్నారి ఆచూకీ కోసం గస్తి నిర్వహిస్తున్నరన్నారు. చిన్నారి తో అదృశ్యమైన పెంపుడు కుక్క తిరిగి వచ్చిన తర్వాత మృతి చెందడంతో పోస్టుమార్టం నిర్వహించి ఆధారాలు కోసం శాంపిల్స్ ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ కి ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇతర అదికారయంత్రాంగం మంత్రి వెంట ఉన్నారు.

## కాకరేపుతోన్న వైసీపీ కాపు నేతల లంచ్ భేటీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 17,ప్రభాత వార్త:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా తలపెట్టిన వైసీపీ కాపు నేతల లంచ్ బేటీ కాకరేపుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి కాపు సామాజికవర్గ ముఖ్య నేతల సమావేశం ఈ నెల 21న తలపెట్టడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.వెంకటాయపాలెంలోని వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నివాసంలో లంచ్ మీటింగ్ ఏర్పాటు పేరుతో పార్టీలోని కాపు నేతలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వయంగా ఫోన్లు చేసి విందుకు ఆహ్వానిస్తున్నారు. పైకి దీనిని కేవలం"గెట్ టుగెదర్ (ఆత్మీయ కలయిక) సమావేశంగానే చెబుతున్నప్పటికీ సమావేశం అన్నాక అన్ని విషయాలూ చర్చకు వస్తాయి కదాఖిలంటూ తోట వ్యాఖ్యానించడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అంతర్గత సమీకరణాల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ భేటీ ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న ఉత్కంఠ రేపుతోంది.

## తిరుచానూరు పద్మావతి ఆలయంలో నిత్య ఆర్జిత సేవలు



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో భక్తుల కోరికలను కరుణతో తీర్చే సిరుల తల్లి పద్మావతి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక ప్రశాంతత కలగాలని సంకల్పిస్తూ తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో నిత్యం ఆర్జిత సేవలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం జరుగుతున్న ఈ సేవల్లో దేశ విదేశాల నుండి వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతున్నారు. టిటిడి ఆధ్వర్యంలో నిత్య, వారాంత, నెలవారీ, వార్షిక, శాశ్వత ఆర్జిత సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సమర్పించే ప్రతి సేవ భక్తులలో భక్తి భావనను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం ఉదయం 3.30 గంటలకు ఈ సేవ జరుగుతుంది. ఉదయం 5 గంటలకు సహస్రనామార్చన నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 4 గంటలకు ఈ సేవ ఉంటుంది.ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు పద్మావతి అమ్మవారి కళ్యాణోత్స వం వైభవంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు కుంకుమార్చన సేవ నిర్వహిస్తారు.సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు సహస్ర దీపాలంకార సేవ జరుగుతుంది. ప్రతిరోజూ రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం రాత్రి 9.45 గంటలకు ఈ సేవ ఉంటుంది. ఆలయంలోని వేదాశీర్వచన మండపంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వేదాశీర్వచనం కార్యక్రమం నిర్వహిస్తారు.

ప్రతిరోజూ ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వి.ఐ.పి. బ్రేక్ దర్శనం ఉంటుంది. ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహిస్తారు. ప్రతి గురువారం ఉదయం 7 గంటలకు తిరుప్పావడ సేవ జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఉదయం 5.30 గంటలకు వస్త్రాలంకరణసేవ, అనతరం అభిషేకం నిర్వహిస్తారు.ఉదయం 7గంటలకు అభిషేకానంతరం దర్శనం ఉంటుంది. అదే రోజు ఉదయం 9.30 గంటలకు లక్ష్మీపూజ నిర్వహిస్తారు.ప్రతి శనివారం ఉదయం 7.30 గంటలకు పుష్పాంజలి సేవ జరుగుతుంది. ఇక నెలవారీసేవల్లో ప్రతి నెల మొదటి బుధవారం ఉదయం 7 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. ప్రతి ఏడాది మే నెలలో వార్షిక వసంతోత్స వాలు, సెప్టెంబర్ నెలలో పవిత్రోత్స వాలు నిర్వహిస్తారు.

నవంబర్ నెలలో జరిగే వార్షిక బ్రహ్మోత్స వాల్లో అంకురార్పణ రోజున లక్ష కుంకుమార్చన, మరుసటి రోజు పుష్పయాగం వైభవంగా జరుగుతాయి. ఆగస్టు,సెప్టెంబర్ నెలలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు. శాశ్వత సేవలలో భాగంగా నిత్య అర్చన, ఊంజల్ సేవలను భక్తులు కోరిన రోజున నిర్వహించి ఇద్దరికి దర్శన భాగ్యం కల్పిస్తారు.

పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రతి శనివారం ఉదయం, అలాగే సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రతి ఆదివారం ఉదయం అభిషేక సేవలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆర్జిత సేవల టికెట్లను టిటిడి అధికారిక వెబ్‌సైట్ టిటిడిదేవస్థానమ్స్. ఎపి.జివొవి.ఇన్ లో ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా కూడా సేవా టికెట్లు పొందవచ్చు.

## విజయప్రతాప్ రెడ్డికి భద్రతను పునరుద్ధరించాలి ఏపీ హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జూన్ 17, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ (ఫుడ్ కమిషన్) ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డి భద్రత వ్యవహారంలో ఏపీ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి షాకిచ్చింది.విజయప్రతాప్ రెడ్డికి 1+1 భద్రతను పునరుద్ధరించాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ విషయంలో ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చుతూ, ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

# అన్ని రంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత



**కడప, జూన్ 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి సాధనతో పాటు.. జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్ర తినిధులు సమన్వయంతో, సమిష్టిగా పాటుపడాలని జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర వెనుకబడిన తరగతులు,బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి,జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అన్నారు. బుధవా రం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో.. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారసులుగా ఉన్న అధికారులు.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్ర మాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా తుడిచి పెట్టే లక్ష్యంతో.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు.అందుకు అనుగుణంగా. అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా కృషి చేయాల న్నారు. పారదర్శకత, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా నడుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమా లపై ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రజలకు ఒక జవాబుదారీతనంతో సుపరి పాలన అందిస్తూ స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధన కు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలను సంతృప్తి స్థాయిలో ప్రజలకు అందిస్తూనే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల కోసం ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయి లో సక్రమంగా,విజయవంతంగా అమలు చేయడం అధికారుల బాధ్యత అన్నారు.ప్రభుత్వంలో భాగస్వాములైన జిల్లా కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీ లు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములై... అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి.ప్రజా ప్రతినిధులు,అధికారులు ఇరువురూ సమన్వయంతో పనిచేసి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నారు. ప్రస్తుతం జరు గుతున్న ఎస్.ఐ. ఆర్. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా స్వీక రించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో అమలు చేస్తున్న 10 సూత్రాల పురోగతిని, వైఎ స్సార్ కడప జిల్లాలో ప్రాధాన్యతా రంగాల వారీగా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు క్షుణ్ణంగా వివరించారు.



## నకిలీ రెవెన్యూ సీళ్ళతో ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్

### కలెక్టర్ ఆదేశాలతో ఇద్దరు నిందితులు అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

**శ్రీరంగరాజపురం (చిత్తూరు జిల్లా), జూన్ 17 ప్రభాతవార్త:** తహసిల్దారు, గ్రామ రెవెన్యూ అధికారులు విచారించి, నిర్ధారించి జారీ చేయాల్సి న పత్రాలను నకిలీ సీళ్ళు ఉపయోగించి నకిలీ పత్రాలు రూపొందించి ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కార్వేటినగరం సర్కిల్ ఇన్స్ పెక్టర్ హనుమంతప్ప బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం గ్రామంలోని తులసీరామ్ అనే వ్యక్తి ఇంటి స్థలం రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. తన ఇంటి స్థలంను నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారని ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకోవాలని తహసిల్దారు లోకనాథపిళ్ళైను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రంగంలో దిగిన తహసిల్దారు లోకనాథపిళ్ళై ఇంటి స్థలంను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కోసం కొంతమంది నకిలీ రెవెన్యూ అధికారుల సీళ్ళను తయారు చేసి రిజిస్ట్రేషన్, ఇతర పత్రాల్లో సీళ్ళు వేసి డబ్బులు గుంజుకుంటారని నిర్ధారణ అయ్యింది. ఈ వ్యవహారంలో ఎస్ఆర్ పురం మండల రెవెన్యూ అధికారులు అనుభవం సర్టిఫికేట్ ఇవ్వలేదని, సీలు, సంతకం తనది కాదని సంబంధిత విఆర్ఓ స్పష్టం చేయడంతో తహసిల్దారు లోకనాథపిళ్ళై ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుమన్‌కు నాలుగు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఎస్ఐ సుమన్ విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. కార్వేటినగరం మండలంకు చెందిన లవకుమార్, ఎస్ఆర్ పురం మండలం వడ్డిపల్లి గ్రామంకు చెందినయోగానంద్ అలియాస్ ఉమాపతి అనే ఇద్దరు వ్యక్తులు ఫోర్జరీ డాక్యు మెంట్లు, నకిలీ రెవెన్యూ అధికారుల సీళ్ళను తయారు చేసి అవసరమైన వారికి భారీ మొత్తంలో డబ్బు లు తీసుకుని నకిలీ సర్టిఫికేట్లు ఇచ్చేవారని తేలింది. విచారణలో ఈ విషయాలు వెలుగు చూడటంతో లవకుమార్‌తో పాటు యోగానంద్ అలియాస్ ఉమాపతిని అరెస్టు చేసి వారి నుండి రెవెన్యూ అధికారులకు సంబంధించి కొన్ని నకిలీ డాక్యూమెంట్లు, 18 వరకు రెవెన్యూ స్టాంపులను ఎస్ఐ సుమన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో మరెంత మంది వున్నారనే విషయంపై సమగ్రంగా విచారణ చేస్తున్నామని కార్వేటినగరం ఇన్స్ పెక్టర్ హనుమంతప్ప తెలిపారు.

# వైభవంగా సామూహిక ఉచిత అక్షరాభ్యాసాలు





**ఇంద్రకీలాద్రి, జూన్ 17, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం వైభవంగా ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొని అక్షరాభ్యాసం చేసుకున్న చిన్నారులకు పలక, బలపం, శ్రీ అమ్మవారి ప్రసాదాలు అందించారు. ఆన్‌లైన్ ద్వారా బుకింక్ చేసుకున్న 250 మంది చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. మహామండపం 6వ అంతస్తులోఉదయం 7.30 కు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాసరస్వతి స్వరూపిణి అయిన దుర్గమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ సారధ్యంలో పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా పూర్తయింది. కార్యక్రమం అనంతరం చిన్నారులకు వారి తల్లిదండ్రులకు రు.300ల క్యూలయిన్లో ఉచితంగా దర్శనం చేయించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చందోలు పొన్నూరుకు చెందిన వేంకట నాగ సత్య సుధీర్ బాబు తమ కుటుంబసభ్యులతో కలిసి రు.1లక్ష విరాళం బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారి ఆలయంలో యోగాంధ్ర వేడుకలు:** దుర్గమ్మవారి ఆలయంలో యోగాంధ్ర వేడుకలు 11వ రోజు విజయవంతంగా జరిపారు. జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా సాధకులతో ఆరోగ్య చైతన్యం నింపడం లక్ష్యంగా ప్రత్యేక యోగాసనాలతోపాటు ప్రాణాయామంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఓ వికె శీనా నాయక్ దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న యోగాంధ్రలో విశేష సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



## ఏపీఎస్పీడీసీఎల్ గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్ ఆకస్మిక తనిఖీ

**గూడూరు (నెల్లూరు), జూన్ 17, ప్రభాతవార్త :** ఏపీఎస్పీడిసిఎల్ పరిధిలోని గోదాముల్లో విద్యుత్ పరికరాల నిర్వహణ అత్యంత కీలకమని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నెల్లూరు సర్కిల్ పరిధిలోని గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్, ఎస్‌పీఎం షెడ్, ట్రాన్స్ ఫార్మర్స్ రిపేర్ కేంద్రంలను ఆయన బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ స్టోర్స్‌లో విద్యుత్ పరికరాల నిర్వహణను క్రమబద్ధంగా చేపడుతూ వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన మెటీరియల్‌ను సకాలంలో అందించాల్సి న బాధ్యత స్టోర్స్ అధికారులపై ఉందన్నారు. గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్‌ను స్మార్ట్ స్టోర్గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెటీరియల్ నిర్వహణలో అలసత్వం లేదా అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టోర్‌లోని ఏబీ కేబుల్స్, ట్రాన్స్ ఫార్మర్లు, ఇన్సు లేటర్లు, బ్రేకర్లు, క్యూబికల్స్, ఎర్త్ పైపులు, కండక్టర్లు తదితర పరికరాలను పరిశీలించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరికరాలు నిరుపయోగంగా మారకుండా వాటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్టోర్స్‌లో నిల్వ ఉన్న పాత పరికరాలను టెండర్ ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు విక్రయించేలా చర్యలు చేపట్టాలని సూచించిన సీఎండి, పరికరాల భద్రత మరియు నిర్వహణ కోసం రెండు నెలల్లోగా ప్రత్యేక ప్లాట్‌ఫామ్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్టోర్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని సూచించారు. అనంతరం గూడూరు డివిజనల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించిన సీఎండి శివశంకర్ లోతేటి, రెవెన్యూ కలెక్షన్లను మరింత వేగవంతం చేయాలని, బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచి పాజిటివ్ పర్సెప్షన్‌ను మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సంస్థ ప్రతిష్ఠను పెంచే విధంగా ప్రతి అధికారి, ఉద్యోగి పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్. రమణ, సూపరింటెండింగ్ ఇంజనీర్లు డి. తిరుమలరావు, వి. చంద్రశేఖరరావు, కే. రాఘవేంద్రం, జనరల్ మేనేజర్లు పి.వి. సుబ్బారావు, సిహెచ్. నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలచంద్ర, నరేంద్ర, శ్రీధర్, లక్ష్మినారాయణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం సమర్ధవంతంగా అమలు

### రైతు కుటుంబాల ఆర్థిక భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోంది:మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రైతు కుటుంబాల ఆర్థిక భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యల విషయంలో వైసీపీ సానుకూల మాధ్యమాల్లో పనిగట్టుకుని అబద్ధాలను ప్రచురిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. జూన్ 2024 నుండి ఇప్పటి వరకు 540 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్న ప్రచారం నిజం కాదని తెలిపారు. త్రిసభ్య కమిటీ విచారణ అనంతరం గత రెండేళ్ల కాలంలో 148 కేసులు మాత్రమే రైతు ఆత్మహత్యలుగా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. వ్యవసాయ కారణాల వల్ల బలవన్మరణానికి పాల్పడిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తోందని తెలిపారు. ఇప్పటికే 148 కేసుల్లో 112 మంది రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసేందుకు బిల్లులు సమర్పించామని, మిగిలిన కేసులను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో మరణించిన 81 మంది రైతులకు పరిహారం నగదు ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం వచ్చినాక 5.67 కోట్ల నగదును సంబంధిత రైతుల కుటుంబాలకు చెల్లించామని మంత్రి తెలిపారు. రైతుల ఆర్థిక భద్రత కోసం కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి అర్హత రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 అందజేస్తోందని వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 46.86 లక్షల రైతు కుటుంబాలకు మూడు విడతలుగా మొత్తం రూ.8,985.41 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6,560.18 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2,425.23 కోట్లు అని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో రైతులకు చెల్లించాల్సి న ధాన్యం సేకరణ బకాయిలు పెండింగ్‌లో ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,674.47 కోట్ల పాత బకాయిలను పూర్తిగా చెల్లించి రైతులకు అండగా నిలిచిందని మంత్రి వెల్లడించారు. రైతు శ్రమ దోపిడీకి గురికాకుండా, ఆయన శ్రమ సంపదగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదన్న ఉద్దేశంతో ధరల స్థిరీకరణ నిధి ద్వారా విస్తృత సహాయం అందించామని తెలిపారు. గత బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ, రైతుల ప్రయోజనాల కోసం దాదాపు రెట్టింపు స్థాయిలో రూ.588 కోట్లు ఖర్చు చేసి లక్ష మంది రైతులను ఆదుకున్నామని వివరించారు. తోతాపూరి మామిడి రైతులకు రూ.190 కోట్లు, కడప, కర్నూలు ఉల్లి రైతులకు కొనుగోలు చర్యల కోసం రూ.17.56 కోట్లు, ఉల్లి పంట నష్టపరిహారం కింద హెక్టారుకు రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచి రూ.128.33 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అదేవిధంగా పొగాకు రైతులకు రూ.240 కోట్లు, కోకో రైతులకు రూ.12 కోట్లు చెల్లించి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.500 కోట్లు ప్రతిపాదించామని, అవసరమైతే రైతుల కోసం అదనపు నిధులు కూడా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం ద్వారా రాష్ట్రంలోని 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు రోజుకు 9 గంటలపాటు నిరంతర పగటి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంపై రూ.13,241.17 కోట్ల సబ్సిడీ వ్యయం జరిగినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 68,988 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర ఉద్యానవన రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టును కేంద్ర సహకారం, ప్రైవేటు పెట్టుబడులతో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.

పండ్ల ఉత్పత్తిలో 15.6 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉందని, ఆయిల్ పామ్, బొప్పాయి, నిమ్మ, కోకో, టమోటా, కొబ్బరి ఉత్పాదకతలో దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించారు. మిరప ఉత్పత్తిలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. పామాయిల్ తోటల విస్తరణకు 2026-27లో రూ.204 కోట్లు ప్రతిపాదించామని, పశ్చిమ గోదావరి జిల్లాను కోకో హబ్‌గా అభివృద్ధి చేసి కోకో సిటీ ఏర్పాటు ద్వారా చాక్లెట్ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ కాలానికి సంబంధించిన రూ.1,990.10 కోట్ల ప్రీమియం సబ్సిడీ బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పాపం జగన్ చేసిందే. మొదటి రెండేళ్లు ఇచ్చారు అందులో 1990 కోట్లు బకాయి పెట్టారు, మిగతా మూడు ఏళ్లు ప్రీమియం కట్టలేదు. బకాయిని తిరిగి కట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా బంగారు రుణాల పునఃపరిశీలన

### బాధిత ఖాతాదారులకు పూర్తి న్యాయం చేస్తాం

### ప్రాంతీయ మేనేజర్ ఎస్.కె. కిరణ్ రెడ్డి భరోసా

**జంగారెడ్డిగూడెం జూన్ 17 ప్రభాతవార్త:** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో జరిగిన బంగారు రుణాల వ్యవహారంపై విజయవాడ ప్రాంతీయ మేనేజర్ ఎస్.కె. కిరణ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాధిత ఖాతాదారులకు, ప్రభావితమైన వారందరికీ వారి సంతృప్తి మేరకు పూర్తి పరిష్కారం అందించడానికి బ్యాంకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నియంత్రణ సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా, అత్యంత జాగ్రత్తతో ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినియోగదారుల నమ్మకం, వారి ప్రయోజనాలే బ్యాంకుకు అత్యంత




ప్రాధాన్యతని ప్రకటనలో పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం శాఖలో నిర్వహించిన సాధారణ అంతర్గత నివారణా తనిఖీ (సమగ్ర విజిలెన్స్ ఆడిట్) సందర్భంగా బంగారు రుణ ఖాతాలలో ఒక నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించామని వెల్లడించారు. ఈ విషయం తెలిసిన వెంటనే వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు శాఖలోని అన్ని బంగారు రుణ ఖాతాలపై తక్షణమే, సమగ్రంగా పునఃమూల్యాంకనం ప్రారంభించి త్వరితగతిన చర్యలు చేపట్టామని తెలిపారు. పూర్తి పారదర్శకతను పాటిస్తూ, సంబంధిత వినియోగదారుల సమక్షంలోనే అన్ని బంగారు రుణ ప్యాకెట్ల ధృవీకరణను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ జాగ్రత్తగా, కచ్చితత్వంతో పూర్తయ్యేలా చూసేందుకు అర్హత కలిగిన ఆభరణాల మదింపుదారులను, అదనపు సిబ్బందిని సదరు శాఖలో నియమించినట్లు వివరించారు. నియంత్రణ సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని కిరణ్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# మౌలిక వసతుల కల్పనకు కేంద్రం భారీ స్థాయిలో నిధులు : కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

### దసరా ఉత్సవాల నాటికి టెర్మినల్ పూర్తిచేయాలి

### గన్నవరం నుండి మరిన్ని విదేశీసర్వీసులు



గన్నవరం విమానాశ్రయం నూతన టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, యంపి కేశినేని చిన్ని తదితరులు

**గన్నవరం(కృష్ణా), జూన్ 17, ప్రభాతవార్త :** మన దేశంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రప్రభుత్వం బారీస్థాయిలో నిధులు ఖర్చుచేస్తున్నట్లు కేంద్ర ఉక్కు,భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. గతంలో మౌలికవసతుల కోసం రూ.2లక్షల కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12.02లక్షలకోట్లు కేయించిన ఘతన ప్రధాని మోడీకి దక్కుతుందన్నారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవననిర్మాణ పనులను బుధవారం మంత్రి విజయవాడ యంపి కేశినేని చిన్ని, బిజేపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా నిర్మాణపనుల పురోగతిని అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. దసరా నాటికి టెర్మినల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. ఈసందర్బంగా మంత్రి వర్మ మీడియాతో మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో అభివృద్ధిని బేరీజు వేయాలంటే మోడీకి ముందు మోడీ తరువాత అని సగర్వంగా చెప్పుకునే స్థాయికి దేశం అభివృద్ధి చెందిందన్నారు. సవరించి అంచనాల మేరకు రూ.824.28కోట్ల భారీవ్యయంతో గన్నవరంలో నూతన టెర్మినల్ భవనం నిర్మాణం జరుగుతుందన్నారు. బేస్‌మెంట్‌తో కలుపుకుని మొత్తం 51,315 చదరపు మీటర్ల వైశాల్యంతో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతుందన్నారు. ఏటా 3.5మిలియన్ ప్రయాణికుల రద్దీని తట్టుకునేలా అత్యుత్తమ డిజైన్‌తో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. రద్దీసమయాల్లో ఒకేసారి 800మంది డొమెస్టిక్, 400 మంది అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు వీలుంటుందన్నారు. ఇక్కడ 648కార్లు పార్కింగ్‌చేసే సదుపాయం ఉందన్నారు. ఈటెర్మినల్ నిర్మాణ పనులను నవంబర్ 10వతేదీకి పూర్తిచేసి డిసెంబర్ 31నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. విజయవాడలో వైభవంగా జరిగే దసరా ఉత్సవాల నాటికే టెర్మినల్‌ను పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఇక్కడి నుండి సింగపూర్‌కి మాత్రమే అంతర్జాతీయ విమాన సర్వీసు అందుబాటులో ఉండగా, కొత్తటెర్మినల్ పూర్తయిన తరువాత విదేశీ సర్వీసులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఉడాన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా వాడుకలో లేని 100 చిన్న విమానాశ్ర యాలను అభివృద్ధి చేయటంతోపాటు కొండ, గిరిజన, ద్వీపకల్ప ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచేందుకు 200 ఆధునిక హెలిప్యాడ్‌లను కేంద్రప్ర భుత్వం నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీనివాసవర్మ చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శరవేగంగా రూపుద్దిద్దుకుంటుందని, త్వరలో ఈవిమానాశ్రయం ప్రారంభం కానుందన్నారు. మోడీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పోర్టులు, రైల్వేల అభివృద్ధి, వందేభారత్, అమృత్‌భారత్, హైస్పీడ్ కారిడార్లు, జాతీయరహదారుల నిర్మాణంతో దేశవ్యాప్తంగా కనెక్టివిటీలో విప్లవాత్మక మార్పులు వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్రఅధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, బిజేపి కృష్ణాజిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరాం, ఎన్‌టిఆర్‌జిల్లా బిజేపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరాం, నాయకులు కిలారి దిలీప్, షేక్ బాజీ, మువ్వల వెంకటసుబ్బయ్య, గుత్తికొండ శ్రీరాజబాబు, పిట్టల గోవిందు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్‌కు భారత్

## 101 రన్స్ తేడాతో అఫ్ఘాన్‌పై ఘన విజయం



**న్యూఢిల్లీ:** ముక్కోణపు వన్డే సిరీస్‌లో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఎ అదరగొట్టింది. అఫ్గానిస్థాన్ ఎ తో బుధవారం జరిగిన మ్యాచ్ సమష్టిగా రాణించిన భారత్ 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. స్పిన్ ఆల్‌రౌండర్ నిషాంత్ సింధు(4/31) నాలుగు వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ భారీ విజయంతో ఈ ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్‌కు ఫైనల్ బెర్త్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 319 పరుగుల భారీ స్కోర్ చేసింది. ప్రియాన్ష్ ఆర్య(58), తిలక్ వర్మ(59), కుమార్ కుశాగ్ర(58) హాఫ్ సెంచరీలతో రాణించగా, వైభవ్ సూర్యవంశీ(38), రుతురాజ్ గైక్వాడ్(30), విప్రజ్ నిగమ్(30) పర్వాలేదనిపించారు. అఫ్గాన్ బౌలర్లలో ఫరిదూన్, అబ్దుల్లా అహ్మద్‌జై , ఫర్మనుల్లా రెండేసి వికెట్లు తీయగా, జహీర్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం అఫ్గానిస్థాన్ 36.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. బహీర్ షా(57) హాఫ్ సెంచరీతో రాణించగా, ఫైసల్(46) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో నిశాంత్ సింధు(4/31)తో పాటు యశ్ ఠాకూర్(2/48) రెండు వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కంబోజ్, విప్రజ్ నిగమ్, సూర్యాన్ష్ షెడ్గే, అనుకుల్ రాయ్ తలో వికెట్ తీసారు.

### బాక్సింగ్ ప్రపంచ కప్: ముందంజలో

# జ్యోతి, ప్రాచీ, నిఖిల్




**న్యూఢిల్లీ:** చైనాలో జరుగుతున్న బాక్సింగ్ ప్రపంచ కప్ (రెండవ దశ) రెండవ రోజున భారత బాక్సర్లు జ్యోతి, ప్రాచీ మరియు నిఖిల్ విజయం సాధించారు. గ్వీయాంగ్ నగరంలోని గ్వీయాంగ్ ఒలింపిక్ స్పోర్ట్స్ సెంటర్ జిమ్నాసియంలో జరగనున్న తమ తమ వెయిట్ కేటగిరీల తదుపరి రౌండ్‌కు వారు అర్హత సాధించారు. మహిళల 57 కేజీల విభాగంలో పోటీపడిన ప్రాచీ, అమెరికాకు చెందిన డెబోరా గ్రాంట్‌పై 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఘన విజయం సాధించి పోటీలో ముందంజ వేసింది. మహిళల 48 కేజీల విభాగంలో అంతే ఆధిపత్య ప్రదర్శన కనబరిచిన జ్యోతి, రెండవ రౌండ్‌లో మంగోలియాకు చెందిన ఎంఖ్ అమ్గలన్ నోముండారిని ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. ఈ కీలక విజయంతో, జ్యోతి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించి దేశానికి పతకాన్ని ఖాయం చేసింది. పురుషుల 55 కేజీల విభాగంలో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టోఫర్ హిప్పోక్రేట్‌పై హోరాహోరీగా జరిగిన పోరులో 3-2 స్ప్లిట్ డెసిషన్ విజయం సాధించిన తర్వాత నిఖిల్ కూడా ముందుకు సాగాడు. ఇతర ప్రాథమిక పోటీలలో, పూనమ్ (54 కేజీలు) చైనీస్ తైపీకి చెందిన హ్సియావో వెన్ హువాంగ్ చేతిలో 2-3 తేడాతో స్వల్పంగా ఓడిపోగా, ఆకాష్ (75 కేజీలు) పోలాండ్‌కు చెందిన మాటియస్ అర్బన్ చేతిలో అదే 2-3 తేడాతో పరాజయం పాలయ్యాడు. మహిళల 70 కేజీల విభాగంలో ఫ్రాన్స్‌కు చెందిన మేలీస్ రిచోల్ చేతిలో 0-5 తేడాతో ఓటమి పాలైన తర్వాత గిటిమోని కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది.

### ఐసిసి ర్యాంకింగ్స్‌లో హేలీ మాథ్యూస్

# ఆల్‌రౌండర్ నం.1

## భారత్ స్టార్స్ దీప్తి, శ్రీ చరానీ పురోగతి




**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 న్యూజిలాండ్‌పై జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనల తర్వాత, వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఐసీసీ మహిళల టీ20ఐ ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో నెం.1 స్థానాన్ని తిరిగి దక్కించుకోగా, భారత స్టార్ క్రీడాకారిణులు దీప్తి శర్మ, శ్రీ చరానీ ఈ జాబితాలో గణనీయమైన పురోగతిని నమోదు చేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌పై 10 పరుగులకు 5 వికెట్లు తీసి మ్యాచ్ గెలిపించిన ప్రదర్శన తర్వాత, దీప్తి టీ20ఐ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో 2 స్థానాలు ఎగబాకింది. భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఈ ఆఫ్‌స్పిన్నింగ్ ఆల్ రౌండర్, ఇప్పుడు పాయింట్ల పట్టికలో వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్, న్యూజిలాండ్ కెప్టెన్ మెలీ కెర్‌ల వెనుక స్థానంలో ఉంది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కూడా భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. ఇందులో భాగంగా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరానీ 5 స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన 2వ స్థానానికి చేరుకుంది. నెం.1 ర్యాంకింగ్‌లో కొనసాగుతున్న ఇంగ్లండ్ స్పిన్నర్ లిన్సీ స్మిత్ కంటే చరానీ ఇప్పుడు కేవలం ఐదు రేటింగ్ పాయింట్లు మాత్రమే వెనుకబడి ఉంది. బౌలింగ్ చార్టులలో దీప్తి మరో కీలక క్రీడాకారిణిగా నిలిచింది. ఆమె ఐదు స్థానాలు ఎగబాకి 5వ స్థానానికి చేరుకోవడంతో, ప్రపంచంలోని అగ్రశ్రేణి టీ20ఐ బౌలర్ల జాబితాలో భారత్ స్థానం మరింత బలపడింది. మరోవైపు, ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదర్శన తర్వాత స్కాట్లాండ్ కెప్టెన్ కాథరిన్ బ్రైస్ 7 స్థానాలు పైకి ఎగబాకి, ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంతో టాప్ 10లోకి తిరిగి ప్రవేశించింది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో, ఆస్ట్రేలియాకు చెందిన జార్జియా వోల్ నెం.1 టీ20ఐ బ్యాటర్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంది.






### ఇంగ్లండ్ టూర్‌కు టీమిండియాలో..

# నలుగురిపై వేటు

## కోహ్లీ, హార్దిక్ రీఎంట్రీ?

**న్యూఢిల్లీ:** అఫ్ఘనిస్తాన్‌తో సిరీస్ ముగిసిన వెంటనే టీమ్ ఇండియా ఇంగ్లాండ్ గడ్డపై మరో సవాల్‌కు సిద్ధమవుతోంది. మిషన్ 2027 వన్డే ప్రపంచకప్ వేటను అధికారికంగా ప్రారంభించేందుకు బీసీసీఐ సరికొత్త వ్యూహాలతో 16 మంది సభ్యుల పటిష్టమైన జట్టును సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం అఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ ఈ నెల 20తో ముగియనుంది. ఆ వెంటనే జులైలో టీమిండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. జులై 14 నుండి 19 వరకూ వన్డే జరగనుంది. అఫ్ఘనిస్తాన్‌తో పోలిస్తే ఇంగ్లాండ్ స్వదేశంలో అత్యంత ప్రమాదకరమైన జట్టు కాబట్టి, ఈ సిరీస్‌ను భారత సెలెక్టర్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ప్రస్తుత సిరీస్‌లో విశ్రాంతితో పాటు, గాయాల కారణంగా దూరమైన కీలక ఆటగాళ్లు తిరిగి ఇంగ్లాండ్ సిరీస్‌తో జట్టులోకి రానున్నారు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న రన్ మెషీన్ విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టులోకి రావడం ఖాయమైంది. వీరితో పాటు, ప్రపంచ అత్యుత్తమ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా తిరిగి బౌలింగ్ విభాగాన్ని నడిపించనున్నాడు. మరోవైపు, స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, గాయం నుంచి కోలుకుని దేశవాళీలో అదరగొడుతున్న యువ పేసర్ హర్షిత్ రాణా కూడా జట్టులోకి రానున్నారు. అలాగే, లిస్ట్ఎ క్రికెట్‌లో 50 ఇన్నింగ్స్‌ల తర్వాత అత్యధిక సగటు కలిగిన రికార్డు సృష్టించిన రుతురాజ్ గైక్వాడ్ పట్ల కూడా సెలెక్టర్లు మొగ్గు చూపుతున్నారు. కాగా భారత సీనియర్ ఆటగాళ్లు జట్టులోకి వస్తుండటంతో, ప్రస్తుతం ఆఫ్ఘన్ సిరీస్‌లో ఆడుతున్న నలుగురు ఆటగాళ్లకు ఇంగ్లాండ్ టూర్‌లో చోటు దక్కడం కష్టంగా మారింది. విరాట్ కోహ్లీ స్థానంలో వచ్చిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఈసారి జట్టులో చోటు దక్కకపోవచ్చు. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా రాకతో యువ పేసర్లు ప్రిన్స్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణలపై వేటు పడనుంది. అలాగే, అక్షర్ పటేల్ జట్టులోకి వస్తుండటంతో హర్ష్ దూబే కూడా తన స్థానాన్ని కోల్పోవలసి వస్తుంది. దీంతో ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌కు భారత్ జట్టు అంచనా (16 మంది సభ్యులు)లో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్‌రెడ్డి, అక్షర్‌పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, గుర్నూర్ బ్రార్ ఉన్నారు.

# తొలి టి20లో ఆస్ట్రేలియా విక్టరీ

## బంగ్లాదేశ్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** టీ20లో బంగ్లాదేశ్‌పై ఆస్ట్రేలియా విజయం సాధించింది. స్లో బౌలర్లు ఆడమ్ జంపా, జోయెల్ డేవిస్ చెరో మూడు వికెట్లు పడగొట్టడంతో, బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. గత 60 ఏళ్లలో ఆస్ట్రేలియాకు ఆడిన తొలి భారత సంతతి పురుష క్రికెటర్ అయిన లెగ్ స్పిన్నర్ నిఖిల్ చౌదరి కూడా ఒక వికెట్ పడగొట్టగా, బంగ్లాదేశ్ 19 ఓవర్లలో 131 పరుగులకే ఆలౌట్ అయింది. గత వన్డేలో ఆస్ట్రేలియా ఒక వికెట్ తేడాతో గెలిచి, బంగ్లాదేశ్‌పై మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయకుండా కాపాడటంలో 149 పరుగులు చేసిన కూపర్ కానలీ, నాలుగు




ఫోర్లు, మూడు సిక్సర్లతో 47 పరుగులు చేసి తన జట్టును 18.2 ఓవర్లలో 133-6 స్కోరుకు చేర్చాడు. మిచెల్ మార్ష్, ఆ తర్వాతి ఓపెనర్ జోష్ ఇంగ్లిస్‌లను ఆస్ట్రేలియా వెంటవెంటనే కోల్పోయినప్పటికీ అతను సంయమనం కోల్పోలేదు. టిమ్ డేవిడ్ (20)తో కలిసి మూడవ వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన తర్వాత, కానలీని క్యాచ్ పట్టించి అబ్దుల్ గఫార్ తన అరంగేట్రంలోనే వికెట్ పడగొట్టాడు. ఈ లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ 2-32 గణాంకాలతో ముగించాడు. గాయం తో లిట్టన్ దాస్ జట్టు నుండి తప్పుకోవడంతో, బంగ్లాదేశ్ జట్టుకు తౌహిద్ హృదయ్ నాయకత్వం వహించాడు. హృదయ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు, కానీ క్రమశిక్షణతో కూడిన ఆస్ట్రేలియా స్పిన్ బౌలింగ్ దాడిని బంగ్లాదేశ్ బ్యాటర్లు ఎవరూ ప్రతిఘటించలేకపోయారు. ఐదవ ఓవర్‌లో బంగ్లాదేశ్ 39-1తో ఉండగా, ఆ తర్వాత జంపా, డేవిస్‌ల బౌలింగ్‌తో పతనావస్థ మొదలవడంతో ఆతిథ్య జట్టు 60 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది.

# లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

## సెన్సెక్స్ 347, నిఫ్టీ 96 పాయింట్ల లాభం



**ముంబై, జూన్ 17:** వరుసగా మూడో రోజు కూడా దేశీయ సూచీలు లాభాలతోనే ముగిశాయి. పశ్చిమాసియాలో తిరిగి శాంతి నెలకొనడం, హోర్ముజ్ నుంచి చమురు సరఫరా సజావుగా సాగడానికి మార్గం సుగమం కావడం అంతర్జాతీయ మార్కెట్లలో జోష్ నింపింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి (94.53) బలపడడం దేశీయ సూచీలకు సానుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడో రోజు కూడా బుధవారం లాభాలతో ముగిశాయి. మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినప్పటికీ మార్కెట్లు సానుకూల ధోరణి కనబరిచాయి.

సెన్సెక్స్ 347 పాయింట్లు పెరిగి 77,155 వద్ద ముగిసింది. నిఫ్టీ 96 పాయింట్లు లాభపడి 24,085 వద్ద స్థిరపడింది. కీలక షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో నిఫ్టీ మరోసారి 24 వేల మార్క్‌ను అధిగమించింది. ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు అత్యధిక లాభాలు నమోదు చేశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.52 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ 0.79 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆ తర్వాత కన్జ్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ సూచీలు నిలిచాయి. ఆటో, రియాల్టీ రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌ఓఎంసీ) సమావేశ ఫలితాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, భవిష్యత్ వడ్డీ రేట్లపై ఫెడ్ చేసే వ్యాఖ్యలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 94.50 స్థాయి వద్ద స్థిరంగా కదిలింది. డాలర్ సూచీ, ముడి చమురు ధరలు పరిమిత శ్రేణిలోనే కదలడంతో కరెన్సీ మార్కెట్లు కూడా వేచి చూసే ధోరణిలోనే కొనసాగాయి. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం, హోర్ముజ్ జలసంధి పూర్తిగా తెరుచుకోనుండటం, చమురు ధరలు తగ్గడం మార్కెట్‌లో సానుకూల ఫలితాలకు కారణమైంది.




# అమెరికా- ఇరాన్ డీల్

## దిగొచ్చిన చమురు ధరలు

### 80 డాలర్ల దిగువకు చేరిన బ్రెంట్ క్రూడ్ ధర

**ముంబై, జూన్ 17:** ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బుధవారం దిగివచ్చాయి. అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గుచూపారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్ల దిగువకు చేరింది. బ్యారెల్ ధర 0.72 శాతం తగ్గి 78.39 డాలర్లకు చేరింది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) చమురు ధర దాదాపు 1 శాతం పడిపోయి 75.35 డాలర్లుగా నమోదైంది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే దిశగా అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదరడంతో చమురు ధరలు దిగొచ్చాయి. మరోవైపు ఒప్పందంపై సంతకం అనంతరం ఇరాన్‌కు చమురు విక్రయాలపై అవకాశం కల్పిస్తామని అమెరికా అధికారులు వెల్లడించారు. ఈ వారం కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం ఏప్రిల్‌లో ప్రకటించిన కాల్పుల విరమణను మరో 60 రోజుల పాటు పొడిగించారు. ఈ సమయంలో శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చలు జరగనున్నాయి. ఒప్పందంలో భాగంగా ఇరాన్ పోర్టులపై అమెరికా విధించిన ఆంక్షలను ఎత్తివేయనున్నట్లు సమాచారం. ప్రతిగా హర్మూజ్ జలసంధి మీదుగా చమురు ట్యాంకర్లు, ఇతర నౌకల రాకపోకలకు ఇరాన్ అనుమతి ఇవ్వనుంది. చమురు ధరలు తగ్గడం భారత కరెన్సీకి కూడా మేలు చేసింది. బుధవారం రూపాయి విలువ 31 పైసలు పెరిగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 94.29 వద్ద ట్రేడవుతోంది. గత సెషన్‌లో ఇది 94.56 వద్ద స్థిరపడింది. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐలు) నిధుల ఉపసంహారణ కూడా క్రమంగా తగ్గుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గడం, ఎఫ్‌సిఎన్ఆర్(బి) డిపాజిట్ల రూపంలో భారత్‌కు భారీగా విదేశీ నిధులు వచ్చే అవకాశాలు ఉండటంతో రూపాయి మరింత బలపడవచ్చని వారు అంచనా వేస్తున్నారు.

### అవసరం లేని పాలసీలు..

# లోన్లు అంటగట్టొద్దు!

## బ్యాంకుల మిస్ సెల్లింగ్‌పై ఆర్‌బిఐ కఠిన నిబంధనలు

### డిజిటల్ వేదికల్లో మభ్యపెట్టే పద్ధతులపై నిషేధం

### 2027 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు




**ముంబై, జూన్ 17:** బ్యాంకుకు ఓ పనిమీద వెళ్తే మరో ప్రొడక్ట్‌ను అంటగట్టడం, లోన్ తీసుకోవాలంటే బీమా పాలసీ తప్పనిసరి అని చెప్పడం, మొబైల్ యాప్ తెరిస్తే వరుసగా లోన్ ఆఫర్లు చూపించడం వంటి పద్ధతులకు త్వరలో చెక్ పడనుంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆర్‌బీఐ కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. బ్యాంకులు అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటి వరకు బ్యాంకింగ్ రంగంలో తరచూ వినిపించిన ఫిర్యాదుల్లో 'మిస్ సెల్లింగ్' ఒకటి. అంటే వినియోగదారుడికి అవసరంలేని ఫైనాన్షియల్ ప్రొడక్ట్‌ను అమ్మడం. సరైన సమాచారం ఇవ్వకుండా ఒప్పించడం. అనుమతి లేకుండానే పాలసీలు లేదా ఇతర సేవలు జత చేయడం వంటి చర్యలు ఇందులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారాలకు తొలిసారి స్పష్టమైన నిర్వచనం ఇచ్చిన ఆర్‌బీఐ వాటిపై కఠిన వైఖరి అవలంబించింది. కొత్త నిబంధనల ప్రకారం రుణం మంజూరు చేయాలంటే తప్పనిసరిగా బీమా పాలసీ కొనాలని బ్యాంకులు షరతు విధించకూడదు. గృహ రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకునే సమయంలో బీమా అవసరమైతే వినియోగదారుడు తనకు నచ్చిన సంస్థ నుంచి పాలసీ తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. బ్యాంకు సూచించిన సంస్థ నుంచే కొనాలంటూ ఒత్తిడి చేయడం నిషేధం. వినియోగదారుడి సమ్మతికి కూడా కొత్త నిర్వచనం తీసుకొచ్చింది ఆర్‌బిఐ. రుణం తీసుకున్న వ్యక్తికి అదే ఆధారంగా బీమా, పెట్టుబడి పథకాలు లేదా ఇతర ఆఫర్లను పంపడం కుదరదు. ప్రతి ఉత్పత్తికి విడిగా స్పష్టమైన అనుమతి తీసుకోవాల్సిందే. డిజిటల్ వేదికల్లో బ్యాంకులు అనుసరిస్తున్న పలు పద్ధతులపైకూడా ఆర్‌బిఐ దృష్టిపెట్టింది. కస్టమర్లను మభ్యపెట్టేలా కౌంట్‌డౌన్ టైమర్లు చూపించడం, ముందుగానే టిక్ చేసిన ఆప్షన్స్ ఉంచడం, తిరస్కరించే బటన్‌ను గందరగోళంగా చూపించడం, మూసివేయాలనుకుంటే లోన్ పేజీకి తీసుకెళ్లే పాప్‌అప్‌లు చూపించడం వంటి పద్ధతులను నిషేధించింది. లోన్ దరఖాస్తు సమయంలో వినియోగదారుడికి తెలియకుండా బీమా పాలసీని జత చేయడం, చివరి దశలో అదనపు ఛార్జీలను చూపించడం, అత్యవసర హెచ్చరికలా కనిపించే ప్రకటనలు పంపించడం వంటి చర్యలు కూడా ఇక అనుమతించబోవడం లేదు. బ్యాంకుల తరఫున పనిచేసే డైరెక్ట్ సేలింగ్ ఏజెంట్లు, మార్కెటింగ్ ప్రతినిధులపైనా కొత్త నియంత్రణలు అమల్లోకి రానున్నాయి.

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే వినియోగదారులను సంప్రదించాలి. అనుమతి లేకుండా ఇంటికి లేదా కార్యాలయానికి వెళ్లకూడదు. తమను బ్యాంకు ఉద్యోగులుగా పరిచయంచేసుకోవడం కూడా నిషేధం. ఈ మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి వినియోగదారుడికి తప్పుడు ప్రొడక్ట్‌ను విక్రయించినట్లు తేలితే బ్యాంకు వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. వినియోగదారుడు ఎదుర్కొన్న నష్టానికి పరిహారం కూడా ఇవ్వాల్సి రావచ్చు అని ఆర్‌బిఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు తేల్చిచెబుతున్నాయి.

**వాణిజ్యం**




# జాబితాలో లేని సెక్యూరిటీల ట్రేడింగ్‌కు దూరంగా ఉండండి

## అనధికారిక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లపై పెట్టుబడిదారులకు సెబి హెచ్చరికలు

**ముంబై, జూన్ 17:** సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) బుధవారం, అనధికారిక ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్‌ల ద్వారా జాబితాలో లేని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల సెక్యూరిటీలలో లావాదేవీలు జరపవద్దని పెట్టుబడిదారులకు మరోసారి హెచ్చరిక జారీ చేసింది. అటువంటి సంస్థలు తమ నియంత్రణ పరిధిలో పనిచేయవని పేర్కొంది. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల జాబితాలో లేని సెక్యూరిటీలలో లావాదేవీలను సులభతరం చేసే అనేక ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లు పుట్టుకొస్తున్నాయని, ఇవి పెట్టుబడిదారులను గణనీయమైన ఆర్థిక, కార్యాచరణపరమైన నష్టాలకు గురిచేస్తున్నాయని మార్కెట్ల నియంత్రణ సంస్థ తెలిపింది. సెబీ డిసెంబర్ 2024, ఆగస్టు 2016లో జారీ చేసిన సలహాలను ప్రస్తావిస్తూ, పెట్టుబడిదారులు అటువంటి ప్లాట్‌ఫారమ్‌లపై లావాదేవీలు జరపడం లేదా సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం మానుకోవాలని పునరుద్ఘాటించింది. పేపర్ ట్రేడింగ్ సేవలను అందించే అనధికారిక వర్చువల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, ఫాంటసీ గేమింగ్‌తో ముడిపడి ఉన్న పెట్టుబడి ఉత్పత్తులు, జాబితాలో లేని రుణ సెక్యూరిటీలలో లావాదేవీలు జరిపే ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల గురించి తాను గతంలో జారీ చేసిన హెచ్చరికలను కూడా ఈ నియంత్రణ సంస్థ గుర్తుచేసింది. "ఇలాంటి ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్‌లపై ఎలాంటి లావాదేవీలు లేదా ట్రేడింగ్ నిర్వహించడం, లేదా వాటిపై ఏవైనా సున్నితమైన వ్యక్తిగత వివరాలను పంచుకోవడంలో ఉన్న నష్టాల గురించి పెట్టుబడిదారులను మరోసారి హెచ్చరిస్తున్నాము" అని నియంత్రణ సంస్థ తెలిపింది.

## విఆర్ఆర్ వేలం ద్వారా రూ.72,300 కోట్ల నగదును వ్యవస్థలోకి ప్రవేశపెట్టిన ఆర్‌బిఐ

**ముంబై, జూన్ 17:** అడ్వాన్స్ పన్ను చెల్లింపుల కారణంగా బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు (లిక్విడిటీ) తగ్గడంతో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం రెండు 'వేరియబుల్ రేట్ రెపో' (విఆర్ఆర్) వేలంపాటల ద్వారా రూ.72,300 కోట్ల తాత్కాలిక నగదును వ్యవస్థలోకి ప్రవేశపెట్టింది. కేంద్ర బ్యాంక్ 5.26 శాతం కట్‌ఆఫ్ రేటుతో రెండు రోజుల విఆర్ఆర్ వేలం ద్వారా రూ.50,016 కోట్లను వ్యవస్థలోకి విడుదల చేసింది. అలాగే, మరో రెండు రోజుల విఆర్ఆర్ వేలం ద్వారా అదనంగా రూ. 22,284 కోట్లను కూడా ప్రవేశపెట్టింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతలో తలెత్తే అసమతుల్యతలను నిర్వహించడానికి ఆర్‌బిఐ ఈ వేరియబుల్ రేట్ రెపో వేలంపాటలను ఉపయోగిస్తుంది. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం, జూన్ 16 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు సుమారు రూ.23,881.21 కోట్లుగా అంచనా వేయబడింది. ఇది జూన్ 15 నాటి సుమారు రూ.1.51 లక్షల కోట్ల మిగులుతో పోలిస్తే తక్కువ. అడ్వాన్స్ పన్ను చెల్లింపుల కారణంగా నగదు బయటకు వెళ్లడమే ఈ మిగులు తగ్గడానికి కారణమని నిపుణులు పేర్కొన్నారు.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



## తాళ్లరేవులో ఘనంగా మంత్రి సుభాష్ పుట్టినరోజు వేడుకలు.

**ఎస్ ఏ ఎఫ్ చే పలు సేవా కార్యక్రమాలు.**

**పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల, గుత్తుల సాయి.**

**తాళ్ళరేవు, జూన్ 17 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్. ఏ. ఎఫ్.) వ్యవస్థాపకులు వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఏ.ఎఫ్. తాళ్లరేవు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ బ్రహ్మర్షన్ లో భాగంగా పేదలకు భోజన క్యారేజీలు అందించారు. రిలయన్స్ ధీరుభాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రంలో చిన్నారులచే కేక్ కట్ చేయించారు. విద్యార్థులకు కేకు, చాక్లెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం దేవి మహల్ వద్ద మందారపు సత్యనారాయణ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెదేపా అధ్యక్షులు గుత్తుల సాయి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఎస్ ఏ ఎఫ్ ద్వారా పలువురికి చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి బాబి, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్తిబాబు, దంగేటి అన్వేష్, జక్కల ప్రసాద్ బాబు, జనసేన పార్టీ నాయకులు అత్తిలి బాబురావు, సూరంపూడి కుమార్, రాయుడు గోవిందు, ఎస్ ఏ ఎఫ్ నాయకులు శివాజీ, కుడిపూడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం గురువారం 18 జూన్ 2026 I


# చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబాన్ని పరామర్శించిన హోంమంత్రి అనిత



**తుని, జూన్ 17,( ప్రభాతవార్త )** తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం పరామర్శించారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబుతో కలిసి హోం మంత్రి అనిత చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన చిన్నారి అదృష్టమైనప్పుడు నుండి పోలీసులు చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం పోలీసు సిబ్బందిని,ఎస్డిఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, అటవీ శాఖ సిబ్బంది శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారన్నారు.అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రోన్ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాలతో చిన్నారి ఆచూకీ కోసం గస్తి నిర్వహిస్తున్నరన్నారు. చిన్నారితో అదృశ్యమైన పెంపుడు కుక్క తిరిగి వచ్చిన తర్వాత మృతి చెందడంతో పోస్టుమార్టం నిర్వహించి ఆధారాలు కోసం శాంపిల్స్ ఫారెన్సిక్ ల్యాబ్ కు పంపించడం జరిగిందన్నారు. పోలీసులు అన్ని కోణాల్లోని దర్యాప్తు చేపడుతున్నారన్నారు. జిల్లా ఎస్పీ కి ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ తిలక్, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై కృష్ణమాచారి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



## కొప్పల్లి గ్రామంలో ప్రకృతి ప్రకోపం...

## పిడుగు పాటుకు 57 మేకలు మృతి



**వి.ఆర్.పురం,జూన్ 17, ప్రభాతవార్త** పోలవరం జిల్లా, వి.ఆర్.పురం మండలం, రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కొప్పల్లి గ్రామంలో ప్రకృతి ప్రకోపానికి పిడుగు పాటుకు గురై 57 మేకలు మృత్యువాత పడ్డాయి. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కొప్పల్లి, శబరిరాయిగూడెం శివారు ప్రాంతం శబరినది తీరంలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని, భారీ ఎత్తున గాలి, ఉరుములతో వర్షం కురిసింది. పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములతో కూడిన వర్షం పడుతుండటంతో, అప్పటి వరకు ఆ పరిసరాలలో మేత మేస్తున్న మేకలన్ని శబరినది ఒడ్డున ఉన్న పూరి పాకలోకి చేరాయి.దీంతో పిడుగుపాటుకు పూరిపాకలో, పూరిపాక చుట్టు చేరిన 57 మేకలు ప్రాణాలు విడిచాయి.

**పిడుగుపాటులో తప్పిన మానవ ప్రాణాల ముప్పు..........**

కొప్పల్లి వద్ద పిడుగుపాటులో మానవ ప్రాణాల ముప్పుతప్పింది. పెద్ద ఎత్తున గాలి, ఉరుములతో వర్షం కురుస్తుండటంతో, మేకలన్ని శబరినది ఒడ్డుపై ఉన్న పూరి పాకలోకి చేరాయి. వాతావరణం భయంకరంగా మారి ఉరుముతుండటంతో, అప్పటి వరకు అదే పూరిపాకలో ఉన్న పలువురు మేకల యజమానులు పిడుగు పడొచ్చనే అనుమానంతో,పాకలోనుండి బయటకు పరుగులు తీశారు. వారు పాకలోనుండి 100 మీటర్లు పరుగు తీసేలోగానే, వారు ఊహించినట్లే పూరిపాక ప్రక్కనే పిడుగుపడింది. 100 అడుగుల మేర పూరిపాక నుండి బయటకు పరుగెత్తిన మేకల యజమానులు వెనక్కితిరిగి చూడగానే మేకలన్ని విగతజీవిగా నేలపై పడిపోయాయి. తాము ఉన్న పూరి పాకపైనే పిడుగు పడబోతున్నట్లు తాము గ్రహించకపోయిఉంటే, మేకలతోపాటు తాము సైతం మృత్యువాత పడిఉండే వారమని బాధిత రైతులు చెమర్చిన కళ్ళతో, భావోద్వేగంతో చెప్పారు. ఈ ప్రమాదంలో కొప్పల్లి గ్రామానికి చెందిన కారం మరయ్య, సీతారామయ్య, సీతయ్య, ఉయిక లక్ష్మయ్య, సరియం లక్ష్మయ్య, ఆసు చిన్నమ్మి అనే ఆరుగురు గిరిజనులకు చెందిన మొత్తం 57 మేకలు మరణించాయి.

### కలెక్టర్ దినేష్ కుమార్ ఆద్వర్యంలో

## ప్రకృతి అందాల నడుమ యోగాంధ్ర డే



**మోతుగూడెం జూన్ :17 ప్రభాతవార్త** అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు పోలవరం జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం కరకట్టపై ఘనంగా యోగాంధ్ర డే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగ శ్లోకంతో కార్యక్రమం ప్రారంభించారు ప్రతి ఒక్కరికి యోగ సర్వే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ఆధ్వర్యంలో ఓఎస్డి పంకజ్ కుమార్ మీనా పర్యవేక్షణలో సుమారు 1000 మందితో యోగాంధ్ర కార్యక్రమం లో పాల్గొన్నారు. చింతూరు డివిజన్ లో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, ఏపీ జెన్కో ఇంజనీర్లు ఉద్యోగస్తులు గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొని యోగాసనాలు వేసారు. ఈ సందర్భంగా ఎంఎల్ ఏ మిరియాల శిరీషదేవి పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం మనం వెంటపెట్టిన జీవితం యోగా అని మనిషి దైనందిన జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొంత సమయాన్ని వెచ్చించ లేకపోవడం మన దురదృష్టకరమన్నారు! ఇప్పటి నుంచి అయినా ప్రతి ఒక్కరూ ఒక 30 నిమిషాల పాటు ప్రతిరోజు ఉదయం యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు.జెసిస ఆధ్వర్యంలో ఆరోగ్యానికి సంబంధించి అటవీ ఉత్పత్తుల జొన్నల స్టాల్ అందర్నీ ఆకర్షించాయి.చివరగా జాతీయగీతంతో కార్యక్రమానికి ముగింపు పలికిన అధికారులుతోపాటు అధికారులు ఏపి జెన్ కో ఎస్ఇ ఇంజనీర్ వెంకటరాజారావు (ఓఅండ్ యం),ఎస్.ఇ. బాలకృష్ణ డిఈటి వర్షప్రసాద్ పంచాయితీ కార్యదర్శి గుంపెనపల్లి మోహన్ అటవీశాఖ రెవెన్యూ వైద్యాఆరోగ్య పోలిస్ పంచాయితి విద్యుత్ తదితర శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక కేంద్రంగా.... పిల్లంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం. ఉమర్ ఆలీషా.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం.



**తాళ్లరేవు, జూన్ 17( ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోదావరి నదీ తీరాన ఉన్న పిల్లంక గ్రామంలో పునరఃనిర్మించిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుతుందని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం తొమ్మిదవ పీఠాధిపతి ఉమర్ అలీషా అన్నారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమైన సందర్భంగా ఆయన పిల్లంక విచ్చేసి భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ నెల 22 వరకు సాగే ఈ మహోత్సవాల సందర్భంగా ఆలయ నిర్మాణ కర్త వేటూరి వెంకట కామేశ్వర శర్మ(రాజబాబు) ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో విగ్రహాలు, శిఖరాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వేలూరి సుబ్రహ్మణ్యం, వై.సోమయాజులు దంపతులు, సాగి శ్రీహర్ష రాజు దంపతులు, దాట్ల వెంకట మోహన్ శశాంక్ వర్మ లతో పాటు పలువురు దాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సాయంత్రం ఉమర్ అలీషా మాట్లాడుతూ మనిషి శరీరంతో పాటు మనసును శుభ్రం చేసుకున్నప్పుడే భగవత్సాక్షాత్కారం సాధ్యమవుతుందని అన్నారు. గోదావరి నది తీరంలో నిర్మించిన ఈ ఆలయం రాబోయే రోజుల్లో భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుందని అన్నారు.

## మంత్రి సుభాష్ పుట్టినరోజు సందర్భంగా మండలంలో పలు సేవా కార్యక్రమాలు



**కె. గంగవరం, జూన్ 17,( ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు సందర్భంగా కె గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన అభిమానులు,టిడిపి, బిజెపి,జనసేన నాయకులు, కార్యకర్తలు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రమైన గంగవరం గ్రామంలో ఉన్నటువంటి భవిత కేంద్రం( ప్రత్యేక అవసరాలు గల పిల్లల వసతుల కేంద్రం)లో, మండల ప్రజా పరిషత్ ప్రైమరీ స్కూల్ లో గల విద్యార్థిని విద్యార్థులకు పేటాజ్యూల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కొలివెల్ల సుబ్బారావు,సత్తిబాబు రాంప్రసాద్ లు పుస్తకములు, కలములు, పెన్సిళ్లు, స్కేల్లు, చాక్లెట్లు,కేకులు, బిస్కెట్లు అందజేశారు. అలాగే కోటిపల్లి గ్రామానికి చెందిన కో క్లస్టర్ ఇంచార్జ్ గొవర్ణ రామకృష్ణ చౌదరి,వెంటూరు వీర రాఘవ చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు, అనంతరం మొక్కలు నాటారు. అలాగే మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రమకుమార్, మండల బిజెపి అధ్యక్షులు కొప్పిశెట్టి చంద్రరావు, మండల జనసేన అధ్యక్షుడు చిర్రా రాజ్ కుమార్,పప్పుల మనేసు వెంకన్న (పేప శ్రీను), మల్లిపూడి బుజ్జి, తోట వెంకన్న, నీటి సంఘం అధ్యక్షులు తాడాల బోసరాజు,టిడి నిడదవోలు సుబ్రమణ్యం,పరం వసంత్, సొసైటీ ప్రెసిడెంట్ లు గాలి మకర జ్యోతి వెంకటేష్, గెడ్డం పల్లయ్యారావు (జన్నీ), సాధిరెడ్డి దొరబాబు, పెంకె గోవిందరావు, నేమాని సత్యనారాయణ, రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తాడాల బుజ్జి, అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ ఇంచార్జ్ కర్రి చిట్టిబాబు, నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ సలాది శేఖర్, మేడిశెట్టి బాబి, ఊడిమూడి జనసేన గ్రామ అధ్యక్షులు యర్రంశెట్టి రాంబాబు, గన్ని శ్రీను, సిర్రా సురేష్, శీరెడ్డి సత్తిబాబు, అవసరాల వెంకటరమణమూర్తి, దేవరపల్లి చక్రి, చిక్కాల రాము ,సోమేశ్, మేడిశెట్టి పుల్లయ్యార్ర,దవ్వా భూషణం, చిట్టాల రామ్మోహన్ రావు, గంగరాజు,వి.సత్తిబాబు, వాసంశెట్టి కృష్ణ ఆధా గ్రామాల కూటమి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు మంత్రి సుభాష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, ఆలయాల్లో పూజలు చేయించి మిఠాయిలు చాక్లెట్లు పంచిపెట్టారు.

### వార్త కథనానికి స్పందన

## యుద్ధ ప్రాతిపదికపై శానిటేషన్ పనులు చేయించిన డిఎల్‌పిఓ



**రంపచోడవరం జూన్ 17 ప్రభాతవార్త.** పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం ఊరంతా చెత్తకుప్పల తో నిండిపోయిందనే వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి డి ఎల్ పి ఓ రాధాకృష్ణ స్పందించారు. పంచాయతీ పరిధిలోని అన్ని వీధులలో శానిటేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికపై చేయించారు. వీధులలో పేరుకుపోయిన చెత్తకుప్పలను దగ్గర ఉండి శుభ్రం చేయించారు. ఇకపై ప్రతిరోజు పంచాయతీ పరిధిలో సానిటేషన్ పనులు చేస్తామన్నారు. ఎక్కడ మురుగునీరు నిల్వ లేకుండా చూస్తామన్నారు. జిల్లా పరిపాలన కేంద్రం రంపచోడవరం ప్రతిరోజు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీకి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. తాను కూడా ప్రతిరోజు పంచాయతీ పరిధిలో పరిశుభ్రత డ్రైనేజీలు తాగునీరు సరఫరాపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తామని డిఎల్పిఓ చెప్పారు. గ్రామం పరిశుభ్రం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిరోజు చెత్తాచెదారాన్ని శుభ్రం చేయాల్సిన అవసరం ఉందని ఆ మేరకు పంచాయతీ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. వార్త కథనానికి వెంటనే స్పందించి శానిటేషన్ పనులు చేయించిన డిఎల్పిఓ కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు

## ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, జూన్ 17 ప్రభాతవార్త** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించి ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ ఇంటింటి సర్వే ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ?ప్రతి బిఎల్ఓ కు అవసరమైన పత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు ప్రతి బిఎల్ఓ తమకు కేటాయించిన భౌగోళిక పరిధి ప్రకారమే ఖచ్చితంగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. ఏ ఒక్క ఇల్లు లేదా అర్హుడైన ఓటరు వివరాలు విడి పోకుండా జాగ్రత్త వహించాలన్నారు సర్వే సమయంలో మరణించిన వారి వివరాలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కొత్తగా పెళ్లై వచ్చిన వారి వివరాలు, ఇళ్లు మారిన వారి ఓట్ల బదిలీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసేలా బిఎల్ఓలు చొరవ చూపాలన్నారు. ఓటర్ల జాబితాలో అస్పష్టంగా ఉన్న ఫోటోలను, తప్పుగా ముద్రితమైన వివరాలను సరిచేసే ప్రక్రియను ఈ సర్వేలోనే పూర్తి చేయాలన్నారు.?సర్వే ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని సిబ్బంది పనితీరును, ఎన్యూమరేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలాంటి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.?ఈ సమీక్షా సమవేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు సెక్షన్ సూపరింటెండెంట్ నాగలక్ష్మ మ్మ, వివిధ నియోజకవర్గాల ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓలు మరియు ఎన్నికల విభాగపు సిబ్బంది పాల్గొన్నారు

### వార్త కథనంపై మున్సిపల్ అధికారుల స్పందన

## కాలువను పూర్తిగా శుభ్రం చేయించాం : కమిషనర్



**రామచంద్రపురం, జూన్ 17 ( ప్రభాత వార్త):** వార్త పత్రికలో మంగళవారం 'పనుల పేరిట నరకం..ప్రజల ప్రాణాలతో చెలగాటం'అంటూ ప్రచురితమైన కథనంపై మున్సిపల్ కమిషనర్ స్పందించారు.శీలంవారి సావరం ప్రాంతంలోని రామలయం,పితాని వారి వీధుల్లో రూ.15 లక్షలతో చేపట్టిన పైప్‌లైన్ పనులపై ఆయన వివరణ ఇచ్చారు.గత పదేళ్లుగా పాత పైప్‌లైన్ పాడవ్వడంతో తాగునీటి సరఫరా ఇబ్బందులు తొలగించేందుకు ఈ పనులు చేపట్టామని ఆయన తెలిపారు. ఇరుకైన రోడ్డు కావడంతో పనుల సమయంలో కొంత మట్టి కాలువలోకి చేరిన మాట వాస్తవమేనని,అయితే పనులు పూర్తి చేసి కాలువను పూర్తిగా శుభ్రం చేయించామని కమిషనర్ పేర్కొన్నారు .ప్రస్తుతం మురుగునీరు సజావుగా ప్రవహిస్తోందని,ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేదని ఆయన వివరించారు.

# నేడు వాడపల్లి వెంకన్న పరకామణి సేవ

## యోగ సాధనతో దేవస్థానం సిబ్బంది..



**ఆత్రేయపురం, జూన్ 17,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం బుధవారం వేలాది మంది భక్తులతో అలరారింది. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ బాల భోగం నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వెంకన్న ఆలయంలో గురువారం స్వామివారి హుండీలు లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. దేవస్థానం కార్యాలయం నందు యోగఆంధ్ర కార్యక్రమంలో భాగంగా దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతను వివరించి, ఆరోగ్యకర జీవనానికి యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు లు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## పేద కుటుంబ సొంతింటి కల నిజం చేసిన మంత్రి సుభాష్

### పుట్టినరోజున నిరుపేద కుటుంబానికి సొంతింటి కానుక

### స్వయంగా గృహప్రవేశం చేయించిన మంత్రి

### ఇచ్చిన మాట నిలబెట్టుకుని రూ.5 లక్షల సొంత నిధులతో గృహ నిర్మాణం



**కాజులూరు, జూన్ 17(ప్రభాత వార్త)** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తూ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం గొల్లపాలెం ధనలక్ష్మిపేటకు చెందిన నిరుపేద మహిళ సుందరపల్లి జ్యోతికి గృహాన్ని నిర్మించి, తన పుట్టినరోజు సందర్భంగా ఆ ఇంటికి స్వయంగా వెళ్లి గృహప్రవేశం చేయించారు. అత్యంత పేదరికంలో ఇద్దరు ఆడపిల్లలతో నివసిస్తున్న జ్యోతి కుటుంబం ఎన్నో ఏళ్లుగా సరైన నివాసం లేక పూరి గుడిసెలోనే జీవనం సాగిస్తోంది. గతంలో గొల్లపాలెం పర్యటనకు వెళ్లిన మంత్రి సుభాష్ ఆ కుటుంబం ఎదుర్కొంటున్న దయనీయ పరిస్థితిని, పాడుబడిన గుడిసెను చూసి చలించిపోయారు. ఆ సమయంలో వారికి శాశ్వత నివాసం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సుమారు రూ.5 లక్షల సొంత నిధులను వెచ్చించి గృహాన్ని నిర్మించి, తన పుట్టినరోజు రోజునే ఆ కుటుంబానికి అందజేయడం విశేషంగా నిలిచింది. అనంతరం మంత్రి స్వయంగా గృహప్రవేశం నిర్వహించి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జ్యోతి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. తమకు నిలువ నీడ కల్పించి కొత్త జీవితాన్ని ప్రసాదించిన మంత్రి సుభాష్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. మంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడం పట్ల స్థానిక ప్రజలు, నియోజకవర్గ వాసులు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా పేద కుటుంబానికి కొత్త ఇల్లు కల నెరవేర్చడం కోసం ప్రత్యేక కృషి చేసిన జనసేన నాయకుడు దేగల సతీష్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, దేగల సతీష్, టీడీపీ నాయకులు చంద్రు వీర్రాజు చౌదరి, చిక్కాల దొరబాబు, అంగర కృష్ణ, పితాని సతీష్, కోకా హరి గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



### మహిళల ఆర్థిక స్వలంబన ఉపాధి అవకాశాలు

## పెంపునకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17( ప్రభాతవార్త)**
మహిళల ఆర్థిక స్వాలంబన ఉపాధి అవకాశాల పెంపు గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం రాజమహేంద్రవరం లోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం వేదికలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా సభ నిర్వహించారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలు స్వయం సహాయక సంఘాలకు 255.08 కోట్లు రుణాలు మంజూరు అయినట్లు వివరించారు. డి ఆర్ డి ఏ ద్వారా మహిళ పారిశ్రామికవేత్తలకు బ్యాంకు అనుసంధానంతో 270 మంది లబ్ధిదారులకు 3.95 కోట్లు విలువైన రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోగతికి తోడ్పాటుగా బ్యాంక్ లింకేజ్ స్త్రీ నిధి పథకాల కింద 2534 స్వయం సహాయక చెందిన 16386 మంది సభ్యులకు 252 ముంచేసినట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ నగేష్ ఇతర ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు మహిళా సంఘాల సభ్యులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తును తక్షణం పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్.



**చింతూరు ,జూన్ 17 ప్రభాత వార్త.**పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలపై వచ్చే ప్రతి దరఖాస్తులో వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం చింతూరు ఐటిడిఏలోని సమావేశ మందిరం లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్, నిర్వహించారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ వారం గ్రీవెన్స్ కు 99 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలోని వివిధ రకాలైన సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమస్యలకు సంభందిం చిన దరఖాస్తులు పరిష్కరించే బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని ఆయన అన్నారు. యాటపాక మండలం గుండాల కాలనీలోని సర్వే నెంబర్ 153/1 గల 1.67 భూమి సమస్య పరిష్కరించాలని పేరాల వెంకటేశ్వరరావు దరఖాస్తు సమర్పించారు. చింతూరు మండలం గూడూరు పరిధిలో తూలుగొండ గ్రామంలో మా బాల బాలికలకు మా గ్రామంలో నీ పాఠశాలలో విద్యను కొనసాగించే విధంగా అనుమతి మంజూరు చేయాలని డి. ముత్తయ్య, వి. రాధ, ఎ .వెంకయ్య దరఖాస్తు సమర్పించారు. చింతూరు మండలం చదలవాడ, గుమ్మళ్లకోట, చేలూరు, మిట్టవాడ గ్రామాలకు బీటి రోడ్డు ఏర్పాటు చేసే విధంగా ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేయాలని రాములమ్మ, జానకమ్మ, అర్జమ, చెల్లమ్మ,లక్ష్మమ్మ దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ రామ తులసి,డిఎం అండ్ హెచ్ఓ పి.సరిత,సిపిఓ వెంకట్రావు,డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్.దాసరి రత్నాకరరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం,పీహెచ్ఓ నరేంద్ర కుమార్, విద్యాశాఖ అధికారి వై.మల్లేశ్వరరావు ,జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్,ఐసిడిఎస్ జిల్లా అధికారి కే.ఉమా,జిల్లా సివిల్ సప్లై అధికారి విజయభాస్కర్,జిల్లా మలేరియా అధికారి భాస్కర రావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి,జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి నిరుపమ,డిడిఓ వెంకటనారాయణ , డాక్టర్ దివ్య తా,తాసిల్దార్లు, ఎంపీడీవోలు ,డిప్యూటీ తహసిల్దార్లు, ఎల్డిఎం గొర్లె.బుజ్జిబాబు,ఐటీడీఏ ఏవో రాజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సిఈ రాజారావును కలసిన ఉమా విజయచంద్!



**మోతుగూడెం జూన్:17 ప్రభాతవార్త** మోతుగూడెంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేయుచున్న ఉమా విజయ్ చంద్ ఏపి జెన్కొ ట్రాన్కొ డిస్కమ్ లకు ఏపిఎస్ఈబి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైనారు. మోతుగుడెం విచ్చేసినా సందర్భముగా ఆయనకు శాఖ అధ్యక్షులు పి.శ్రీనివాస్ కార్యదర్శి ఎం.ఉపేందర్ మరియు ఇతర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. చీఫ్ ఇంజనీర్ రాజారావు ను ఎస్ ఈ భీమవరపు బాలకృష్ణను మరియు చినకామేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసారు.సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేసారు.

## వర్షాల కోసం కప్పలకు కళ్యాణం వాడపాలెంలో పూర్వపు సాంప్రదాయానికి పునర్జీవం




**కొత్తపేట, జూన్ 17,(ప్రభాతవార్త)** ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుండడంతో వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మండల పరిధిలోని వాడపాలెం గ్రామంలో సాంప్రదాయబద్ధంగా బుధవారం కళ్యాణ నిర్వహించారు గ్రామ పురోహితుడు డాక్టర్ పెద్దింటి రామం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది పూర్వకాలం నుంచి వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రకృతి అనుగ్రహం కోసం కప్పలకు వివాహం చేయడం ఆచారంగా వస్తున్నది ఆచార సాంప్రదాయాన్ని సజీవం చేస్తూ గ్రామ పెద్దలు యువకులు ఈ కార్యక్రమం నిర్వహించారు వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో కప్పలకు పసుపు కుంకుమ అద్ది పసుపు తాడు కట్టి సాంప్రదాయ బద్ధంగా వివాహం నిర్వహించారు వివాహ కర్త డాక్టర్ రామం మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణతో పాటు సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు

## మడ అడవులు సందర్శించిన ట్రైనీ ఐ.ఏ.ఎస్.లు.



**తాళ్లరేవు, జూన్ 17 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా కోరంగి అభయారణ్యంలోని మడ అడవులను 2025 బ్యాచ్ ట్రైనీ ఐ.ఏ.ఎస్.లు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ ఎస్-ఎస్ఆర్ వరప్రసాద్ చొల్లంగి సిబిఈటి కేంద్రం ప్రత్యేకతలు, మడ అడవుల విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా కాకినాడ సీ మౌత్ (సముద్రపు మొగ) వరకు బోటు షికారు చేశారు. తాళ్లరేవు రెవెన్యూ ఇనస్పెక్టర్ రామకృష్ణ, ఎఫ్ బి ఓ లు కె.మహేష్, సి. హెచ్.ధనలక్ష్మి, బయాలజిస్ట్ డి.మహేష్ బాబు పాల్గొన్నారు.

## పోరుబాయి జలాశయం లొ బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలి !



**మోతుగూడెం ప్రభాతవార్త జూన్ :17** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి పెద్దపిటా వేసి అభివృద్ధి రంగం వైపు పరుగులు పెట్టిస్తున్నారు అందులో భాగంగా సీలేరులొ షీప్లైయిన్ విహారాని సన్నహాలు ప్రారంభమైన విషయం తెలిచిందే! ప్రకృతి ఒడిలొ ఎన్నెన్నో అందాలతొ జిల్లాల విభజనతో కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లా శిఖలో పర్యటకరంగాభివృద్ధికి మారేడుమిల్లి మోతుగూడెం పరిసరాల ఓఅందాలు మణిహారం లా కొలువై ఉన్నాయి .అందులొ మారేడుమిల్లి బొంగుచికెన్ తో పర్యటకులను ఊరిస్తూ ఇప్పటికే ఎంతో గుర్తింపు తొ ప్రాచుర్యంపోందింది. టూరిస్టులు క్యూ కడుతున్నారు.గత నాలుగు సంవత్సరాలు గా మోతుగూడెం పరిసరాలు పుష్పా అఖండా కస్టడీ ఇరుముడి తదితర బారి చిత్రాలతోపాటు సిరియల్లు వేలకొలది ఫ్రీవెడ్ షుట్లు ఇక్కడ షుటింగ్లు జరుపుకున్నాయి.అటవిశాఖ విభగానికి ఆదాయవనరులను సమకూర్చుతున్నయి. చిత్రపరిశ్రమకు ఇక్కడ అందాలతొ ఉన్న వాటర్ఫాల్స్ తదితర లోకేషన్లు ఓ వరంగా మారాయి.దీనికి తొడుగా ఏపి జెన్ కొ ఆధ్వర్యంలో మోతుగూడెం పంచాయతి పరిదిలొ ఉన్నా పోరుబాయి జలాశయం ఒకటి!! అద్బుతమైన లొకేషన్ వర్ణించటానికి మాటలు చాలవేమో! చుట్టు ఎత్తైన పచ్చని కొండలు సుమారు రెండు (టి.యం.సి ల నీరు)చలనత్వంతో నిటి నిల్వల సామర్థ్యం తో స్దిరంగా ప్రవహించే పచ్చని జలాశయం ఇకా! సాయం సంధ్యవేళలో భానుడు సంధ్యాస్తమయం బంగారు వర్ణణలొ కనువిందుచేసే దృశ్యం పర్యటకుల మనసును దోసేవిధంగా ఉండే ఈ ప్రకృతి పరవశమైన అందాలలొ బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తే పడవ విహరం లో లాహిరి లాహిరి లాహిరిలొ అంటు పర్యటకులకు ఆనందానుభూతి కల్గించనట్లు ఉంటుంది కధ! పర్యటకులు కూడా ఈ ప్రాంతానికి పోటేత్తుతారు కధ! గిరిజన యువతకు ఉపాదితొ పాటు పరిసరాలు వ్యాపారాభివృద్ధితో పాటు ప్రభుతానికి ఆదాయా వనరులు సమకూరె అవకాశాలు మెండుగా ఉన్నాయి.పోరుబాయి జలాశయం పరిసరాల ప్రకృతి అందాలను పర్యాటకులకు మరెంతా ప్రాచుర్యం చెయటం వలన టూరిజంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందేవిధంగా భవిష్యత్తు ఉంటుంది. అలా ఉండే విధంగా చెస్తామని అందులో భాగంగానే యోగంద్ర దేను కుడా ఇక్కడ నిర్వహిస్తు పర్యాటకులకు మెస్సెజ్ పంపేలా చేస్తున్నమన్నమని జిల్లా కలెక్టరు కే.దినేష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా విచ్చేసిన ఎంయల్ఏ మిరియాల శిరిషాదేవి కి బోటింగ్ ఏర్పాటు పై వివరించగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబువారి దృష్టిలొ పెట్టి పర్యటకంగా ఎలా అభివృద్ధి చెయాలో జిల్లా అధికారులతో చర్చించి టూరిజం హబ్ లొ భాగాంగా బోటింగ్ కి అనుకూలమైన చర్యలు చేపడతానని ప్రభాతవార్త విలేఖరుకు తెలిపారు.

## ఆయిల్ ఫామ్ సాగు పై రైతులకుఅవగాహన సదస్సు



**రాజవొమ్మంగి, జూన్ 17, ప్రభాతవార్త** జడ్డంగి గ్రామంలోని పామ్ ఆయిల్ పై రైతులకు అవగాహన సదస్సును పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పతంజలి సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ. ఎస్.. ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారన్నారు, రైతులు సుస్థిరమైన అభివృద్ధి సాధించటంలో తమ వంతు పాత్రను పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సమర్థవంతంగా పోషిస్తుందన్నారు.విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటలు వేసే రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే పూర్తి సబ్సిడిపై మొక్కలు సరఫరా, ఎరువులు, అంతర పంటల సబ్సిడి తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఫిల్డ్ ఆఫీసర్ ఆర్.బాపిరాజు,క్లస్టర్ ఇంచార్జ్ ఎస్. సతీష్, ఫీల్డ్ సూపర్ వైజర్స్ పి..కొండలరావు, బి. వి. వి .కుమార్, వి.రాజా, మైక్రో ఇరిగేషన్ సిబ్బంది, కె.రవీంద్ర, జి.సతీష్ పతంజలి సంస్థ సిబ్బంది, భారీగా రైతులు పాల్గొన్నారు.

## పెద్దాపురం పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం



**గోపాలపురం జూన్ 17, (ప్రభాతవార్త):** గోపాలపురం మండలం, పెద్దాపురం ప్రాథమిక పాఠశాలలో ఫిలిప్స్ మోర్ ఆఫ్ ఇండియా కంపెనీ అనే ఎన్జీఓ సంస్థతో కలిసి, గ్రామ పెద్దలు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ పాఠశాలలో రూ.75 వేలతో నిర్మించిన వాటర్ ట్యాంక్, వాష్ బేసిన్లను బుధవారం సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం, పిన్నమనేని దత్తాత్రేయుడు ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలు పంపిని చేశారు. హెచ్ఎం కాకి పోసియ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కాసాని విజయ, శనపల రాజశేఖర్, సిఆర్పీ కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎల్ క్రికెట్ ట్రోఫీ విజేత ఎస్ఆర్ లెవెన్ జట్టు..

### -ముగిసిన ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు..




**అంబాజీపేట,జూన్ 17, (ప్రభాతవార్త):** అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల1 నుండి అంబాజీపేట క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన అంబాజీపేట ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ టోర్నీ విజేతగా ఎస్ఆర్ లెవెన్ జట్టు నిలిచింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో అంబాజీపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ బుధవారం జరిగాయి.తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్ లెవెన్ జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 128 పరుగులు చేసింది.అనంతరం బ్యాటింగ్కు దిగిన డ్రాగన్స్ లెవెన్ 57 పరుగులు చేసి అలౌట్ అయ్యింది. విన్నర్స్ గా నిలిచిన ఎస్ఆర్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.60 వేలు నగదు,రన్నర్స్ గా నిలిచిన డ్రాగాన్స్ లెవెన్ కు ట్రోఫీతో పాటు రూ.40 వేలు నగదును అందజేశారు. అలాగే సెమీఫైనల్స్లో ఓడిన జట్లు రూ.10వేలు, ట్రోఫీలను అందజేశారు.బెస్ట్ బ్యాట్స్మెన్ కుప్పాల గణేష్, బెస్ట్ బౌలర్ గా ఎస్.సాయి, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ చినబాబులు ఎంపికయ్యారు. వీరికి మెమెంటోతో పాటు నగదును అందజేశారు. ఫైనల్ మ్యాచ్కు అంపైర్లుగా మేడిది మాధవసాయి,యర్రంశెట్టి సుబ్రహ్మణ్యంలు వ్యవహరించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో పలువురు మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు- ఓటమిలను సమానంగా స్వీకరించి, ఇతర క్రీడాకారులకు ఆదర్శంగా నిలవాలన్నారు. గత రెండు వారాలుగా క్రికెట్ టోర్నమెంట్ను ఎంతో చాకచక్యంగా నిర్వహించిన నిర్వాహకులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ,నాయకులు కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, రవణం రాము, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి సత్యమోహన్,నాగాబత్తుల సుబ్బారావు, కామిశెట్టి మధుబాబు,సుంకర నాయుడు, తోట రవి,వీరా సతీష్, సూదాబత్తుల రమేష్,అరిగెల శివ కళ్యాణ్, రంకిరెడ్డి శివ,నామన అంజి, కంచుస్తంభం సతీష్, వలవల బాబి,కుప్పాల ఫణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులు సత్వరమే రద్దు చేయాలి



**పెద్దాపురం, జూన్ 17 (ప్రభాత వార్త )**మత స్వేచ్ఛకు భంగం కలిగించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు సత్వరమే రద్దు చేయాలని పెద్దాపురం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకులు రేవరెండ్ మధు కిరణ్, అధ్యక్షులు రెవరెండ్ రాజేష్ నోబెల్ మాట్లాడుతూ మత స్వేచ్ఛ కు భంగం కలిగించే 1950 జి ఓ రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తాహిసిల్దార్ పి.శ్రీనువాస్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు రెవ వి ప్రభాకర్, సెక్రటరీ అభిషేక్ ఫెలోషిప్ కమిటీ మరియు ఐ.సి.యఫ్ నేషనల్ ప్రెసిడెంట్ జార్జి శ్రీమంతులు, నియోజకవర్గ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ. విల్సన్, క్లాప్స్ ప్రెసిడెంట్ రెవ పురుషోత్తం దాస్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 30 లోపు 'జలధార' పనులు పూర్తి కావాలి ఎంపీడీవో ఏ.వి. వి. కుమార్



**అడ్డతీగల, జూన్ 17, ప్రభాతవార్త** అడ్డతీగలమండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగా మంజూరైన 101 జలధార పనులను వెంటనే ప్రారంభించి, జూన్ 30వ తేదీ లోపు ఖచ్చితంగా పూర్తి చేయాలని అడ్డతీగల మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.వి.వి.కుమార్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన ఒక ముఖ్య సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, జలధార పనులన్నింటినీ ఎక్కడా రాజీ పడకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాల ప్రకారం వేగంగా పూర్తి చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. జూలై 1వ తేదీ నుండి వికసిత భారత గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ - గ్రామీణ కార్యక్రమం ప్రారంభం కానుందని, ఈ విషయాన్ని గ్రామాల్లోని కూలీలందరికీ విస్తృతంగా తెలియజేయాలని పేర్కొన్నారు.ఈ అత్యవసర సమీక్షా సమావేశంలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్. టెక్నికల్ అసిస్టెంట్లు. కంప్యూటర్ ఆపరేటర్లు. మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు. తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్దే ధ్యేయం



**పెద్దాపురం జూన్ 17(ప్రభాత వార్త )**నియోజకవర్గం సమగ్రాభివృద్దే ధ్యేయం గా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పెద్దాపురం ఓల్డ్ ఏజ్ హోం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చినరాజప్ప బుధవారం పరిశీలించారు. నియోజకవర్గం అభివృద్ధిలో దాతల సహకారం తీసుకుంటామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగ్ నాగ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, రంది సత్యనారాయణ, అడబాల కుమారస్వామి,పోతుల శ్రీనివాస్, నూనె రామారావు చౌదరి,బదుగు శ్రీకాంత్, మెయిళ్ళ కృష్ణమూర్తి, ముసిరెడ్డి శ్రీరాములు, శ్రీ లలితా ఇండస్ట్రీస్ ఎండీలు మట్టే శ్రీనివాస్, మట్టే ప్రసాద్,కంటే జగదీష్ మోహన్,రేలంగి వెంకట్రావు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే జైలే .

**తాళ్లరేవు, జూన్ 17 (ప్రభాతవార్త):** మద్యం సేవించి వాహనం నడిపితే కట కటాల పాలు తప్పదని కోరంగి ఎస్సై పి. సత్యనారాయణ హెచ్చరించారు. కాకినాడ జిల్లా కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి,13 మందిని కోర్టులో హాజరు పరచగా కాకినాడ ఫస్ట్ స్పెషల్ జుడీషయల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున 9 మందికి రూ. 90 వేలు జరిమానా విధించారు. 4గురుకి 2 రోజులు చొప్పున జైలు శిక్ష విధించారని ఎస్.ఐ. తెలిపారు. ఇదిలా ఉండగా కోరంగ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా విస్తృతంగా కోరింగ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు.

## పిడుగుపాటుకు గేదె మృతి



**రాజవొమ్మంగి, జూన్ 17, ప్రభాత వార్త** గడుఓకుర్తి పంచాయితీ చీడిపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. అసమయంలో పొలం వద్ద పిడుగు పడటంతో గ్రామానికి చెందిన వై. జోగిరాజు అనే గిరిజన రైతుకు చెందిన పాడి గేదె మృతి చెందిందని స్థానికులు తెలిపారు. రూ. 30 వేలు విలువైన పాడి గేదె చనిపోవడంతో జీవనాదారం కోల్పోవడం జరిగిందని రైతు జోగిరాజు కన్నీటి పర్యంతమైనాడు. ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ సవిరాల చంద్రుడు కోరుతున్నారు.

## ఉత్తమ విద్యార్థినులకు సత్కారం



**కొత్తపేట,జూన్17,(ప్రభాతవార్త)** కొత్తపేట మండలం అవిడి చప్పిడి వారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు బుధవారం సత్కరించి అభినందించినారు 574 సాధించిన చెముడు ప్రవల్లిక త్రిబుల్ ఐటీ సీటు సాధించినందుకు అభినందించారు కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ధూళి సూరిబాబు సొసైటీ అధ్యక్షులు సూరవరపు రామకృష్ణ నీటి సంఘం అధ్యక్షులు రెడ్డి తాతాజీ మాజీ సర్పంచులు రెడ్డి చంటి రెడ్డి రామకృష్ణ ఎంఈఓ ఎం హరి ప్రసాద్ విద్యా కమిటీ అధ్యక్షుడు రమణ స్కూల్ హెచ్ ఎం అరుణశ్రీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# అభివృద్ధికి ఆమడ దూరం...

### -అసంపూర్తి భవనాలతో ర్యాలి ఎస్సీపేట. ..



**ఆత్రేయపురం, జూన్ 17,(ప్రభాత వార్త)** కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ర్యాలి ఎస్సీ పేట అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని విమర్శలు వెల్లువె త్తుతున్నాయి.కొత్తపేట నియోజకవర్గంలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు దశబ్దాలు క్రితమే ర్యాలి ఎస్సీ పేటలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసిన నేటికీ అద్దె ఇంట్లోనే అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో ఉండడం పాలకుల నిర్లక్ష్యనికి నిలువుటద్దంగా కనిపిస్తుంది. అద్దె భవనంలో త్రాగు నీరు సక్రమంగా అందక బాల బాలికలు ఇబ్బంది పడుతున్నారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్రేయపురం మండలం,ర్యాలి గ్రామంలో 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించినప్పటికీ, అవి పూర్తికాక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించే అంగన్వాడీ కేంద్రం నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. నిర్మాణంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గత ప్రభుత్వంలో 2019-24 లో ర్యాలి ఎస్సీ పేటలో ఎంతో ప్రతిష్మాత్మకంగా గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే అవి కూడా కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యం సకాలంలో అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో నిర్మాణాలు పూర్తికాక మధ్యలో అసంపూర్తి నిర్మాణాలుగా మిగిలిపోయాయి. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విదంగా భవనాలు అందుబాటులోకి తీసుకు రాకపోవడం పట్ల గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దాహార్తిని తీర్చేందుకుతాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎస్సీ పేట ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టినా, అది కూడా అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో వేసవి కాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి నెలకొంది. ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో సతమతమవుతున్న ఎస్సీ పేట ప్రజలకు గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ పనులకు చేసిన శంకుస్థాపన రాయి అధికారుల నిర్లక్ష్యనికి నిలువెత్తు సాక్ష్యంగా కనిపిస్తుంది.పనులు ప్రారంభం కాకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది.అధికారుల నిర్లక్ష్యమా.. ప్రజాప్రతినిధుల చిన్నచూపా? ప్రభుత్వాలు మారుతున్నా, పరిస్థితులు మారడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపమా, లేక గ్రామంపై చిన్నచూపా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్సీ పేటకు కనీస మౌలిక సదుపాయాలు కూడా పూర్తిస్థాయిలో అందకపోవడం విచారకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.పూర్తి చేయండి - ప్రజలకు అందుబాటులోకి తీసుకురండిఅసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రం, గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్, వాటర్ ట్యాంక్ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్సీ పేట ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శంకుస్థాపనలతో సరిపెట్టకుండా ప్రారంభించిన పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఈదురు గాలులతో చెట్టు కొమ్మలు విరిగి ప్రయాణికులు ఇక్కట్లు....





**ఆత్రేయపురం, జూన్ 17,(ప్రభాత వార్త)** రావులపాలెం , బొబ్బర్లంక ఆర్ ఴ బి రోడ్డులో ఈదురు గాలులతో చెట్లు కొమ్మలు విరిగిపడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం వీచిన గాలులతో పేరవరం, వెలిచేరు గ్రామాల మధ్య పలుచోట్ల చెట్లు కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాకాలం సిజాన్ కి ముందే ఆర్ అండ్ బి రోడ్డు వెంబడి ఉన్న చెట్లు కొమ్మలను నరికి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవలసిన ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోకుండా వదిలేయడం వలెనే ఈ పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు . ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు రావులపాలెం నుండి బొబ్బర్లంక వరకు ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపుల వున్న చెట్లు కొమ్మలు నరికి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఘనంగా మోడల్ పాఠశాలలో అక్షరాభ్యాసం...



**సఖినేటిపల్లి జూన్ 17, ప్రభాత వార్త :** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం యెనుముల వారి మెరక మోడల్ స్కూల్ నందు మండల విద్యాశాఖ అధికారి యం. వేంకటేశ్వరరావు చేతుల మీదుగా 11 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసము నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో అనేక సదుపాయాలు, పథకాలు ఇస్తున్నాయని మీ గ్రామ ప్రభుత్వ పాఠశాలలలో జాయిన్ చేసేటట్లు మీరు ఇతర తల్లిదండ్రులకు తెలిపి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజనీ కుమారి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## యానాం డంపింగ్ యార్డ్ ఆంధ్రా లో నెలకొల్పొద్దని రాస్తారోకో...

### -మోహరించిన యానం పోలీసులు. నెలకొన్న ఉద్రిక్తత.



**తాళ్లరేవు, జూన్ 17( ప్రభాతవార్త):** పుదుచ్చేరి రాష్ట్ర పరిధిలో ఉన్న యానం - ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులో బుధవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. యానం- తాళ్ళరేవు మండలం పోలేకురు పంచాయతీ తూర్పు పేట(ఆంధ్రా) సరిహద్దు జాతీయ రహదారిని ఆనుకొని యానం అధికారులు మురుగు నీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయటానికి గత మూడు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలోనే దీనిని స్థానిక గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసి మట్టి పనులను అడ్డుకున్నారు. దీనికి వివిధ ప్రజా సంఘాలు, పార్టీలు మద్దతుగా నిలిచాయి. బుధవారం యానం అధికారులు పెద్దఎత్తున పోలీస్ బందోబస్తుతో వచ్చి మట్టి పూడ్చే పనులు తిరిగి ప్రారంభించారు. విషయం తెలుసుకున్న స్థానిక గ్రామస్తులు, అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో తమ పరిధిలోని భూమిలో జరుగుతున్న పనులు అడ్డుకోవడానికి వీలులేదని యానం పోలీసులు చెప్పడంతో ఆంధ్ర పరిధిలోని భూమిలో నిరసన తెలియజేశారు. తిరిగి ఆంధ్ర ప్రాంతం గుండా వెళుతున్న యానాం పోలీసు అధికారుల వాహనాలను అడ్డుకొని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యానం పోలీసులకు గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సరిహద్దు ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాంట్ ఎలా నిర్మిస్తారని దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు ఆందోళనకారులు తెలిపారు. ఇవేమీ పట్టించుకోకుండా యానం పోలీసులు వ్యవహరించడంతో ఆందోళన మరింత ఉధృతం చేశారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ నిలిచిపోయింది.ఇరు ప్రాంతాల అధికారులతో సమావేశమై విషయాన్ని చర్చించుకోవాలని ఒక అభిప్రాయానికి రావడంతో ఆందోళన విరమించారు. అనంతరం కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్ఐ పి సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో మరో సారి చర్చలు జరిపారు. సరిహద్దుతో సంబంధం లేకుండా జాతీయ రహదారికి ఆనుకుని మురుగునీటి శుద్ధి కర్మాగారం నిర్మించడానికి వీలులేదని శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జక్కల ప్రసాద్ బాబు, శెట్టిబలిజ సాధికార సంస్థ డైరెక్టర్ పిల్లి సత్తిబాబు, సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు వడ్లమూరి సతీష్ స్పష్టం చేశారు. యానం అధికారులు, పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. ప్రజలను తుపాకులు లాఠీలతో బెదిరించి పనులు చేయాలని చూస్తున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా మండల రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ ప్లాంట్ నిర్మాణం అడ్డుకుంటామని తెలిపారు. జిల్లా అధికారులకు విషయాన్ని తెలియజేసి పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించడంతో అధికారులతో మాట్లాడడానికి ఈ నెలాఖరు వరకు సమయం ఇవ్వాలని కోరారు. అప్పటివరకు యానం అధికారులు ఈ ప్రాంతంలో ఎటువంటి పనులు చేపట్ట రాదని నాయకులు అన్నారు. దీనిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు పోరాటాన్ని రూపొందిస్తామని నాయకులు తెలిపారు. అవసరమైతే వివిధ కుల, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకత్వాన్ని కూడా సంప్రదించి పోరాడుతామన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధూర్ స్పందించి కర్మగారని నిర్మించకుండా చూడాలని కోరారు.

## రూ.3 కోట్లతో డ్రైన్ల ఆధునికీకరణ

### - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


### రావులపాలెంలో లొల్ల హై లెవెల్ ఛానల్ లో పూడికతీతకు శ్రీకారం



**రావులపాలెం, జూన్ 17, రావులపాలెం :** కొత్తపేట నియోజకవర్గంలో నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, చెరువుల ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం సీఆర్సీ రోడ్డులో రూ.7 లక్షల వ్యయంతో చేపట్టిన లొల్ల హైవే ఛానల్ పూడికతీత పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఈతకోట గ్రామంలో సహస్ర ప్రాపర్టీస్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న చెరువు ఆధునికీకరణ, సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.3 కోట్ల వ్యయంతో డ్రైన్ల ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. వ్యవసాయం, నీటి పారుదల రంగాల అభివృద్ధితో పాటు గ్రామీణ మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా చివరి ఎకరా వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈతకోట చెరువు పరిసరాలను అభివృద్ధి చేసి పార్కును సుందరీకరించడం ద్వారా గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించనున్నట్లు తెలిపారు. జల వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## రామచంద్రపురంలో వైసీపీ కాపు నేతల లంచ్ మీటింగ్

### -హాట్ టాపిక్‌గా మారిన తోట త్రిమూర్తులు భేటీ



**రామచంద్రపురం,జూన్ 17 ( ప్రభాత వార్త):** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.ఈ నెల 21న నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి కాపు సామాజికవర్గ ముఖ్య నేతల సమావేశం కలకలం రేపుతోంది.వెంకటాయపాలెంలోని వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నివాసంలో లంచ్ మీటింగ్ ఏర్పాటు కావడం విశేషం.?పార్టీలోని కాపు నేతలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వయంగా ఫోన్లు చేసి విందుకు ఆహ్వానిస్తున్నారు.పైకి దీనిని కేవలం 'గెట్ టుగెదర్' (ఆత్మీయ కలయిక) సమావేశంగానే చెబుతున్నప్పటికీ. 'సమావేశం అన్నాక అన్ని విషయాలూ చర్చకు వస్తాయి కదా'అంటూ ఆయన వ్యాఖ్యానించడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.?ప్రస్తుత రాజకీయ పరిణామాలు,అంతర్గత సమీకరణాల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ భేటీ.. పార్టీలో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న ఉత్కంఠ రేపుతోంది.

## వెలుగు ఏ. పి. యంకు పదోన్నతి



**రాజవొమ్మంగి, జూన్ 17, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య ఏ. పి. యం గా ఈ నెల 5 తేదీన విధుల్లోకి చేరిన దుర్గాప్రసాద్ కు పదోన్నతి పొందారు. విధుల్లోకి చేరిన నాలుగు రోజులకే డి. పి. యం గా పదోన్నతి ఆదేశాలు వచ్చాయి. 17 తేదీన విజయవాడ సెర్ప్ ఆఫీస్ కు వెళ్లారు. ఏప్రాంతంలో డి. పి. ఎంగా అని ఆదేశాలు రావాల్సి ఉంది. రాజవొమ్మంగి మండల ఏ. పి. యంగా ఎవరు వస్తారనే వివరాలు తెలియాల్సి ఉంది.

మరిన్ని వార్తలు 6లో

# నిరక్ష్యరాసుల జాబితాను తరితగతిన సిద్ధం చేయాలి..ఎంపీడీవో మమత..



**అంబాజీపేట, జూన్ 17, (ప్రభాతవార్త):** మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్ష్యరాసుల జాబితాను సిద్ధం చేసి త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించాలని, దీని పట్ల అలసత్వం వహించవద్దని ఎంపీడీఓ బి.మమత సూచించారు అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అక్షర ఆంధ్ర కార్యక్రమంలో బాగంగా డ్వాక్రా వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ వై.చిన్ని అధ్యక్షతన అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మమత మాట్లాడుతూ నిరక్ష్యరాసుల జాబితాను ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ చేయించడంలో వీఓఏలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సత్వరమే పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. త్వరలో నిరక్ష్య రాసుల వారికి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా రిజిస్ట్రేషన్ల కార్యక్రమం వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అబ్బాస్ అలీ, ఉపాధి హామీ పథకం ఏపీఓ అడపా శ్రీ వెంకట కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

## -జగన్మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి : మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం ,జూన్ 17 (ప్రభాతవార్త)**కడియం మండలం కడియపులంకలో పచ్చని నర్సరీల నడుమ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దివ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ పవిత్ర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మంగళహారతులతో ఆహ్వానించగా, ప్రజాప్రతినిధులు భక్తులకు అభివాదం చేశారు. మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల కోసం పలు రకాల పిండివంటలతో భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ జరిగిన ఈ కార్యక్రమం కడియపులంక ప్రాంతంలో విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసి డైరెక్టర్ మార్గం సత్యనారాయణ, ఆది ఎంపీపీ మార్గాన్ని లక్ష్మి వెలుగుబంటి నాని,గట్టి సుబ్బారావు, పాఠం శెట్టి రాంజీ, గట్టి నరసయ్య, బోడపాటి గోపి,ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:



**జగ్గంపేట జూన్ 17 (ప్రభాతవార్త)**భూపతిపాలెం డా. డి.ఎస్. రాజు ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు దండు రవికిరణ్, జి. ఎస్. డి. ఎస్. జి. వి. అప్పారావు, సింహాద్రి అభిషేక్, జాగు జ్యోతి సందీప్, ఎలమంచిలి చందు రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయంలో సీట్లు సాధించారు. వారిని జగ్గంపేట రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు జి. అశోక్ కుమార్, స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు ఈ విజయం పాఠశాలకు గర్వకారణంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రభుత్వ గురుకుల పాఠశాల నుండి ఒకేసారి ఐదుగురు విశ్వవిద్యాలయానికి ఎంపిక కావడం చెప్పుకో దగ్గ విషయమని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ విద్యార్థులను అభినందించి ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారుకార్యక్రమంలో పాఠశాల నిర్వహణ సంఘం చైర్మన్ గల్లా రాము, వైస్ చైర్మన్ అందె రాజీవ్ పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారుఈ విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం కీలకమని ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్ తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాల పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, బివి సుబ్బారావు, వి ప్రేమ్ నాథ్, ఎస్ శ్రీను బాబు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వంతెన నిర్మాణ పనులు పరిశీలించిన రాజ్యసభ బోస్కె.



**గంగవరం, జూన్ 17,(ప్రభాతవార్త):** కె గంగవరం మండలం దంగేరు శివారు కూనిమిల్లిపాడు,కుందూరు గ్రామాల మధ్య టేకి డ్రైన్ పై వంతెన నిర్మాణ పనులను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడదని,పనులు సక్రమంగా నిర్వహించాలని బోస్ సూచించారు. సుమారు 7 కోట్లతో రాజ్యసభ నిధుల నుంచి వంతెన నిర్మించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించిన రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ను ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, దంగేరు వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలు నాయకులు,గ్రామ పెద్దలు,బోస్, సూర్యప్రకాష్ అభిమానులు ఎంపీ బోసును పూలదండలతో,దుస్సాలవాలతో సత్కరించారు.

# గాలివానకు వృక్షాలు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం

## -కడియం, వీరవరం ప్రాంతాల్లో ఘటనలు - అధికారులు, స్థానికుల అప్రమత్తతతో ట్రాఫిక్ పునరుద్ధరణ




**రాజమహేంద్రవరం, జూన్ 17: (ప్రభాతవార్త)** ఇటీవల కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో కడియం మండలంలోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలిపోతుండటంతో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.కడియం దేవి చౌక్ పంచాయతీ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం ఈదురుగాలులకు ఓ భారీ వృక్షం కూలిపోవడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదే విధంగా వీరవరం గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రం సమీపంలో మరో భారీ వృక్షం నేలకొరిగింది. అదృష్టవశాత్తు ఈ రెండు ఘటనల్లో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు.సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, అధికారులు సంఘటనా స్థలాలకు చేరుకుని రహదారులపై పడిన చెట్లను తొలగించారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేసి వాహనాల రాకపోకలను సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ప్రమాదం మరింత పెరగకుండా వేగంగా స్పందించిన అధికారుల చర్యలను స్థానికులు అభినందించారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా పాత చెట్లు, బలహీనమైన కొమ్మలు, కరెంటు స్తంభాలు కూలిపోయే ప్రమాదం అధికంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. కొన్నిసార్లు విద్యుత్ తీగలు తెగి రహదారులపై లేదా నీటిలో పడే అవకాశం కూడా ఉండటంతో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.ముఖ్యంగా చెట్ల కింద నిలబడడం, వాహనాలను పార్కింగ్ చేయడం, వర్షం సమయంలో నిర్లక్ష్యంగా ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ తీగలు లేదా విద్యుత్ లీకేజీ ఉన్నాయేమో ముందుగా గమనించి మాత్రమే ప్రయాణించాలని సూచిస్తున్నారు. ఎక్కడైనా తెగిపోయిన కరెంటు వైర్లు కనిపిస్తే వాటికి దగ్గరగా వెళ్లకుండా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, వర్షంలో ప్రయాణించే సమయంలో రహదారుల వెంట ఉన్న భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనదారులు వేగాన్ని నియంత్రించుకోవడంతో పాటు గాలివాన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు."వర్షం ఆనందాన్ని ఇస్తుంది... కానీ నిర్లక్ష్యం ప్రమాదాలకు దారి తీస్తుంది" అని స్థానికులు హెచ్చరిస్తూ, వర్షాకాలంలో భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరుతున్నారు. విద్యుత్ ప్రమాదాలు, చెట్లు కూలిపోవడం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

# జలధార పనులు సకాలంలో పూర్తి చేయాలి.. ఎంపిడిఓ



**రాజవొమ్మంగి, జూన్ 17, ప్రభాతవార్త** జలధార పనులను సకాలంలోపూర్తి చేయాలని ఉపాధిహామీ టి. ఏ లు, ఫీల్డ్ అసిస్టెంట్స్ కు రాజవొమ్మంగి ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల ప్రగతిపై సమావేశం జరిగింది. జీడి మామిడి, పంటలు సాగు చేసే రైతులు వివరాలను నమోదు చేయాలన్నారు. ఏప్రిల్ నెల నుండి ఇప్పటి వరకూ జాబ్ కార్డు ఉండి పనికి రాని వారు వివరాల నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో టి. ఏ లు తులసి తేజస్వని, లోవకుమారి, అర్జున్, రాజు, పార్వతి, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

# ఓమ్మంగి లో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంపై అవగాహన సదస్సు



**ప్రత్తిపాడు, జూన్ 17( ప్రభాత వార్త)** మండల పరిధిలోని ఓమ్మంగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం 'వంద రోజుల టీబీ క్యాంప్ నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో ఉచిత హ్యాండ్ హెల్డ్ చెస్ట్ ఎక్స్‌రే శిబిరాన్ని ఏర్పాటు చేశారు.?ఈ సందర్భంగా రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ గీతా సుధ మాట్లాడుతూ టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ 100 రోజుల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం జరిగిన శిబిరంలో మొత్తం 73 మంది గ్రామస్తులకు అత్యాధునిక హ్యాండ్ హెల్డ్ పరికరం ద్వారా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో టీబీ లక్షణాలు ఉన్నట్లు అనుమానించిన 15 మందిని గుర్తించి, తదుపరి కఫం పరీక్షల నిమిత్తం ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేసినట్లు ఆమె వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉషశ్రీతో పాటు గ్రామ కూటమి నాయకులు సత్యంశెట్టి సీతబాబు, రామకుర్తి కామేష్, సుంకర సోమరాజు, కొప్పన నాని, వైద్య సిబ్బంది టీబీ సూపర్‌వైజర్ అనిల్, హెల్త్ సూపర్‌వైజర్ కామేశ్వరరావు, జువ్వల శ్రీనివాస్, డి.ఎస్.ఎన్ మూర్తి, ఏఎన్ఎం వీరలక్ష్మి, ఎంఎల్ హెచ్‌పీలు కాసులమ్మ, ప్రియాంక,పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శిబిరానికి అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో



**కాట్రేనికోన, జూన్ 17 (ప్రభాతవార్త):** కాట్రేనికోన మండలంలో దొంతికుర్రు,, పల్లం గ్రామ పంచాయతీలో జరుగుతున్న వీబీజీ రామ్‌జీ పనులను ఎంపీడీవో బి. రాజేశ్వరావు బుధవారం తనిఖీ చేస్తారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించిన ఎంపీడీవో మస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. హాజరు, కూలీల చెల్లింపులు, పని కొలతల్లో అవకతవకలు జరిగితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి కూలీల వేతనం చెల్లింపులో జాప్యం జరుగుతుందని కొంతమంది ఉపాధి కూలీలు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ తక్షణమే చెల్లింపులు జరిగేలా చూడాలని క్రింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు.ఎండ తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాల్లో తప్పనిసరిగా నీడ, తాగునీరు సౌకర్యం కల్పించాలని, ప్రథమ చికిత్సకు సంబంధించిన కిట్లు అందుబాటులో ఉంచాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. వడదెబ్బ బారిన పడకుండా శ్రామికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి బిడ్డా రక్షణ లక్ష్యంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

## -చైర్ పర్సన్ వేటుకూరి రాజు



**అమలాపురం కలెక్టరేట్ జూన్ 17 ప్రభాతవార్త** ప్రతి బిడ్డకూ సురక్షితమైన, ఆరోగ్యకరమైన గౌరవప్రదమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కీలక చర్యలకు శ్రీకారం చుట్టి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం చైర్పర్సన్ వేటు కూరి సూర్యనారాయణ రాజు తెలిపారు.. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు బాలల హక్కుల పరిరక్షణకై పాటు పడుతున్న లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తూనే, వారి సమగ్ర వికాసానికి కమిషన్ కట్టుబడి ఉందన్నారు. ?బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడానికి క్షేత్రస్థాయిలో నిఘా పెంచడం జరిగిందన్నారు. బాలల హక్కుల ఉల్లంఘ నలు, వేధింపులపై తక్షణమే స్పందించేందుకు 1098' చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను మరింత బలో పేతం చేయాలన్నారు. కమిషన్ సభ్యులు నారాయణరాజు ప్రసంగిస్తూ బాలల హక్కుల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వానిదో కమిషన్‌దో మాత్రమే కాదని.సమాజం లోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా మరో సభ్యురాలు డాక్టర్ కొప్పుల నాగ మానస ప్రసంగిస్తూ.బాలల హక్కుల ఉల్లంఘనలు, బాలికల అక్రమ రవాణా ట్రాఫికింగ్ అడ్డుకట్ట, క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు.? బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి పోలీస్, కార్మిక శాఖల సహకారంతో ప్రత్యేక డెకాయ్ ఆపరేషన్లు విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సుబ్బారావు, ఐసిడిఎస్ పిడి నాగమణి జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమం పట్ల వైసిపి కేడర్ అప్రమత్తంగా ఉండాలిమాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్



**రాజమహేంద్రవరం సిటీ జూన్ 17( ప్రభాతవార్త)** ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ( సర్) ప్రారంభమైందని వైసిపి కేడర్ వార్డ్ ఇన్చార్జిలు కార్యకర్తలు బూత్ లెవెల్ ఏజెంట్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాన్ని భరత్ రామ్ కోరారు. బుధవారం పార్టీ నాయకులు వార్డు ఇన్చార్జి లు బూతు లెవెల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ సర్ కార్యక్రమం పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు ఉండేలా చూడడం ముఖ్యంగా వైసిపి పార్టీ సానుభూతిపరుల మద్దతుదారుల ఓట్లు గల్లంతు కాకుండా ఓటర్ల జాబితాలను దగ్గర పెట్టుకుని పార్టీ క్యాడర్ బూత్ లెవెల్ ఏజెంట్లు నిరంతరం పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. టిడిపి ఓట్లు కొల్లగొట్టడానికి అవాంఛిత యాప్ వినియోగిస్తున్నట్లు తెలుస్తుందని తమ పార్టీ ఓట్లు పోకుండా పార్టీ కేడర్ ప్రభుత్వ అధికారులతో మిగతా పార్టీ వాళ్లతో కలిసి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు వాసంశెట్టి గంగాధర్ రావు, మజ్జి అప్పారావు, మూర్తి, నాగేశ్వరరావు, కె రజనీకాంత్ ,టీ దుర్గారావు, సుభాని, గణేష్ రెడ్డి, మార్గాన్ని రాము ,మరి శెట్టి వెంకటేశ్వరరావు, వార్డ్ ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు వేడుకలు



**ముమ్మిడివరం జూన్ 17(ప్రభాతవార్త )** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు వేడుకలు ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం అన్నా క్యాంటీన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పాల్గొని కేక్ ను కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రెడ్డి సుబ్బారావు ఆర్థిక సహకారంతో అన్నా క్యాంటీన్ లో పేదలకు ఉచితశీగా భోజన వితరణ కార్యక్రమం నిర్వహించగా , ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు , కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, కాట్రేనికోన మాజీ జడ్పీటీసీ నాగిడి నాగేశ్వరరావు , జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు , కట్టా సత్తి బాబులు పాల్గొని పేదలకు భోజనాలు వడ్డించారు.ఈ కార్యక్రమంలో యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మృతుడి కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేతయు.



**కొత్తపల్లి, జూన్ 17 (ప్రభాతవార్త)** :మండలం లోని అమీనాబాదు గ్రామానికి చెందిన పిరమళ్ళ అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆ కుటుంబాన్ని గ్రామానికి చెందిన మడదా విగ్నేష్, రాజేశ్వరి దంపతులు బుధవారం పరామర్శించి రూ. 2వేలు విలువ జేసే బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ గ్రామంలో ఎవరైనా మృతి చెందినా, అనారోగ్యంతో ఉన్నా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారిని పరామర్శించి రూ.2 వేలు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 55 కుటుంబాలకు అందించడం జరిగిందన్నారు.

# పలువురిని పరామర్శించిన జక్కంపూడి



**సీతానగరం, జూన్ 17, (ప్రభాతవార్త) :** మండలంలోని చినకొండేపూడి, అచ్చియ్యపాలెం గ్రామాల్లో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. చినకొండేపూడిలో ఇటీవల మృతి చెందిన భూపతిరాజు రామరాజు, దేవపు నాగమణి, ఏపుగంటి మణికాంతం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చేకూరి సూర్యకాంతం, వడ్లమూడి లీల, ముసలి రత్నాజీలను పరామర్శించారు. అనంతరం అచ్చియ్యపాలెంలో అనారోగ్యంతో ఉన్న పేరబోయిన సూర్య చంద్రం, సామన సుబ్బారావులను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న , గంటా శ్రీనివాసరావు, పెందుర్తి దేవదాసు, చల్లమల్ల సుజీరాజు తదితరులు పాల్గొన్నారు.

# దమ్ము ట్రాక్టర్లతో రోడ్ల పై తిరిగితే చర్యలు తప్పవు.ఎస్సై వినయ్ ప్రతాప్



**అనపర్తి జూన్ 17 (ప్రభాత వార్త )** ఇనుప చక్రాలను అమర్చుకొని డ్రమ్ము ట్రాక్టర్లతో రోడ్లను ధ్వంసం చేస్తే అలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు చేపడతామని అనపర్తి ఎస్ఐ వినయ్ ప్రతాప్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనపర్తి మండల పరిధిలో ప్రస్తుతం వరి సాగు పనులు విస్తృతంగా జరుగుతునందున రైతులు ట్రాక్టర్లకు ఇనుప దమ్ము చక్రాలు అమర్చి పొలాలకు వెళ్లడం సాధారణంగా కనిపిస్తోంది. అయితే ఈ ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు ప్రజా రహదారులపై ప్రయాణించడం వల్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని. రోడ్ల ఉపరితలంపై గాట్లు పడటం, గుంతలు ఏర్పడటం, రహదారుల ఆయుష్షు తగ్గుతుందన్నారుఅదేవిధంగా, ఇనుప చక్రాలతో ప్రయాణించే ట్రాక్టర్ల వల్ల ఇతర వాహనదారులకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఏర్పడే గోతులు, మట్టి, బురద కారణంగా జారి పడే ప్రమాదం ఉందని చెప్పారు. వర్షాకాలంలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని కావున రైతులు, ట్రాక్టర్ యజమానులు ప్రజా రహదారులపై ఇనుప దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను నడపకుండా సహకరించవలసిందిగా కోరుతున్నాం, అన్నారు. . పొలాలకు వెళ్లవలసిన అవసరం ఉన్నప్పుడు ట్రాలీల ద్వారా లేదా ఇతర సురక్షిత మార్గాల ద్వారా దమ్ము చక్రాలను తరలించుకోవాలి. వ్యవసాయ అవసరాలు, ప్రజల భద్రత రెండింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి అని అన్నారు.ప్రజా ఆస్తులైన రహదారులను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇనుప దమ్ము చక్రాలతో రోడ్లపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్సై హెచ్చరించారు.

# అలంకార చేపల పెంపకంపై శిక్షణ



**కొత్తపల్లి, జూన్ 17 (ప్రభాతవార్త)** :మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకుని ఆర్థిక వృద్ధి సాధించాలని పిఠాపురం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (పాడా) పిడీ శివరామ్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రం కొత్తపల్లి మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం అలంకారం చేపల పెంపకంపై మహిళా సంఘాల సభ్యురాళ్లకు అవగాహనా కార్యక్రమాన్ని గ్రీన్ క్లైమేట్ ఫండ్ – తీర ప్రాంత ప్రజల్లో ప్రతికూల వాతావరణం పరిస్థితులను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించే (ఈసీఆర్ఐసీసీ)కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. పలువురు అధికారులు అలంకార చేపల పెంపకంలో పలు మెళు కువలను తెలియజేసారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps